సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 74

బుధవారం 5-6-2019




‘ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి’



## మన సమరం నేడే ఆరంభం

ప్రపంచ కప్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో తొలి మ్యాచ్ ఆడనున్న భారత్

- స్పోర్ట్స్‌లో



## శ్రీలంక గట్టెక్కింది..

అఫ్గానిస్తాన్‌పై 34 పరుగుల తేడాతో నెగ్గిన శ్రీలంక

- స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




# INDIRA IVF
FERTILITY & IVF CENTRE

ONE STEP TOWARDS PARENTHOOD

## ఇన్‌ఫెర్టిలిటీ గురించి భయపడకండి మీ కోసం నిర్ణయాలు తీసుకోండి
## ఈ రోజే మీ ఆప్షన్స్ అన్వేషించండి

ఇన్‌ఫెర్టిలిటీ చికిత్సలలో వైద్యపరంగా కొత్త విధానాలు మరియు ఆధునిక విధానాలు మీరు ఎప్పుడు సిద్ధంగా ఉంటే అప్పుడు మాతృత్వం పొందేందుకు తోడ్పడతాయి.



సంతానం లేని జంటలకు

# ఉచిత ఇన్‌ఫెర్టిలిటీ
## టెస్ట్ ట్యూబ్ బేబిపై కన్సల్టేషన్ శిబిరం

### ఇప్పుడు మీ నగరంలో

**కర్నూల్**
**8 జూన్ 2019**
SMS — IVF HK Send to 56677
ఉచిత కన్సల్టేషన్ కోసం మీ సీటు బుక్ చేసుకోడానికి IVF<space>HK అని టైప్ చేసి 56677కు SMS పంపండి

**గుంటూరు**
**9 జూన్ 2019**
SMS — IVF HG Send to 56677
ఉచిత కన్సల్టేషన్ కోసం మీ సీటు బుక్ చేసుకోడానికి IVF<space>HG అని టైప్ చేసి 56677కు SMS పంపండి

## అపాయింట్‌మెంట్ కోసం కాల్ చేయండి
## ✆ 7412077801/802

### కన్సల్టేషన్ కోసం ఎవరు ఎంచుకోవచ్చు

**పురుషులు**
- అతి తక్కువ వీర్యకణాల సంఖ్య
- వీర్యకణాలు అసలు లేకపోవడం
- వీర్యకణాలలో చలనం తక్కువగా ఉండడం
- నాణ్యత లేకపోవడం

**స్త్రీలు**
- ఫాలోపియన్ ట్యూబ్‌లు మూసుకుపోవడం
- అండం ఏర్పడడంలో సమస్య
- క్రమరహితమైన రుతుక్రమం
- అకాలంలో అండాల విడుదల

Disclaimer : The models used in the creative is just for illustration purpose only.

లభ్యమయ్యే సర్వీసులు : ఫెర్టిలిటీ చెకప్ • IUI • IVF • ICSI • లేజర్ హ్యాచింగ్ • బ్లాస్టోసిస్ట్ • ల్యాప్రోస్కోపి • హిస్టిరోస్కోపి • డోనార్ సర్వీసులు

**ఇందిర IVF హాస్పిటల్ ప్రై. లిమిటెడ్**
మహేష్ బ్యాంక్ ఎదురుగా, రోడ్ నం.12, A'La లిబర్టీ హోటల్ ప్రక్కన, బంజారాహిల్స్, హైదరాబాద్
**Helpline** 7412077801 / 802 | **Website** www.indiraivf.com | **Email** help@indiraivf.in

మా ఫెర్టిలిటీ నిపుణులతో మీ సందేహాల గురించి చర్చించడానికి కాల్ చేయండి ✆ 741 2077 804 (2 PM to 5 PM)

- 63 Centres PAN India
- Treatment protocol as per individual need
- Patient friendly treatment options

**Prenatal Sex Determination & Sex Selection is illegal and not done here.**

*This IVF package doesn't include any injections required other than IVF stimulation injection, surgeries like laproscopy & hysteroscopy, uterus treatment medicines, pharmacy oral drugs purchase. Donor charges if required for any patient will be additional.

## షకీబ్ @ 200

నేడు న్యూజిలాండ్‌తో బంగ్లాదేశ్ ‘ఢీ’

లండన్: పటిష్టమైన దక్షిణాఫ్రికాను ఓడించిన ఉత్సాహంతో ఉన్న బంగ్లాదేశ్ మరో విజయంపై కన్నేసింది. బుధవారం జరిగే మ్యాచ్‌లో మరో మేటి జట్టు న్యూజిలాండ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. ఇది బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌కు 200 మ్యాచ్. గతమ్యాచ్‌లో అతని ఆల్‌రౌండ్ నైపుణ్యంతోనే బోణీ కొట్టింది. ఇపుడు ఈ మ్యాచ్ కూడా గెలిస్తే షకీబ్‌కిది చిరస్మరణీయం కానుంది. బంగ్లాదేశ్ తరఫున 200 మ్యాచ్‌లు పూర్తి చేసుకోనున్న మూడో క్రికెటర్‌గా షకీబ్ గుర్తింపు పొందుతాడు. ఈ జాబితాలో బంగ్లాదేశ్ కెప్టెన్ మష్రఫె మొర్తజా (208 మ్యాచ్‌లు), ముష్ఫికర్ రహీమ్ (206 మ్యాచ్‌లు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. మరోవైపు కివీస్ అసాధారణ ఫామ్‌లో ఉంది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో చక్కని సమతూకంతో ఉంది. తొలి మ్యాచ్‌లో పది వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చిత్తు చేసింది. ఈ నేపథ్యంలో బంగ్లాకు ఇది క్లిష్టమైన మ్యాచే!

సాయంత్రం 6 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-3లో ప్రత్యక్ష ప్రసారం



# మన సమరం నేడే ఆరంభం




*టోర్నీ ప్రారంభమై ఆరు రోజులైంది...*
*అన్ని జట్లు మైదానంలో దిగాయి...*
*ఇప్పటికే ఏడు మ్యాచ్‌లు జరిగిపోయాయి...*
*చిన్నాచితక సంచలనాలూ నమోదయ్యాయి...*
*అయినా మన అభిమానుల్లో ఆ జోష్ లేదు...*
*వారందరి నుంచి ఎదురవుతోంది ఒకటే ప్రశ్న...*
*...ఈసారి ప్రపంచ కప్‌లో ఊపు లేదేందుకని?*
*...అంతా సాదాసీదాగా సాగుతుందేమని?*
*దీనికి సమాధానం నేడే దొరకనుంది.*
*వంద కోట్లమందిపైగా ఆశలను మోస్తూ...*
*అంచనాలు నిలబెట్టుకుంటామని భరోసా ఇస్తూ...*
*అదరగొట్టే ఆటతో కప్పు కొట్టుకొస్తామని ఊరిస్తూ...*
*విశ్వ విజేతగా మువ్వన్నెలను రెపరెపలాడిస్తామంటూ...*
*కోహ్లి సారథ్యంలోని భారత్ బరిలో దూకనుంది...*
*మరిక...*
*వినేవారికి వీనుల విందు*
*కళ్లారా చూసేవారికి చూడ ముచ్చట*
*టీవీల ముందు ప్రేక్షకులకు కన్నుల పండుగే!*
*వీరాభిమానులకైతే మజా మజానే!*
*ఇంకెందుకు ఆలస్యం...?*
*ఆసాంతం ఆస్వాదిద్దాం...*
*టీమిండియాకు శుభాభినందనలు చెబుదాం.*

### దక్షిణాఫ్రికాతో తొలి మ్యాచ్ ఆడనున్న టీమిండియా

- బరిలో దిగనున్న కేదార్ జాదవ్
- చహల్ లేదా జడేజా; షమీ లేదా భువనేశ్వర్
- స్టెయిన్ లేకుండానే సఫారీలు

మధ్యాహ్నం గం. 3 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

**సౌతాంప్టన్:** ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తూ, మన వీరుల ప్రతాపం ఎలా ఉంటుందోనన్న ఊహల్లో విహరిస్తూ, ఎవరెవరు అదరగొడతారని లెక్కలేసుకుంటూ వస్తున్న భారత క్రికెట్ అభిమానుల నిరీక్షణకు తెరపడే సమయం వచ్చింది. ప్రతిష్టాత్మక ప్రపంచ కప్ కోసం టీమిండియా పోరాటం బుధవారం నుంచే ప్రారంభం కానుంది. సౌతాంప్టన్ మైదానం వేదికగా విరాట్ కోహ్లి సేన తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. తగినంత విశ్రాంతితో, తీరైన సన్నాహంతో, మంచి ప్రాక్టీస్‌తో భారత్ బల ప్రదర్శనకు దిగనుండగా... పరాజయాలు, ఫామ్ లేమితో సఫారీల పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. వారికిది మూడో మ్యాచ్. ఇందులోనూ ఓడితే ఇకపై ప్రతి మ్యాచ్ నెగ్గితేనే కానీ కప్‌లో ముందుకెళ్లలేరు. మరోవైపు తుది కూర్పు కొలిక్కి వచ్చినట్లే కనిపిస్తున్న టీమిండియా తాజాగా ప్రయాణం ప్రారంభించనుంది.

### వారిలో ఎవరు?

సౌతాంప్టన్‌లో మబ్బులు కమ్మిన వాతావరణం ఎదురయ్యే వీలుండటంతో భారత్ రెండో ప్రధాన పేసర్‌గా భువనేశ్వర్‌ను ఆడించే యోచనలో ఉంది. టోర్నీలో ఫ్లాట్ వికెట్లపై షార్ట్ పిచ్ బంతులు వేయగల భువనేశ్వర్‌లాంటి బౌలర్లు విజయవంతం అవుతున్నారు. దీంతో షమీ స్థానంలో అతడిని తీసుకునే వీలుంది. ముగ్గురు పేసర్లనూ తీసుకుంటారని వార్తలు వచ్చినా అందుకు పెద్దగా అవకాశం లేదు. రెండో స్పిన్నర్ స్థానం కోసం జడేజా, చహల్ మధ్య పోటీ నెలకొంది. ఫిట్‌నెస్ సాధించిన మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ కేదార్ జాదవ్ మైదానంలో దిగడం ఖాయమైంది. స్పిన్ కూడా వేయగల అతడి చేరిక జట్టుకు బలాన్నిస్తుంది. ఐదో స్థానంలో ధోనినే రావొచ్చు. 6, 7లో జాదవ్, హార్దిక్ ఆడతారు. బ్యాట్ దూసే జడేజా, విలువైన పరుగులు చేయగల భువీని లెక్కలోకి తీసుకుంటే మొత్తం 9 మందితో లోతైన బ్యాటింగ్ ఆర్డర్ కనిపిస్తోంది.

### కష్టాల దక్షిణాఫ్రికా...

గత మ్యాచ్ ప్రారంభంలోనే ఇన్‌గిడి సేవలను కోల్పోయిన దక్షిణాఫ్రికాకు ప్రధాన పేసర్ స్టెయిన్ సైతం దూరమయ్యాడు. లెక్క ప్రకారం చూస్తే ఆ జట్టుకు ఇప్పుడు నలుగురే స్పెషలిస్ట్ బౌలర్లున్నారు. ఐదో బౌలర్ కోటాను మార్క్‌రమ్, డుమిని తదితరులతో భర్తీ చేయాల్సి వస్తోంది. వీరిలో రబడ మాత్రమే పక్కా పేసర్. మోరిస్, ఫెలుక్వాయోలకు ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను దెబ్బతీయగల సత్తా లేదు. బంగ్లాదేశ్ చేతిలో సఫారీల ఓటమికి సరైన బౌలింగ్ వనరులు లేకపోవడమూ ఓ కారణమైంది. వెటరన్ ఆమ్లా తిరిగి రావడం బ్యాటింగ్‌ను పటిష్ట పరుస్తోంది. ఈ జట్టులోనూ 9వ నంబరు స్థానం వరకు బ్యాటింగ్ చేయగల వారుండటం గమనార్హం. బౌలింగ్‌లో ఎలాగూ దమ్ము లేదు కాబట్టి... మొదట క్రీజులో దిగితే భారీ స్కోరు సాధించి ప్రత్యర్థిని సవాల్ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### మైదానం ఇలా...

సౌతాంప్టన్ మైదానంలో చివరి ఐదు వన్డేల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్టు సగటు స్కోరు 311. మూడు సార్లు తొలుత బ్యాటింగ్‌కు దిగిన జట్టే గెలిచింది. ఈ మ్యాచ్‌ల్లో పేసర్లు 6.4 ఎకానమీతో సగటున 58.4 పరుగులు ఇచ్చారు. స్పిన్నర్లు 6 ఎకానమీతో సగటున 60.1 పరుగులు ఇచ్చారు.

### ముఖాముఖి రికార్డు

ఇరు జట్లు ఇప్పటివరకు 83 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. భారత్ 34 మ్యాచ్‌ల్లో గెలుపొందగా... దక్షిణాఫ్రికా 46 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. మూడింట్లో ఫలితం తేలలేదు. ప్రపంచ కప్‌లో నాలుగు సార్లు ఎదురుపడగా భారత్ ఒక్కసారే (2015లో) నెగ్గింది. మిగతా మూడు సార్లు సఫారీలనే విజయం వరించింది.

### కమాన్ కోహ్లి...

రెండో ప్రాక్టీస్ మ్యాచ్‌లో కోహ్లి మంచి ఇన్నింగ్సే ఆడాడు. కప్ కోసం సంసిద్ధమైనట్లు కనిపించాడు. ఎప్పటిలాగే అతడు భారీ ఇన్నింగ్స్ ఆడాల్సిన అవసరం ఉంది. మార్చిలో ఆస్ట్రేలియా సిరీస్, తర్వాత ఐపీఎల్‌లో పెద్దగా ఆకట్టుకోని కోహ్లి కప్‌లో రాణిస్తే.. లోతైన బ్యాటింగ్ ఆర్డర్‌తో స్కోరును ముందుకు తీసుకెళ్లొచ్చు. అనుకోకుండా ఓపెనర్లు విఫలమైనా పెద్దగా ఇబ్బంది రాదు.

### రాహుల్... రాహుల్...

ఎంతో ఊగిసలాట మధ్య ఎట్టకేలకు నంబర్–4గా కేఎల్ రాహుల్ స్థానం ఖాయమైంది. టీవీ షో వివాదం నుంచి తేరుకుని, ఐపీఎల్‌లో సత్తా చాటిన రాహుల్... రెండో ప్రాక్టీస్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై సెంచరీ (108)తో తప్పక ఆడించే పరిస్థితి కల్పించాడు. ఇదే మ్యాచ్‌లో ఆల్‌రౌండర్‌గా వైఫల్యం, గాయం బెడద విజయ్ శంకర్‌ను పక్కనపెట్టేలా చేసింది. క్లాస్ బ్యాట్స్‌మన్ అయిన రాహుల్ అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటే భారత్ నిశ్చింతగా ఉండొచ్చు.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్, ధావన్, కోహ్లి (కెప్టెన్), రాహుల్, జాదవ్, ధోని, హార్దిక్, జడేజా/చహల్, కుల్దీప్, భువనేశ్వర్/షమీ, బుమ్రా.

**దక్షిణాఫ్రికా:** ఆమ్లా, డికాక్, డు ప్లెసిస్ (కెప్టెన్), డసెన్, మార్క్‌రమ్, మిల్లర్, డుమిని, మోరిస్, ఫెలుక్వాయో, తాహిర్, రబడ.

### పిచ్, వాతావరణం

వర్షం కారణంగా క్రితం రోజంతా పిచ్‌ను కవర్లతో కప్పి ఉంచారు. పచ్చికను పూర్తిగా తొలగించారు. మంగళవారం వర్షం కారణంగా భారత నెట్ ప్రాక్టీస్ సెషన్‌కు అంతరాయం కలిగింది. పిచ్ బ్యాటింగ్‌కు బాగా సహకరించే వీలుంది. బుధవారం వర్షం కురిసే అవకాశం తక్కువే అయినా... చల్లని వాతావరణం మ్యాచ్‌పై ప్రభావం చూపొచ్చు.

### శుభ సూచకం

మొత్తమ్మీద వన్డే గణాంకాలు చూసినా, కప్‌లో వారిపై గెలుపోటములు చూసినా దక్షిణాఫ్రికా కఠిన ప్రత్యర్థే. సఫారీలపై విజయం అంత తేలిక కాదని గత అనుభవాలు చెబుతున్నాయి. అంతేకాక, వరుసగా పెద్ద జట్లతో ఆడాల్సిన పరిస్థితుల్లో... దక్షిణాఫ్రికాను తొలి మ్యాచ్‌లోనే ఎదుర్కొనడం సహజంగానే ఒత్తిడి, ఉత్కంఠ రేపుతుంది. కానీ, ఈసారి ప్రత్యర్థిని ముందే దెబ్బతీసి కాలం పరోక్షంగా మనకు మేలు చేసింది. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడటంతో పాటు ప్రధాన ఆటగాళ్లు గాయాలతో అందుబాటులో లేకపోవడంతో దక్షిణాఫ్రికా ఒకవిధంగా ఆత్మరక్షణలో పడింది. దీంతో మానసికంగా భారత్‌దే పైచేయిగా ఉంది. ఈ ఆత్మవిశ్వాసంతో మైదానంలో రాణిస్తే టీమిండియాకు శుభారంభమే.

> ఎట్టకేలకు ప్రపంచ కప్‌లో మొదటి మ్యాచ్ ఆడబోతుండటం సంతోషంగా ఉంది. ఆలస్యంగా బరిలోకి దిగడం వల్ల మాకు కొంత మేలు జరిగిందనేది వాస్తవం. ఇతర జట్లు ఎలాంటి పరిస్థితుల్లో ఎలా ఆడుతున్నాయి, వాతావరణం ఎలా ఉంటోంది అనేవి పరిశీలించి, ప్రణాళికలు రూపొందించుకోవడానికి అవకాశం దక్కింది. అయితే ఎన్ని వ్యూహాలు పన్నినా మ్యాచ్ రోజున ఎలా ఆడతామనేదే ముఖ్యం. మా టీమ్ ఎలాంటి లోపాలు లేకుండా అన్ని రకాలుగా పటిష్టంగా ఉంది. ఎలాంటి స్థితినైనా ఎదుర్కోగల సత్తా అందరిలో ఉంది. పిచ్‌ను బట్టే తుది జట్టు ఎంపిక ఉంటుంది. తొలిసారి ప్రపంచకప్‌లో దేశానికి నాయకత్వం వహిస్తుండటం గర్వంగా అనిపిస్తోంది. 2015లో టోర్నీ ఆడేటప్పుడు దీని గురించి అసలు ఏమాత్రం ఊహించలేదు. వేరే సిరీస్‌లతో పోలిస్తే ప్రపంచ కప్ ఎప్పటికీ ప్రత్యేకమే. ఇక ప్రత్యర్థి జట్టుకు గాయాల సమస్య ఉంది కాబట్టి వారిని బలహీనంగా భావించడం లేదు. మేం ఎవరినీ తేలిగ్గా తీసుకోం. మా బలాన్నే నమ్ముకున్నా. స్టెయిన్ నాకు మంచి మిత్రుడు కూడా కాబట్టి అతను టోర్నీకి దూరం కావడం బాధగా అనిపిస్తోంది. 2017 చాంపియన్స్ ట్రోఫీ నుంచి కొన్ని పాఠాలైతే నేర్చుకున్నాం. ఇంగ్లండ్‌లో పరిస్థితుల దృష్ట్యా తొలి పది ఓవర్లు ఎంతో కీలకం. గత రెండు ప్రపంచ కప్‌ల తరహాలో తొలి మ్యాచ్‌లో నేను సెంచరీ కొట్టినా, కొట్టకపోయినా జట్టు గెలుపు అన్నింటికంటే ముఖ్యం.
>
> **- విరాట్ కోహ్లి, భారత్ కెప్టెన్**



> వరుసగా రెండు ఓటముల తర్వాత బాధ ఉండటం సహజమే. అయితే నాలాంటి సీనియర్లలో ఆత్మవిశ్వాసం లోపిస్తే తొలిసారి ప్రపంచ కప్ ఆడుతున్న కొత్త కుర్రాళ్లు మానసికంగా మరింత బేలగా తయారవుతారు. తమపై తామే జాలి పడేలా వారిని వదిలేయలేం. బలమైన మాటలతో వారిలో విశ్వాసం నింపడం ముఖ్యం. లేదంటే జట్టు మొత్తం కుప్పకూలిపోతుంది. మా ప్రయత్నంలో లోపం లేకుండా కష్టపడతాం. కానీ ఫలితం మా చేతుల్లో లేదు. భారత్‌తో మ్యాచ్‌ను చావో రేవోగా భావించి ఆడమని మావాళ్లకు చెబుతున్నా. స్టెయిన్ తప్పుకోవడంతో ఇప్పుడు మాకు బౌలింగ్ ప్రత్యామ్నాయాలు కూడా తక్కువగా ఉన్నాయి. గత రెండున్నరేళ్లుగా అతను గాయాలతో బాధపడ్డాడు. కోలుకుంటున్న సమయంలో ఐపీఎల్‌లో ఆ రెండు మ్యాచ్‌లు ఆడకుండా ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో.
>
> **-డు ప్లెసిస్, దక్షిణాఫ్రికా కెప్టెన్**

### స్టెయిన్ ఔట్

వరుసగా రెండు పరాజయాలతో కుంగిపోయిన దక్షిణాఫ్రికాకు భారత్‌తో కీలక మ్యాచ్‌కు ముందు పెద్ద దెబ్బ. ఆ జట్టు ప్రధాన పేసర్ డేల్ స్టెయిన్ భుజం గాయంతో మొత్తం ప్రపంచ కప్‌కే దూరమయ్యాడు. అతడి స్థానంలో ఎడమచేతి వాటం పేసర్ హెన్‌డ్రిక్స్‌ను తీసుకునేందుకు ఐసీసీ ప్రపంచ కప్ టెక్నికల్ కమిటీ అనుమతిచ్చింది. ఈ కప్‌లో దక్షిణాఫ్రికా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ బరిలో దిగని స్టెయిన్... చికిత్సతోనూ కోలుకోలేదని దక్షిణాఫ్రికా బోర్డు ప్రకటించింది.

## ఫెడరర్ X నాదల్





- ఎనిమిదేళ్ల తర్వాత ఫ్రెంచ్ ఓపెన్‌లో తలపడనున్న చిరకాల ప్రత్యర్థులు
- క్వార్టర్స్‌లో వావ్రింకాపై ఫెడరర్; నిషికోరిపై నాదల్ గెలుపు

**పారిస్:** తమ విజయ పరంపర కొనసాగిస్తూ ఫెడరర్ (స్విట్జర్లాండ్), రాఫెల్ నాదల్ (స్పెయిన్) ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో నాదల్ (స్పెయిన్) 6–1, 6–1, 6–3తో ఏడో సీడ్ నిషికోరి (జపాన్)ను... మూడో సీడ్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) 7–6 (7/4), 4–6, 7–6 (7/5), 6–4తో మాజీ చాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్)ను ఓడించారు. ఫ్రెంచ్ ఓపెన్‌లో వీరిద్దరు తలపడనుండటం 2011 తర్వాత ఇదే తొలిసారి కానుంది. ఓవరాల్‌గా వీరిద్దరు ఫ్రెంచ్ ఓపెన్‌లో ఐదుసార్లు తలపడగా... ఐదు సార్లూ నాదల్‌నే విజయం వరించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో జొహానా కొంటా (బ్రిటన్) 6–1, 6–4తో స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)పై గెలిచింది. 1983లో జో డ్యూరీ తర్వాత ఈ టోర్నీలో సెమీస్ చేరిన తొలి బ్రిటన్ ప్లేయర్‌గా గుర్తింపు పొందింది.

# శ్రీలంక గట్టెక్కింది

### చేజేతులా ఓడిన అఫ్గానిస్తాన్

- 34 పరుగులతో పరాజయం
- రాణించిన కుశాల్ పెరీరా
- నువాన్ ప్రదీప్‌కు 4 వికెట్లు



నువాన్ ప్రదీప్

**కార్డిఫ్:** వరల్డ్ కప్‌లో మాజీ చాంపియన్ శ్రీలంక బోణీ చేసింది. తొలి మ్యాచ్‌లో ఘోర పరాభవం తర్వాత విమర్శలకు గురైన ఆ జట్టు రెండో పోరులో అఫ్గానిస్తాన్‌ను ఓడించి పరువు కాపాడుకుంది. బౌలింగ్‌లో కనబర్చిన స్ఫూర్తిదాయక ఆటతీరును బ్యాటింగ్‌లో చూపించలేని అఫ్గాన్ స్వయంకృతంతో అరుదైన విజయం సాధించే అవకాశాన్ని చేజార్చుకుంది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక 34 పరుగులతో అఫ్గానిస్తాన్‌ను ఓడించింది. మధ్యలో వర్షం కారణంగా ఆటకు అంతరాయం కలగడంతో మ్యాచ్‌ను 41 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లంక 36.5 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది. కుశాల్ పెరీరా (81 బంతుల్లో 78; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. మొహమ్మద్ నబీ (4/30) ప్రత్యర్థిని పడగొట్టాడు. అఫ్గానిస్తాన్ విజయలక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 187 పరుగులుగా నిర్ణయించారు. అఫ్గాన్ 32.4 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌటైంది. నజీబుల్లా (56 బంతుల్లో 43; 6 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ నువాన్ ప్రదీప్ (4/31), మలింగ (3/39) అఫ్గాన్‌ను దెబ్బ తీశారు.

**ఒకే ఓవర్లో నబీ 3 వికెట్లు:** శ్రీలంక ఓపెనర్లు కుశాల్ పెరీరా, కరుణరత్నే (45 బంతుల్లో 30; 3 ఫోర్లు) చక్కటి సమన్వయంతో ఆడుతూ శుభారంభం అందించారు. మొదటి వికెట్‌కు 13 ఓవర్లలోనే 92 పరుగులు జోడించడం విశేషం. కరుణరత్నేను నబీ ఔట్ చేయడంతో లంక తొలి వికెట్ కోల్పోయింది. ఇన్నింగ్స్ 22వ ఓవర్లో నబీ మూడు వికెట్లు తీసి లంకను దెబ్బ కొట్టాడు. ముందుగా తిరిమన్నె బౌల్డ్ కాగా... కుశాల్ మెండిస్ (2), మాథ్యూస్ (0) కూడా పెవిలియన్ చేరారు. ఆ తర్వాతి నుంచి లంక పతనం వేగంగా సాగింది. సునాయాస లక్ష్య ఛేదనలో అఫ్గానిస్తాన్ బ్యాటింగ్ తడబడింది. చేయాల్సిన రన్‌రేట్ 4.5 పరుగులే ఉన్నా, ఆ జట్టు ఆటగాళ్లు అనవసర ఒత్తిడికి లోనై వరుసగా వికెట్లు సమర్పించుకున్నారు.

**స్కోరు వివరాలు : శ్రీలంక ఇన్నింగ్స్:** కరుణరత్నే (సి) నజీబుల్లా (బి) నబీ 30; కుశాల్ పెరీరా (సి) షహజాద్ (బి) రషీద్ 78; తిరిమన్నె (బి) నబీ 25; కుశాల్ మెండిస్ (సి) రహమత్ షా (బి) నబీ 2; మాథ్యూస్ (సి) రహమత్ షా (బి) నబీ 0; ధనంజయ (సి) షహజాద్ (బి) హమీద్ 0; తిసారా పెరీరా (రనౌట్) 2; ఉడాన (బి) దౌలత్ 10; లక్మల్ (నాటౌట్) 15; మలింగ (బి) దౌలత్ 4; ప్రదీప్ (బి) రషీద్ 0; ఎక్స్‌ట్రాలు 35; **మొత్తం (36.5 ఓవర్లలో ఆలౌట్) 201.**

**వికెట్ల పతనం:** 1–92, 2–144, 3–146, 4–146, 5–149, 6–159, 7–178, 8–180, 9–199, 10–201. **బౌలింగ్:** దౌలత్ 6–0–34–2, హమీద్ 7–0–53–1, ముజీబ్ 3–0–19–0, నబీ 9–0–30–4, గుల్బదిన్ 4–0–38–0, రషీద్ ఖాన్ 7.5–1–17–2.

**అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్:** షహజాద్ (సి) కరుణరత్నే (బి) మలింగ 7; హజ్రతుల్లా (సి) తిసారా పెరీరా (బి) ప్రదీప్ 30; రహమత్ షా (సి) మాథ్యూస్ (బి) ఉడాన 2; హష్మతుల్లా (సి) కుశాల్ పెరీరా (బి) ప్రదీప్ 4; నబీ (బి) తిసారా పెరీరా 11; గుల్బదిన్ (ఎల్బీ) (బి) ప్రదీప్ 23; నజీబుల్లా (రనౌట్) 43; రషీద్ ఖాన్ (బి) ప్రదీప్ 2; దౌలత్ (బి) మలింగ 6; హమీద్ హసన్ (బి) మలింగ 6; ముజీబ్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు 17, **మొత్తం (32.4 ఓవర్లలో ఆలౌట్) 152.**

**వికెట్ల పతనం:** 1–34, 2–42, 3–44, 4–57, 5–57, 6–121, 7–123, 8–136, 9–145, 10–152. **బౌలింగ్:** మలింగ 6.4–0–39–3, లక్మల్ 6–0–27–0, ఉడాన 6–0–28–1, నువాన్ ప్రదీప్ 9–1–31–4, తిసారా పెరీరా 4–0–19–1, ధనంజయ 1–0–7–0.

### ఈ ఇద్దరు ఏం చేస్తారో?

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ప్రపంచ నంబర్ వన్ ఓపెనింగ్ జోడీ రోహిత్–ధావన్. కానీ, కొంతకాలంగా ఇద్దరి భాగస్వామ్యంలో పరుగులు రావడం లేదు. రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లోనూ (శిఖర్ 2, 1, రోహిత్ 2, 19) విఫలమయ్యారు. వ్యక్తిగతంగా ధావన్ ఫర్వాలేకున్నా, ఐపీఎల్ సహా రోహిత్ ఫామ్ పేలవంగా ఉంది. కీలక మ్యాచ్‌ల్లో వీరి రాణింపుపైనే మన విజయం ఆధారపడి ఉంటుంది. ఐసీసీ టోర్నీల్లో ధావన్ నిలకడగా ఆడతాడు. రోహిత్ ఊపులోకి రావడానికి ఒక్క మ్యాచ్ చాలు. వీరిద్దరూ ఇక్కడే జరిగిన గత రెండు చాంపియన్స్ ట్రోఫీల్లో దుమ్మురేపిన నేపథ్యంలో తిరిగి లయ అందుకుంటారని ఆశించవచ్చు.



### బూమ్‌రా... బూమ్‌రా...



అద్భుత ఫామ్‌లో ఉన్న బుమ్రాను ఎదుర్కొనడం ఇప్పుడు ఎంతటి బ్యాట్స్‌మన్‌కైనా క్లిష్టమే. అటు పరుగులు నిరోధిస్తూ, ఇటు వికెట్లు తీస్తూ పూర్తి ఓవర్ల కోటా వేస్తున్న బుమ్రా బౌలింగ్ పదునేంటో ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో చూపించాడు. మరీ ముఖ్యంగా చివరి ఓవర్లలో అతడిని కాచుకోవడం ప్రత్యర్థులకు మింగుడుపడనిదే.

బుధవారం 5-6-2019


‘ప్రజాసేవలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా చిరునవ్వుతో ఎదుర్కొంటా’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 74

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


పాఠకులు, ఏజెంట్లు,
ప్రకటనకర్తలు,
శ్రేయోభిలాషులకు
సాక్షి రంజాన్
శుభాకాంక్షలు
వై.ఎస్. భారతి
చైర్‌పర్సన్


మంగళవారం ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను శాలువాతో సత్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

# అవినీతి రహిత పాలన దిశగా..

**హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో జ్యుడిషియల్ కమిషన్**

- హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిని కోరిన సీఎం వైఎస్ జగన్
- నీతిమంతంగా నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపడతాం
- టెండర్ల ప్రక్రియను న్యాయ వ్యవస్థ చేతిలో పెడతాం
- కమిషన్ సూచన మేరకు టెండర్ల ప్రక్రియలో మార్పులు చేస్తాం
- దేశమంతా ఏపీవైపు చూసేలా టెండర్ విధానంలో సంస్కరణలకు సిద్ధం

7లో


మంగళవారం విశాఖలోని శారదాపీఠంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఆశీర్వదిస్తూ నుదుటిమీద బొట్టుపెడుతున్న స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి

4లో



## ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారుగా అజేయ కల్లం

సీఎంవో అధిపతిగా కార్యదర్శులకు శాఖలు కేటాయించే అధికారం

మూడేళ్ల పాటు పదవిలో కొనసాగేలా ఉత్తర్వులు

- వివరాలు 7లో

# భారీగా అధికారుల బదిలీలు

**దాదాపు 50 మంది ఐఏఎస్‌లకు స్థాన చలనం**

**తొమ్మిది జిల్లాలకు కొత్త కలెక్టర్లు**
**సీనియర్లకు తగిన ప్రాధాన్యం**

- సీఆర్‌డీఏ పూర్తి స్థాయిలో ప్రక్షాళన.. కొత్త కమిషనర్‌గా లక్ష్మీనరసింహం
- జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్‌గా ఆదిత్యనాథ్ దాస్
- ఉన్నతవిద్య ప్రత్యేక సీఎస్‌గా జె.ఎస్.వి.ప్రసాద్
- ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్‌డీగా జె.మురళి
- జీఏడీలో రిపోర్ట్ చేయాలని పలువురు అధికారులకు ఆదేశం

2లో







## ఇంజనీరింగ్‌లో బాలురు..

# అగ్రి-మెడికల్‌లో బాలికల హవా

**ఎంసెట్-2019 ఫలితాలు విడుదల • టాప్ టెన్ ర్యాంకుల్లో బాలురదే పైచేయి**

**ఇంజనీరింగ్‌లో 74.39 శాతం • అగ్రి-మెడికల్‌లో 83.64 శాతం ఉత్తీర్ణత**

- ర్యాంకర్లలో 9 మంది తెలంగాణ విద్యార్థులు.. ఒకరు బిహారీ
- ఇంజనీరింగ్‌లో 10 ప్రశ్నలకు, అగ్రి-మెడికల్‌లో మూడు ప్రశ్నల సమాధానాల ఆప్షన్‌లలో మార్పులు.. తెలంగాణ ఇంటర్ ఫలితాల వివాదంతో ఇక్కడ జాప్యం
- 18లోగా అడ్మిషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు

7లో

ఇంజనీరింగ్ విభాగంలో..

మొదటి ర్యాంక్

కె.రవి శ్రీతేజ

రెండో ర్యాంక్

పి.వేద ప్రణవ్

అగ్రి, మెడికల్ విభాగంలో..

మొదటి ర్యాంక్

సాయి స్వాతి

రెండో ర్యాంక్

దాసరి కిరణ్



## అడ్వొకేట్ జనరల్‌గా శ్రీరామ్

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

నేడు బాధ్యతల స్వీకరణ

- 2లో









# ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా సీతారామాంజనేయులు

- హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా కిషోర్‌కుమార్.. జీఏడీకి అనురాధ
- రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా సవాంగ్‌కు అదనపు బాధ్యతలు
- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా రాజేంద్రనాథ్‌రెడ్డి

**సాక్షి, అమరావతి :** ఏపీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి పి.సీతారామాంజనేయులు నియమితులయ్యారు. ఏపీ కేడర్‌కు చెందిన ఆయన గడిచిన ఐదేళ్లుగా డిప్యుటేషన్‌పై సెంట్రల్ సర్వీసుకు వెళ్లారు. కొద్ది రోజుల క్రితం రిలీవై ఏపీ కేడర్‌కు వచ్చిన ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకు ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పనిచేసిన బాలసుబ్రమణ్యంను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసిన ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. రైల్వే డైరెక్టర్ జనరల్ కేఆర్‌ఎం కిషోర్‌కుమార్‌కు రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఏఆర్ అనురాధను వేరొక పోస్టింగ్ ఇచ్చే వరకు జీఏడీకి రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. డీజీపీ డి.గౌతమ్ సవాంగ్‌కు ఏపీ రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయన ఇప్పటి వరకు నిర్వహించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. డ్రగ్స్ డీజీగా ఉన్న కసిరెడ్డి వెంకట రాజేంద్రనాథ్‌రెడ్డిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు.

# భారీగా బదిలీలు

**దాదాపు 50 మంది ఐఏఎస్‌లకు స్థాన చలనం**

- తొమ్మిది జిల్లాలకు కొత్త కలెక్టర్లు
- సీనియర్లకు తగిన ప్రాధాన్యం
- సీఆర్‌డీఏ పూర్తి స్థాయిలో ప్రక్షాళన.. కొత్త కమిషనర్‌గా లక్ష్మీనరసింహం
- జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్‌గా ఆదిత్యనాథ్ దాస్
- ఉన్నతవిద్య ప్రత్యేక సీఎస్‌గా జె.ఎస్.వి.ప్రసాద్
- ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్‌డీగా జె.మురళి
- జీఏడీలో రిపోర్ట్ చేయాలని పలువురు అధికారులకు ఆదేశం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా అధికార యంత్రాంగాన్ని పెద్ద ఎత్తున బదిలీలు చేస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాదాపు 50 మంది ఐఏఎస్ అధికారులకు స్థాన చలనం కల్పించారు. సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యంతో పాటు సీఎం ముఖ్య సలహాదారుగా నియమించిన అజేయ కల్లంతో చర్చించి, సీనియర్లకు తగిన ప్రాధాన్యం ఇస్తూ బదిలీలపై సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలలో భాగంగా రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ)ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశారు. సీఆర్‌డీఏ కమిషనర్, అదనపు కమిషనర్‌లను బదిలీ చేశారు. సీఆర్‌డీఏ కొత్త కమిషనర్‌గా లక్ష్మీనరసింహంను నియమించారు. జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో ఆదిత్యనాథ్ దాస్‌ను నియమించారు. శశిభూషణ్ కుమార్‌ను జీఏడీలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. సీఆర్‌డీఏ కమిషనర్, జెన్‌కో మాజీ ఎండీతో పాటు పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్‌డీగా ఐఏఎస్ అధికారి జె.మురళిని నియమించారు. ఉభయ గోదావరి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, విశాఖపట్టణం, అనంతపురం, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు.

| అధికారి పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| 1. జె.ఎస్.వి. ప్రసాద్ | కార్మిక ఉపాధి కల్పన ప్రత్యేక సీఎస్ | ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక సీఎస్ (పశుసంవర్ధక శాఖ అదనపు బాధ్యతలు) |
| 2. నీరబ్‌కుమార్ ప్రసాద్ | రహదారులు–భవనాలు ప్రత్యేక సీఎస్ | అటవీ పర్యావరణం ప్రత్యేక సీఎస్ |
| 3. ఆధిత్యనాథ్ దాస్ | పాఠశాల విద్య ప్రత్యేక సీఎస్ | జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ |
| 4. శశిభూషణ్ కుమార్ | జలవనరుల శాఖ కార్యదర్శి | జీఏడీలో రిపోర్ట్ |
| 5. పూనం మాలకొండయ్య | వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక సీఎస్ | వ్యవసాయ శాఖ ప్రత్యేక సీఎస్ |
| 6. కరికాల వలవన్ | మున్సిపల్ ప్రత్యేక సీఎస్ | బీసీ సంక్షేమం ప్రత్యేక సీఎస్ |
| 7.రజత్ భార్గవ్ | పోస్టింగ్ కోసం వెయిటింగ్ | పరిశ్రమల, వాణిజ్య ముఖ్యకార్యదర్శి |
| 8. కె.ఎస్.జవహర్‌రెడ్డి | పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి | వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ముఖ్యకార్యదర్శి |
| 9. జి.అనంతరాం | అటవీ పర్యావరణ ముఖ్యకార్యదర్శి | గృహ నిర్మాణ ముఖ్యకార్యదర్శి |
| 10. కె.ప్రవీణ్ కుమార్ | సాధారణ పరిపాలన ముఖ్యకార్యదర్శి | పర్యాటక, యువజన సర్వీసుల ముఖ్యకార్యదర్శి |
| 11. అజయ్‌జైన్ | ఇంధన, మౌలిక వసతులు, సీఆర్‌డీఏ ముఖ్యకార్యదర్శి | జీఏడీలో రిపోర్టింగ్ |
| 12. రాం ప్రకాశ్ సిసోడియా | గిరిజన సంక్షేమ ముఖ్యకార్యదర్శి | సాధారణ పరిపాలన (పొలిటికల్) ముఖ్యకార్యదర్శి |
| 13. కె.విజయానంద్ | ఏపీ జెన్‌కో ఎండీ | జీఏడీలో రిపోర్టింగ్ |
| 14. బి.రాజశేఖర్ | వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి | పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి |
| 15. ఎం.టి.కృష్ణబాబు | పోస్టింగ్ కోసం వెయిటింగ్ | రహదారులు–భవనాల ముఖ్యకార్యదర్శి |
| 16. కె.దమయంతి | ఉన్నత విద్య ముఖ్యకార్యదర్శి | మహిళా శిశు సంక్షేమ ముఖ్యకార్యదర్శి |
| 17. జె. శ్యామలరావు | వాణిజ్య పన్నుల కమిషనర్ | మున్సిపల్ కార్యదర్శి |
| 18. ఎన్. శ్రీకాంత్ | సాధారణ పరిపాలన (పొలిటికల్) కార్యదర్శి | ఇంధన శాఖ కార్యదర్శి, ట్రాన్స్ సీఎండీ |
| 19. ముఖేశ్‌కుమార్ మీనా | ఎక్సైజ్ కమిషనర్ | సాంఘిక, గిరిజన సంక్షేమ కార్యదర్శి |
| 20. బి.శ్రీధర్ | పశు సంవర్ధక కార్యదర్శి | ఏపీ.జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ |
| 21. కె.శశిధర్ | గుంటూరు కలెక్టర్ | పౌరసరఫరాల కమిషనర్ |
| 22. వరప్రసాద్ | పౌరసరఫరాల కమిషనర్ | జీఏడీలో రిపోర్టింగ్ |
| 23. వై.మధుసూదన్‌రెడ్డి (ఐఎఫ్‌ఎస్) | మార్క్‌ఫెడ్ ఎండీ | మార్కెటింగ్, సహకార ప్రత్యేక కార్యదర్శి |
| 24. శామ్యూల్ ఆనంద్‌కుమార్ | మార్కెటింగ్ ప్రత్యేక కమిషనర్ | గుంటూరు కలెక్టర్ |
| 25. పి. భాస్కర | సాంఘిక సంక్షేమ ప్రత్యేక కమిషనర్ | ప్రకాశం కలెక్టర్ |
| 26. డి. మురళీధర్ రెడ్డి | వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ | తూర్పుగోదావరి కలెక్టర్ |
| 27. కార్తికేయ మిశ్రా | తూర్పుగోదావరి కలెక్టర్ | జీఏడీలో రిపోర్టింగ్ |
| 28. ఎం.వి. శేషగిరి బాబు | శాప్ ఎండీ | నెల్లూరు కలెక్టర్ |
| 29. ఎస్.సత్యనారాయణ | కర్నూలు కలెక్టర్ | అనంతపురం కలెక్టర్ |
| 30. ముత్యాల రాజు | నెల్లూరు కలెక్టర్ | పశ్చిమగోదావరి కలెక్టర్ |
| 31. వి.వినయ్‌చంద్ | ప్రకాశం కలెక్టర్ | విశాఖపట్టణం కలెక్టర్ |
| 32. జి.వీరపాండ్యన్ | అనంతపురం కలెక్టర్ | కర్నూలు కలెక్టర్ |
| 33. నారాయణ భరత్ గుప్తా | మంచినీటి సరఫరా సంస్థ ఎండీ | చిత్తూరు కలెక్టర్ |
| 34. పీయూష్ కుమార్ | ఆర్థిక శాఖ కార్యదర్శి | వాణిజ్య పన్నుల కమిషనర్ |
| 35. కాంతిలాల్ దండే | గృహనిర్మాణం ఎండీ | ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ |
| 36. జి.విజయ్‌కుమార్ | ఎస్సీ ఆర్థిక సహకార సంస్థ ఎండీ | మున్సిపల్ పరిపాలన కమిషనర్ |
| 37. కన్నబాబు | మున్సిపల్ పరిపాలన కమిషనర్ | జీఏడీలో రిపోర్టింగ్ |
| 38. ఎం.గిరిజా శంకర్ | పోస్టింగ్ కోసం వెయిటింగ్ | పంచాయతీరాజ్ కమిషనర్ |
| 39. రంజిత్ బాషా | పంచాయతీరాజ్ కమిషనర్ | జీఏడీలో రిపోర్టింగ్ |
| 40. పి.లక్ష్మీనరసింహం | సాధారణ పరిపాలన (సర్వీసెస్) కార్యదర్శి | సీఆర్‌డీఏ కమిషనర్ |
| 41. సీహెచ్. శ్రీధర్ | సీఆర్‌డీఏ కమిషనర్ | జీఏడీలో రిపోర్టింగ్ |
| 42. కాటమనేని భాస్కర్ | విశాఖపట్టణం కలెక్టర్ | శాప్ ఎండీ |
| 43. పి.ప్రద్యుమ్న | చిత్తూరు కలెక్టర్ | మార్కెటింగ్ శాఖ ప్రత్యేక కమిషనర్ |
| 44.ముదావత్ ఎం నాయక్ | ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ | ఎక్సైజ్ కమిషనర్ |
| 45. కె. హర్షవర్ధన్ | ఉన్నత విద్య ఉప కార్యదర్శి | సాంఘిక సంక్షేమ డైరెక్టర్ |
| 46. ప్రవీణ్‌కుమార్ | పశ్చిమగోదావరి కలెక్టర్ | వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ |
| 47. జె.మురళి | సహకార శాఖ ప్రత్యేక కమిషనర్ | సీఎంఓలో ఓఎస్‌డీ |
| 48. కె. విజయ | పర్యాటక అథారిటీ సీఈవో | సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ |
| 49. షాన్‌మోహన్ | సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ | జీఏడీలో రిపోర్టింగ్ |
| 50 చిరంజీవి చౌదరి (ఐఎఫ్‌ఎస్) | ఉద్యానవన కార్యదర్శి | ఉద్యానవన కమిషనర్ |

## ప్రొటెం స్పీకర్‌గా శంబంగి?



**సాక్షి, అమరావతి :** నూతనంగా సమావేశం కానున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ప్రొటెం స్పీకర్‌గా విజయనగరం జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు నియమితులవుతారని విశ్వసనీయ సమాచారం. శంబంగి బొబ్బిలి శాసనసభా నియోజకవర్గం నుంచి ఇప్పటికి 4సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ఆయన మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావును ఓడించారు. ప్రొటెం స్పీకర్‌గా నియమితులైతే శంబంగి శాసనసభ సమావేశాల తొలి రోజున కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ తరువాత శాసనసభ స్పీకర్ ఎన్నికను కూడా నిర్వహించాల్సి ఉంటుంది. కొత్తగా ఎన్నికైన స్పీకర్‌కు పదవీ బాధ్యతలు అప్పగించిన తరువాత ఆయన పదవీకాలం ముగుస్తుంది.

## ఏజీగా శ్రీరామ్

### నేడు బాధ్యతల స్వీకరణ



**సాక్షి, అమరావతి:** రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ)గా సుబ్రహ్మణ్యం శ్రీరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ ఎల్.వి.సుబ్రహ్మణ్యం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే సమయంలో టీడీపీ హయాంలో ఏజీగా వ్యవహరించిన దమ్మాలపాటి శ్రీనివాస్ రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. బుధవారం ఉదయం హైకోర్టులో ఏజీగా శ్రీరామ్ బాధ్యతలు స్వీకరిస్తారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే అడ్వొకేట్ జనరల్‌గా శ్రీరామ్‌ను నియమించాలని నిర్ణయించారు. శ్రీరామ్ 1969లో జన్మించారు. 1992 ఆగస్టు 27న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయిన ఆయన మొదట న్యాయవాది సి.వి.రాములు వద్ద పనిచేశారు. రాములు హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తరువాత శ్రీరామ్ స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. అనతి కాలంలోనే రాజ్యాంగపరమైన కేసులతో పాటు, సివిల్ కేసులు, సర్వీసు వివాదాల కేసులు, విద్యా రంగానికి సంబంధించిన కేసుల్లో మంచి పట్టు సాధించారు. 2009 నుంచి 2011 వరకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిగా శ్రీరామ్ వ్యవహరించారు.









# ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాపాలన



పెన్సిల్వేనియాలో ప్రవాసాంధ్రుల విజయోత్సవ సభ

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో గత పదేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావటంతో మళ్లీ ప్రజాపాలన వచ్చిందని అమెరికాలోని పెన్సిల్వేనియా వైఎస్సార్‌సీపీ రీజనల్ ఇన్‌ఛార్జి శనివరపు వెంకటరామిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంగా మంగళవారం పెన్సిల్వేనియా స్టేట్ కాపిటల్ హ్యారిస్ బర్గ్ నగరంలో విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. అవినీతి పాలనపై చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌కు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారన్నారు. పాలకులు సరైన మార్గంలో నడవకపోతే ప్రజలు సహించరనేందుకు ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ప్రవాసాంధ్రులు మొత్తం ప్రభుత్వానికి అండగా ఉంటామని, సీఎం వైఎస్ జగన్ కోసం తాము పనిచేస్తామని ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ అమెరికా యువజన విద్యార్థి సంఘాల కన్వీనర్ గోగులమూడి సాత్విక్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్ విజయం ఏపీ చరిత్రలో నిలిచి పోతుందన్నారు. కాగా, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ నేత పీవీపీ వీడియో సందేశం ద్వారా ప్రవాసాంధ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హ్యారిస్ బర్గ్ వైఎస్సార్‌సీపీ నాయకులు సునంద, మల్లికార్జున్ కసిరెడ్డి, రాజశేఖర్ గాదె, తేజ బంక (బంటీ), బాబా సొంత్యాన, బసవ శంకర్, రాజశేఖర్ నరెడ్ల, ప్రవీణ్ పట్టెంగురు, సత్య ఏడెం, రఘు కటం, పురుషోత్తం కొమ్మిరెడ్డి, వంశీ కృష్ణ, రవీందర్, సమంత్, సిద్ధార్థ, వీర, ప్రకాష్, శశాంక్, కిరణ్ ఎల్వీ, అంజిరెడ్డి, నవీన్, ఫిలడెల్ఫియాకు చెందిన మధు గొనిపాటి, అల్లెన్ టౌన్ నుంచి లక్ష్మి నరసింహారెడ్డి కొండా తదితరులు పాల్గొన్నారు.



ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌కు చెక్కు అందజేస్తున్న స్టీల్ ప్లాంట్ సీఎండి రథ్

### ఒడిశా సీఎం సహాయ నిధికి

## స్టీల్‌ప్లాంట్ విరాళం

**ఉక్కునగరం (గాజువాక):** ఒడిశా ముఖ్యమంత్రి సహాయ నిధికి విశాఖ స్టీల్ ప్లాంట్ విరాళం అందజేసింది. ఫొని తుపాను వల్ల ఒడిశాకు జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల విరాళం, సీఎస్సార్ నిధుల కింద ఈ సాయం అందజేశారు. భువనేశ్వర్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌కు స్టీల్‌ప్లాంట్ సీఎండీ పి.కె.రథ్ రూ.1.4 కోట్లు చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు ఒడిశా మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సమస్యలపై నవీన్ పట్నాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్) కె.సి.దాస్, లైజన్ ఆఫీసర్ యు.ఎన్.బెహరా, బ్రాంచ్ మేనేజర్ ఎస్.కె.మిశ్రా, సీ ప్రధాన కార్యదర్శి కాటం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.




## ఒప్పంద టీచర్లకు మినిమమ్ టైం స్కేల్

### ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో గిరిజన విద్యాసంస్థలలోని ఒప్పంద రెసిడెన్షియల్ టీచర్లుగా ఉన్న పాఠశాల సహాయకులకు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు మినిమమ్ టైం స్కేలును వర్తింపజేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు గిరిజన సంక్షేమ విద్యాసంస్థల డైరక్టర్ గంధం చంద్రుడు ఉత్తర్వులు విడుదల చేశారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. వేతన సవరణ స్కేళ్లు–2015 ను అనుసరించి పాఠశాల సహాయకులకు రూ.22,290 నుంచి రూ.28,940లకు, ఎస్జీటీలకు రూ.16,350 నుంచి రూ.21,230లకు జీతం పెరగనుంది. ఈ వర్తింపు 2019 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానుంది. ఒప్పంద టీచర్లకు మినిమమ్ టైం స్కేలు వర్తింపజేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు.

## 7 నుంచి మైసూరుకు విమాన సర్వీసు



అలయన్స్ ఎయిర్ విమానం

**గన్నవరం:** పెరుగుతున్న విమాన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా గన్నవరం విమానాశ్రయానికి కొత్త సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు దేశీయంగా తొమ్మిది నగరాలకు, అంతర్జాతీయంగా సింగపూర్‌కు ఎయిర్‌లైన్స్ సంస్థలు సర్వీసులు నడుపుతున్నాయి. కొత్తగా కర్ణాటకలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన మైసూరుకు ఈనెల 7వ తేదీ నుంచి రోజువారీ విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. ఎయిరిండియా అనుబంధ సంస్థ అలయన్స్ ఎయిర్ ప్రస్తుతం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బెంగళూరుకు నడుపుతున్న విమాన సర్వీసును మైసూరు వరకు విస్తరించింది. ఈ విమానం రోజూ ఉదయం 8.20 గంటలకు బయలుదేరి 10.00కి బెంగళూరుకు చేరుకుంటుందని, అరగంట విరామం అనంతరం 10.30కి బయలుదేరి 11.25కి మైసూరుకు చేరుకుంటుందని ఎయిర్‌లైన్స్ వర్గాలు తెలిపాయి. తిరిగి మైసూరు నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి ఒంటి గంటకు బెంగళూరుకు చేరుకుంటుందని, 25 నిమిషాల విరామం తర్వాత 1.25కి అక్కడి నుంచి బయలుదేరి 2.55కి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఎయిర్‌లైన్స్ సంస్థ టిక్కెట్ల బుకింగ్‌ను ప్రారంభించింది.








విశాఖ శారదా పీఠంలో సీఎం వైఎస్ జగన్‌తో ఆప్యాయంగా మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ



రాజశ్యామల అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామీజీ ఆశీర్వాదం



వేద విద్యార్థుల మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అక్క చెల్లెమ్మలు, చిన్నారి కోరడంతో సెల్ఫీ దిగుతున్న సీఎం వైఎస్ జగన్

# నవ్యాంధ్ర సుభిక్షంగా ఉండాలి

**శారదా పీఠంలో సీఎం ప్రత్యేక పూజలు • రాజశ్యామల అమ్మవారిని దర్శించుకున్న వైఎస్ జగన్ • పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు**

**సాక్షి, విశాఖపట్నం:** నవ్యాంధ్ర సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ శారదా పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ జగన్ తొలిసారి మంగళవారం విశాఖ పర్యటనకు విచ్చేశారు. గన్నవరం నుంచి విమానంలో ఉదయం 11.45 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనకు ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల నుంచి వచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలతో పాటు పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రజా ప్రతినిధులు, నాయకులందరినీ ఆయన పేరుపేరునా పలకరించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఎన్‌ఏడీ, వేపగుంట మీదుగా మధ్యాహ్నం 12.20 గంటలకు పెందుర్తి మండలం చినముషిడివాడ గ్రామంలో ఉన్న శ్రీ శారదాపీఠానికి చేరుకున్నారు. పీఠం సంప్రదాయం ప్రకారం మేళతాళాల మధ్య గురువులు, వేద పండితులు ముఖ్యమంత్రికి పూర్ణ కుంభంతో వేదమంత్రోచ్చారణలతో స్వాగతం పలికారు. పీఠంలోని జగద్గురు సన్నిధిలో వేంచేసి ఉన్న పీఠాధిపతి శ్రీ శ్రీ స్వరూపా నందేంద్ర సరస్వతి స్వామిజీని వైఎస్ జగన్ దర్శించుకుని వారి ఆశీస్సులు అందుకున్నారు. స్వామిజీని తులసి, పుష్పమాలలతో సత్కరించి పట్టు వస్త్రాలు, పండ్లు బహూకరించారు. స్వామిజీతో కొద్దిసేపు మాట్లాడారు. భేటీ అనంతరం స్వామిజీతో కలిసి శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వర్ణమండపంలో కొలువైన అమ్మవారి సన్నిధిలో స్వామిజీ స్వయంగా పూజలు నిర్వహించి సీఎంను ఆశీర్వదించారు. అక్కడి నుంచి పీఠంలోని వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి, మేధా దక్షిణామూర్తి, దాసాంజనేయ స్వామి వార్ల దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శారదాంబ పీఠార్చన ప్రాంగణాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

### సింహాచలం వేద పండితుల ఆశీర్వాదం

సింహాచలం దేవస్థానం వేద పండితులు పీఠంలో సీఎంను దుశ్శాలువతో సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో చంద్రమోహన్ అప్పన్న చిత్రపటాన్ని, స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. పీఠంలో సుమారు రెండు గంటల పాటు గడిపిన ముఖ్యమంత్రి, మధ్యాహ్నం 2.35 గంటలకు బయల్దేరగా, పీఠం ఉత్తరాధికారి బాల స్వామి, ధర్మాధికారి జి.కామేశ్వరశర్మ, పీఠం ప్రతినిధులు సాదరంగా వీడ్కోలు పలికారు. మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో గన్నవరం బయల్దేరారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట రాజ్యసభ సభ్యులు వి.విజయ సాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, ముఖ్యమంత్రి రాజకీయ వ్యవహారాల సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, గొడ్డేటి మాధవి, డాక్టర్ భీశెట్టి సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బొత్స సత్యనారాయణ, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అన్నంరెడ్డి అదీప్ రాజ్, తిప్పల నాగిరెడ్డి, బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్‌నాథ్, అవంతి శ్రీనివాస్, పెట్ల ఉమా శంకర గణేష్, చెట్టి ఫల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, గొల్ల బాబూరావు, కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు, ధర్మాన కృష్ణదాస్, విశ్వసరాయ కళావతి, చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, జక్కంపూడి రాజా, కురసాల కన్నబాబు, తెర్లం బాలరాజు, కంబాల జోగులు, కడుబండి శ్రీనివాస్, కారుమూరి నాగేశ్వర రావు, మాజీ మంత్రులు దాడి వీరభద్రరరావు, బలిరెడ్డి సత్యారావు, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సాయంత్రం 3.40 గంటలకు వైజాగ్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న సీఎం వైఎస్ జగన్ తిరిగి తాడేపల్లికి బయలుదేరారు.

## సీఎం వైఎస్ జగన్‌కు ఆశా వర్కర్ల కృతజ్ఞతలు

**విశాఖ పర్యటనలో దారి పొడవునా బారులు తీరి సీఎంకు జేజేలు**

**సాక్షి, అమరావతి/ సాక్షి, విశాఖపట్నం/ మెళియాపుట్టి:** కనీవిని ఎరుగని రీతిలో ఆశా వర్కర్ల గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆశా వర్కర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక తమ వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి విశాఖ నగర పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు అడుగడుగునా ఆశా కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి చినముషిడివాడలోని శ్రీ శారదాపీఠం వరకు వందలాది మంది ఆశా వర్కర్లు బారులు తీరి జేజేలు పలికారు. వారికి సీఎం వైఎస్ జగన్ నమస్కరిస్తూ అభివాదం చేశారు. తమకు గౌరవ వేతనాన్ని కనీసం ఆరు వేలకు పెంచమని ఆందోళనలు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆశా వర్కర్లు పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో ఉన్న 42 వేల మంది ఆశా వర్కర్లకు వేతనాన్ని రూ.10 వేలకు పెంచడం సీఎం వైఎస్ జగన్ తీసుకున్న గొప్ప నిర్ణయమని హంసా (హెల్త్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) అధ్యక్షుడు ఎస్.అరవపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



మెళియాపుట్టిలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆశావర్కర్లు

### సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం ఆశా వర్కర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎన్నో ఏళ్ల తర్వాత తమ కష్టాలు తీరాయని.. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామని ఆశా వర్కర్లు పేర్కొన్నారు.

## గవర్నర్ రంజాన్ శుభాకాంక్షలు



**సాక్షి, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర పర్వదినం సందర్భంగా మానవతను, విశ్వాసాలను గౌరవించేందుకు పునరంకితమవుదామని ఆయన పిలుపునిచ్చారు. 'పవిత్ర ఖురాన్ బోధనలు మానవాళి జీవితాలను, ప్రవక్త ఆగమనం మొదలుగా శతాబ్దాల పాటు ప్రభావితం చేశాయి. మనుషుల కోసం అల్లా నిర్దేశించిన జీవిత పరమార్థాన్ని పవిత్ర రంజాన్ పండుగ మనకు గుర్తు చేస్తుంది. పరలౌకిక జీవితం కోసం ఇహలోకంలో కఠిన క్రమశిక్షణతో బతకాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తుంది. ఈ శుభ సందర్భంగా మానవ జన్మ పట్ల, సృష్టి పవిత్రత పట్ల, అన్ని మత విశ్వాసాల పట్ల గౌరవాన్ని కలిగి ఉంటామని మరో సారి ప్రతిజ్ఞ చేద్దాం' అని పేర్కొన్నారు.

## సత్యనిష్ఠ, సత్ప్రవర్తనకు ప్రతీక రంజాన్

### ముస్లిం సోదర సోదరీమణులకు సీఎం శుభాకాంక్షలు



**సాక్షి, అమరావతి:** రంజాన్ పర్వదినం సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, దానధర్మాలు, చెడును త్యజించడం, మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా భగవంతుని స్మరణలో తరించే ఈ రంజాన్ రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. పవిత్ర ఖురాన్ గ్రంథం దివి నుంచి భువికి దిగివచ్చిన శుభ సమయం 'రంజాన్' అని తెలిపారు. నమాజ్, కలిమా, రోజా, జకాత్, హజ్ అనే ఐదు అంశాలతో భగవంతునికి కృతజ్ఞతలు తెలిపే ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు సీఎం వైఎస్ జగన్ ఆత్మీయ శుభాభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ప్రజలకు అల్లా దయ ఎల్లప్పుడూ ఉండాలని ముఖ్యమంత్రి కోరుకున్నారు.

## జగన్ మంచి పరిపాలన అందిస్తారు

**పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు**



సీఎం వైఎస్ జగన్‌కు వినతి పత్రం ఇస్తున్న మల్లాడి కృష్ణారావు

**సాక్షి, అమరావతి:** ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మంచి పాలన అందిస్తారని పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు కితాబు నిచ్చారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం నివాసంలో ఆయన ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని విషయాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి యంగ్ అండ్ డైనమిక్ సీఎం వచ్చారని, రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు సీఎం మాటల ద్వారా అర్థమైందని చెప్పారు. మల్లాడి సత్యలింగ నాయకర్ ఛారిటీస్‌కు సంబంధించి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటికి న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. అంతర్వేది ఆలయానికి ధర్మకర్తగా మత్స్యకార కుటుంబాల స్థానంలో వేరేవారు వచ్చారని, మళ్లీ వారి స్థానాన్ని వారికి కల్పించాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ ఫిషర్‌మెన్ కాంపోజిషన్ సమస్యలు కూడా త్వరలో పరిష్కరిస్తానని సీఎం చెప్పారన్నారు.

## వైఎస్సార్‌సీపీ నేతగా విజయసాయిరెడ్డి

- లోక్‌సభలో పార్టీ నేతగా మిథున్‌రెడ్డి
- చీఫ్ విప్‌గా మార్గాని భరత్‌రామ్



విజయసాయిరెడ్డి



మిథున్‌రెడ్డి



భరత్‌రామ్

**సాక్షి, అమరావతి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతగా రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి నియమితులయ్యారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ పక్ష నేతగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్టీ చీఫ్ విప్‌గా మార్గాని భరత్‌రామ్ ఎంపికయ్యారు. ఈ ముగ్గురినీ ఆయా పదవుల్లో నియమిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 3న కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రికి లేఖ రాశారు. వీరి నియామకాలను అధికారికంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఆయా ప్రభుత్వ శాఖల కమిటీల అధికారులు వీరి నియామకాన్ని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పరిమళించిన మానవత్వం

- 'సేవ్ అవర్ ఫ్రెండ్' బ్యానర్ పట్టుకున్న యువకులను చూసి వాహనం ఆపిన వైఎస్ జగన్
- స్నేహితుడు నీరజ్ ఆపరేషన్ కోసం రూ.25 లక్షలు అవసరమని చెప్పిన యువత
- తక్షణమే ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశం
- విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో జనం హృదయాన్ని కదిలించిన వైనం



విశాఖలో కాన్వాయ్ ఆపి నీరజ్ స్నేహితులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

**సాక్షి, విశాఖపట్నం:** ఓ యువకుడి ప్రాణం నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిన చొరవ జనం హృదయాల్ని కదిలించింది. మంగళవారం విశాఖ జిల్లా పెందుర్తిలోని శ్రీ శారదా పీఠాన్ని సందర్శించి తిరిగి వెళ్లేందుకు బయలుదేరిన ముఖ్యమంత్రికి విమానాశ్రయం ఆవరణలో 'బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మా స్నేహితుడిని కాపాడండి' అని రాసి ఉన్న బ్యానర్ పట్టుకుని కొంతమంది యువతీ యువకులు నినాదాలు చేస్తూ కనిపించారు. అతి వేగంగా వెళ్తున్న కాన్వాయ్‌లోంచి రెప్పపాటు వ్యవధిలో ఆ దృశ్యాన్ని గమనించిన సీఎం జగన్ వెంటనే కాన్వాయ్ ఆపండని ఆదేశించారు. వాహనంలోంచి కిందికి దిగి, బారికేడ్ అవతల ఉన్న ఆ యువతీ యువకులను తన వద్దకు అనుమతించాలంటూ అధికారులకు చెప్పారు. వారు తన వద్దకు రాగానే అసలేం జరిగిందంటూ ఆప్యాయంగా పలకరించారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తమ స్నేహితుడు నీరజ్‌కుమార్ ఆపరేషన్‌కు రూ.25 లక్షలు ఖర్చవుతుందని, ఈనెల 30న ఆపరేషన్ చేయించకపోతే కష్టమని వైద్యులు చెప్పారన్నారు. నీరజ్‌ని ఎలా బతికించుకోవాలో తెలీక మీ దృష్టిలో పడాలని ఇలా చేశామన్నారు. వారు చెప్పిందంతా ఓపిగ్గా విన్న ముఖ్యమంత్రి.. 'నీరజ్ బతుకుతాడు.. ఎప్పటిలానే మీతో సరదాగా, సంతోషంగా ఉంటాడు.. మీరేం అధైర్య పడొద్దు' అంటూ తన సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డిని పిలిచి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన తన ఫోన్ నంబర్‌ను యువకులకు ఇస్తూ.. పక్కనే ఉన్న జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్‌ను పిలిచి నీరజ్ ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అంతే.. ఒక్కసారిగా అక్కడ భావోద్వేగ వాతావరణం వెల్లివిరిసింది. సీఎం జగన్ సార్ దేవుడంటూ నినాదాలు మిన్నంటాయి. నీరజ్ మిత్రుల కళ్లు ఆనంద భాష్పాలతో నిండిపోయాయి. వారు చేతులు జోడించి నమస్కరిస్తుండగా.. జగన్ చిరునవ్వుతో అక్కడి నుంచి బయలుదేరారు. పదవి అంటే పెత్తనం కాదని, ప్రజల కష్టాల్ని పంచుకునే అధికారమని నిరూపించారని అక్కడున్న పలువురు కొనియాడారు.

### ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేస్తున్నాం

ఎయిర్ పోర్టులో యువత ప్రదర్శించిన బ్యానర్‌ని చూసి సీఎం స్పందించారు. సీఎం సెక్రటరీ హాస్పిటల్ వాళ్లతో మాట్లాడాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీతో సంబంధం లేకుండా సీఎం ఆఫీసుకు వివరాలు పంపిస్తాం. అక్కడి నుంచి క్రెడిట్ నోట్ రాగానే ఆస్పత్రికి అందిస్తాం. ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేయిస్తున్నాం.

– కాటంనేని భాస్కర్, జిల్లా కలెక్టర్.

### ఇదీ నీరజ్ దీనగాథ..



విశాఖలోని జ్ఞానాపురం ప్రాంతానికి చెందిన జాగరపు అప్పలనాయుడు, జాగరపు దేవి దంపతుల కుమారుడు నీరజ్ కుమార్. స్థానిక రైతు బజార్‌లో తల్లి కూరగాయలు అమ్ముకుని, తండ్రి కూలికి వెళ్లి కుటుంబం నెట్టుకొస్తున్నారు. నీరజ్ కుమార్ 2018లో స్థానిక రవీంద్రభారతి స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేశాడు. డిప్లమో చదువుదామని దరఖాస్తు చేశాడు. ఇంతలో బ్లడ్ క్యాన్సర్ బారినపడ్డాడు. నీరజ్‌ని హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యులు రూ.25 లక్షలు ఖర్చవుతాయని చెప్పారు. అంత డబ్బులేకపోవడంతో అతని తల్లిదండ్రులు కొడుకు ప్రాణాలపై ఆశలు వదులుకున్నారు. నీరజ్‌తో పాటు చదువుకున్న స్నేహితులు, ఉపాధ్యాయులు రెండు నెలలుగా విరాళాలు సేకరిస్తున్నారు.




నీరజ్‌ను ఆదుకోవాలని కోరుతూ బ్యానర్ చూపుతున్న అతని స్నేహితులు

### మా స్నేహితుడికి పునర్జన్మనిచ్చారు..

'మా స్నేహితుడు నీరజ్‌కుమార్‌కు బ్లడ్ క్యాన్సర్ అని తెలిసినప్పటి నుంచి చాలా బాధపడుతున్నాం. రెండు నెలలుగా దాతల కోసం తిరుగుతున్నాం. అందరం కలిసి ప్రయత్నిస్తే ఇప్పటి దాకా కేవలం రూ.40 వేలు మాత్రమే వచ్చాయి. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ వస్తున్నారని మేము ఉదయం 8 గంటల నుంచి ఎయిర్‌పోర్ట్‌లో వేచి చూశాం. పోలీసులు మమ్మల్ని లోపలకు పంపించలేదు. దారిలో నిలుచుంటే సీఎంకు కనపడకపోతామా అనే ఆశ. ఆ ఆశతోనే మధ్నాహ్నం బ్యానర్ పట్టుకుని నిలుచున్నాం. కాన్వాయ్ మా ముందు నుంచి కాస్త ముందుకెళ్లి ఆగిపోయింది. సీఎం కారు దిగి మమ్మల్ని దగ్గరకు రప్పించుకున్నారు. మా స్నేహితుడి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేయించారు. ఇది నిజంగా నీరజ్‌కు పునర్జన్మే.

– నీరజ్ స్నేహితులు

### ఈ ముఖ్యమంత్రి మా పాలిట దేవుడు

మా బాబు నీరజ్‌కు ఇక్కడే (హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి)లో వైద్యం చేయిస్తున్నాం. ఆపరేషన్ చేయాలన్నారు. చేతిలో డబ్బుల్లేవు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. రోజూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. ఏరోజుకారోజు వచ్చే ఆదాయంతో బతికే మేము మా బిడ్డ వైద్యానికయ్యే రూ.25 లక్షలు సమకూర్చుకోలేమని దిగులుతో ఉన్నాం. మా వాడి స్నేహితులు, టీచర్లు దాతల నుంచి చందాలు వసూలు చేసైనా ప్రాణం నిలబెట్టాలని చూస్తున్నారు. నీరజ్‌కు ఆపరేషన్ చేయిస్తామని సీఎం జగన్ చెప్పారని మంగళవారం మధ్యాహ్నం బంధువులు, మావాడి స్నేహితులు మాకు ఫోన్ చేశారు. ఇది కలా లేక నిజమా.. అనుకుని కాసేపు తేరుకోలేదు. ఈ విషయం టీవీల్లో కూడా వస్తోందని మళ్లీ ఫోన్లు వచ్చాయి. పట్టలేనంత సంతోషం వేసింది. ముఖ్యమంత్రి జగన్ గారు మాకు నిజంగా దేవుడే. మా కుటుంబం జీవితకాలం ఆయనకు రుణపడి ఉంటుంది. జగన్ గారి ఔదార్యంతో మా బిడ్డను దక్కించుకుంటామన్న ధైర్యం వచ్చింది. కష్టాల్లో ఉన్న వారి పట్ల స్పందించే గుణం జగన్‌లో ఉందని విన్నాం. కానీ ఇప్పుడు మా అనుభవంలో చూస్తున్నాం' అని వారు గద్గద స్వరంతో పేర్కొన్నారు. గత ఏడాది విశాఖపట్నం విమానాశ్రయంలో జగన్ గారిని కత్తితో పొడిచి చంపేయాలని చూశారు. ఇప్పుడు అదే ఎయిర్‌పోర్టులో ఉన్న సమయంలో నా బిడ్డను బతికించడానికి ఆయన పూనుకున్నారు. ఆయనది ఎంత మంచి మనసు!.

–'సాక్షి'తో నీరజ్‌కుమార్ తల్లిదండ్రులు దేవి, అప్పలనాయుడు, సోదరుడు అనిల్‌కుమార్

## ప్రభుత్వ వాలంటీర్ల నియామకానికి కసరత్తు షురూ

- రాష్ట్రంలో ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీరు చొప్పున నియామకం
- విధివిధానాల రూపకల్పనలో పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖలు
- నియామకాల్లో రిజర్వేషన్లు పాటించే యోచన

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు వీలుగా ప్రతి 50 కుటుంబాలకు ఒకరి చొప్పున వాలంటీర్ల నియామకానికి పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖలు కసరత్తు ఆరంభించాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే ఈమేరకు ప్రకటన కూడా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వాలంటీర్ల ఎంపికకు అనుసరించాల్సిన పద్ధతి, విధివిధానాల రూపకల్పన బాధ్యతను పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖలకు అప్పగించారు. తాజాగా బదిలీ అయిన పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డి మంగళవారం అధికారులతో సమావేశమై ఈ ప్రక్రియపై చర్చించారు. డైరెక్టర్ రంజిత్‌బాషా, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్థానిక యువతకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనంతో ఉద్యోగం, ఉపాధి కల్పించే ఈ ప్రక్రియలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని ప్రభుత్వం భావిస్తోంది. సీఎం పరిశీలన అనంతరం దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

## దేశీయ తయారీ రంగం వృద్ధికి సూచనలివ్వండి

- ఈ నెల 6న జరిగే సమావేశానికి ప్రతినిధుల బృందాన్ని పంపండి
- సీఎం వైఎస్ జగన్‌కు కేంద్రమంత్రి పీయుష్ గోయెల్ లేఖ

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశీయ తయారీ రంగానికి ఊతమిచ్చి అంతర్జాతీయంగా 'మేకిన్ ఇండియా'కు ప్రాచుర్యం కల్పించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఈ నెల 6న ఢిల్లీలో జరగనున్న సమావేశానికి ప్రతినిధి బృందాన్ని పంపాల్సిందిగా ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కేంద్ర రైల్వే, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయెల్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన వైఎస్ జగన్‌కు లేఖ రాశారు. ఈ సమావేశానికి సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖాధిపతులు, అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో న్యూ ఇండియా విజన్‌కు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అంతర్జాతీయ స్థాయిలో వర్తక, వాణిజ్యం, దేశీయ తయారీ రంగం విలువను పెంచినప్పుడే ఈ కల సాకారం అవుతుందని పీయుష్ తన లేఖలో పేర్కొన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను పెంచడం ద్వారా 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయాలనుకున్న లక్ష్యం నెరవేరుతుందని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సి ఉంటుందన్నారు. తద్వారా దేశంలో ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయన్నారు. దేశీ తయారీ రంగానికి ఊతమిచ్చేందుకు అనుసరించాల్సిన విధానాలు, పద్ధతులపై చర్చించేందుకు ఈ నెల 6న ఢిల్లీలోని అశోకా హోటల్‌లో ఉ.10.30 గంటలకు జరగనున్న కౌన్సిల్ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి పరిశ్రమల శాఖ మంత్రి, ఆ శాఖ కార్యదర్శి, వ్యవసాయ శాఖ కార్యదర్శులతో కూడిన ప్రతినిధి బృందాన్ని పంపాల్సిందిగా సీఎం వైఎస్ జగన్‌కు రాసిన లేఖలో పీయుష్ గోయెల్ కోరారు. ఈ చర్చల ద్వారా వర్తక, వాణిజ్యం, దేశీ తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు నూతన విధానాలను రూపొందించవచ్చని రైతులు పండించే పంటకు విలువ పెరుగుతుందన్నారు.

# ఎంసెట్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల ప్రతిభ

## సంస్థ కార్యదర్శి వి. రాములు

**సాక్షి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థులు ఈ ఏడాది ఎంసెట్ పరీక్షా ఫలితాల్లో చక్కని ప్రతిభ కనబరిచారని సంస్థ కార్యదర్శి వి. రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఎంసెట్ పరీక్షకు గురుకుల విద్యాలయాల సంస్థ నుంచి మొత్తం 2,527 మంది విద్యార్థులు హాజరయ్యారని.. ఇంజనీరింగ్ విభాగంలో 1,222 మందికి గాను 1,086 మంది విద్యార్థులు అర్హత సాధించారని ఆయన వివరించారు. అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో మొత్తం 1,305 మంది విద్యార్థులు హాజరుకాగా.. 1,181 మంది విద్యార్థులు అర్హత సాధించారని పేర్కొన్నారు. ఐఐటీ, మెడికల్ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు పి. తిరుమలేష్ నాయక్ 1,728 ర్యాంకు, ఎం. పవన్‌సత్య 2,100వ ర్యాంకు సాధించగా.. ఇంజనీరింగ్ విభాగంలో బి. రఘుబాబు 6,936 ర్యాంకు సాధించారని తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించారని.. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, ఇందుకు కారణమైన ఉపాధ్యాయులకు సంస్థ వైస్ చైర్మన్ ఎస్ఎస్ రావత్ అభినందనలు తెలిపారు.

# జస్టిస్ సుభాషణ్‌రెడ్డి సేవలు నిరుపమానం

- ఆయన మరణం న్యాయవ్యవస్థకు తీరని లోటు
- హైకోర్టు ఏసీజే జస్టిస్ ప్రవీణ్ కుమార్
- జస్టిస్ సుభాషణ్‌రెడ్డికి ఘనంగా నివాళులర్పించిన హైకోర్టు



జస్టిస్ ప్రవీణ్ కుమార్

**సాక్షి, అమరావతి:** న్యాయవ్యవస్థకు జస్టిస్ బి. సుభాషణ్‌రెడ్డి అందించిన సేవలు నిరుపమానమని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ అన్నారు. జస్టిస్ సుభాషణ్‌రెడ్డి మరణం న్యాయవ్యవస్థకు తీరని లోటన్నారు. న్యాయమూర్తిగా జస్టిస్ సుభాషణ్‌రెడ్డి నుంచి ఎంతో మంది ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకున్నారని, అందులో తాను కూడా ఒకడినని తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన జస్టిస్ సుభాషణ్‌రెడ్డికి హైకోర్టు మంగళవారం ఘనంగా నివాళులర్పించింది. ఇందుకోసం ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, యువ న్యాయవాదులను జస్టిస్ సుభాషణ్ రెడ్డి ఎంతగానో ప్రోత్సహించారన్నారు. బెంచ్ మీద నుంచే తప్పులను సరిదిద్ది, యువ న్యాయవాదుల్లో భయాన్ని పోగొట్టేవారని అన్నారు. మద్రాసు, కేరళ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తిగా, మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌గా, లోకాయుక్తగా ఆయన గొప్ప సేవలు అందించారన్నారు. తరువాత న్యాయవాదుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సుభాషణ్‌రెడ్డి గొప్ప మానవతామూర్తి అన్నారు. అనంతరం జస్టిస్ సుభాషణ్‌రెడ్డి మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో జస్టిస్ సుభాషణ్‌రెడ్డి కుటుంబ సభ్యులు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మానవేంద్రనాథ్ రాయ్, ఇతర రిజిస్ట్రార్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ద్వివేది బృందానికి సీఈవో అభినందన

**సాక్షి, అమరావతి:** రాజకీయంగా అత్యంత సున్నితమైన రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది బృందాన్ని కేంద్ర ఎన్నికల సంఘం అభినందించింది. సార్వత్రిక ఎన్నికల అనుభవాలను తెలుసుకోవడానికి సోమవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన రాష్ట్ర, కేంద్రపాలిత సీఈవోల సమావేశంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరాతో పాటు ఎలక్షన్ కమిషనర్లు అశోక్ లావాసా, సుశీల్ చంద్రలు ద్వివేది బృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలియచేశారు. రాజకీయంగా అత్యంత సున్నితమైన రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగేలా కృషి చేసిన ప్రతీ ఉద్యోగిని అభినందించినట్లు ద్వివేది తెలిపారు. ఇతర రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారులు కూడా అభినందనలు తెలిపారు.

# ప్రజా వేదికను బాబు నివాసానికి ఇవ్వండి

## తెలుగుదేశం పార్టీ డిమాండ్

**సాక్షి, అమరావతి:** ఉండవల్లిలోని ప్రజావేదికను ప్రతిపక్ష నేత అధికారిక నివాసానికి కేటాయించమని ప్రభుత్వాన్ని కోరాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మంగళవారం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన నివాసం, పార్టీ రాష్ట్ర కార్యాలయం గురించి చర్చించారు. ప్రజావేదిక చంద్రబాబు ఉంటోన్న ఇంటికి అనుబంధంగా ఉందని, దాన్ని ప్రతిపక్ష నేత హోదాలో ఆయన నివాసం కోసం ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడగాలని పార్టీ నాయకులు సూచించగా, చంద్రబాబు ఆ మేరకు ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు. గుంటూరులోని పార్టీ రాష్ట్ర కార్యాలయం అందరికీ అందుబాటులో లేనందున విజయవాడలో రాష్ట్ర పార్టీ కార్యక్రమాలకు మరో భవనాన్ని చూడాలని చంద్రబాబు పార్టీ నాయకులు కేశినేని నాని, దేవినేని ఉమాకు సూచించారు. ప్రస్తుతం ఉన్న జిల్లా కమిటీల స్థానంలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా కమిటీలు వేద్దామని తెలిపారు. హైదరాబాద్‌లో ఏపీకి చెందిన భవనాలను తెలంగాణ ప్రభుత్వానికి ఇవ్వడం సరికాదని, కేబినెట్‌లో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని కొందరు నేతలు వ్యాఖ్యానించగా, చంద్రబాబు మరికొందరు నేతలు అప్పుడే పరిపాలనా వ్యవహారాలపై విమర్శలు చేయకూడదని సూచించారు. లోక్‌సభలో పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ విప్‌గా విజయవాడ ఎంపీ కేశినేని నాని, రాజ్యసభలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా సీఎం రమేష్‌ను నియమించాలని సమావేశంలో నిర్ణయించారు.

# టీటీడీ పాలక మండలి సభ్యుల రాజీనామాలు ఆమోదం

**సాక్షి, అమరావతి:** తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యత్వానికి పొట్లూరి రమేష్‌బాబు, చల్లా రామచంద్రారెడ్డితో పాటు ప్రత్యేక ఆహ్వానితుడు పదవికి కె. రాఘవేంద్రరావు చేసిన రాజీనామాలను ప్రభుత్వం మంగళవారం ఆమోదించింది. ఈ మేరకు దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# 34 శాతం రిజర్వేషన్‌ను కాపాడుకోవాలి

## బీసీ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షుడు ఎన్వీ రావు

**చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ):** స్థానిక సంస్థల్లో బీసీలకు ఇస్తున్న 34 శాతం రిజర్వేషన్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బీసీ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షుడు ఎన్వీ రావు అన్నారు. విజయవాడ భీమనవారి పేటలోని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల బీసీలకు ఇచ్చే రిజర్వేషన్‌ను 27 శాతానికి తగ్గిస్తూ పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో ఇచ్చారని, దీనిని బీసీ సంఘాలన్నీ వ్యతిరేకిస్తున్నాయన్నారు. 34 శాతం రిజర్వేషన్‌ను యథాతథంగా అమలు చేయాల్సిన బాధ్యత సీఎంపై ఉందన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయి, శివకుమార్ పట్నాయక్, బాయన బాబ్జీ, మురిపాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సేద్యంతో కూరగాయల సాగుపై 9న శిక్షణ

**సాక్షి, అమరావతి:** ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సేద్య విధానంలో కూరగాయల సాగు, కషాయాల తయారీపై ఈనెల 9న గుంటూరు జిల్లా పుల్లడిగుంట సమీపంలోని కొర్నెపాడు గ్రామంలో శిక్షణ ఇవ్వనున్నట్టు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతిసాగులో నిష్ణాతులైన మీసాల రామకృష్ణ, శివనాగమల్లేశ్వరరావు ఈ కార్యక్రమంలో రైతులకు శిక్షణ ఇస్తారని, కషాయాలు, మిశ్రమాల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపిస్తారని తెలిపారు. ఆరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగే శిక్షణలో పాల్గొనదలిచిన రైతులు 9705383666, 9676797777 సంప్రదించవచ్చునన్నారు.






సాక్షి
బుధవారం, జూన్, 5

# విపక్ష శిబిరంలో లుకలుకలు

ఎన్నికల ఫలితాలు వెల్లడై పక్షం రోజులు కాకుండానే ప్రజలిచ్చిన తీర్పు ఎంత సహేతుకమైనదో విపక్షాలు నిరూపిస్తున్నాయి. మొదటగా కాంగ్రెస్ అయోమయావస్థలో చిక్కుకుంది. ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పదవి నుంచి తప్పుకుంటానని మొత్తుకుంటుంటే 'వల్లకాదు..మీరే మా నేత' అంటూ నాయకశ్రేణి అంతా ప్రాధేయపడుతోంది. ఇది తేలేవరకూ పార్టీ అధికార ప్రతినిధులు, నాయకులు మౌనముద్ర దాల్చాలన్న నిర్ణయం కూడా తీసుకున్నారు. వందేళ్ల పైబడి చరిత్ర గలిగి, అనేక ఎన్నికల యుద్ధాల్లో ఓడుతూ, గెలుస్తూ సుదీర్ఘకాలం పాలించిన ఒక పార్టీ నుంచి ఈ మాదిరి ప్రవర్తనను ఎవరూ ఊహించరు. ఈ అంతర్గత పోరు పర్యవసానాలు కూడా తీవ్రంగానే ఉన్న దాఖలా కనబడుతోంది. ఇప్పటికే మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో లుకలుకలు బయల్దేరగా... కర్ణాటకలో కాంగ్రెస్–జేడీ(ఎస్) కూటమి చిక్కుల్లో పడింది. మహారాష్ట్రలో కీలక నేతలు బీజేపీకి క్యూ కడుతున్న సూచనలు కనబడుతున్నాయి. ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పీ)–బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్‌పీ)ల నేతృత్వంలోని మహాకూటమి వంతు వచ్చింది. అయిదు నెలలక్రితం ఆర్భాటంగా మొదలైన ఆ కూటమికి బీఎస్‌పీ అధ్యక్షురాలు మాయావతి స్వస్తి పలికారు. కనీసం భాగస్వామికి చెప్పాలన్న నియమం కూడా పాటించకుండా 'ప్రస్తుతానికి' ఆ పొత్తు నిలిచిపోతుందని ప్రకటించారు. ఈ కూటమి ఇకపై కూడా కొనసాగుతుందంటూ గంభీరంగా చెప్పుకుపోతున్న ఎస్‌పీ అధినేత అఖిలేష్ యాదవ్‌ను మీడియా ప్రతినిధులు ఆపి మాయావతి నిర్ణయాన్ని చెప్పవలసి వచ్చింది. దాంతో వెంటనే ఆయన కూడా స్వరం మార్చారు. ఏతా వాతా ఇద్దరూ త్వరలో జరగబోయే 11 అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉప ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేస్తారు. భవిష్యత్తులో మళ్లీ కూటమి ఉనికిలోకి రావొచ్చునని మాయావతి చెప్పినా అదంత సులభం కాదు. 'నీకు నీ గురించి, నీ శత్రువు గురించి సంపూర్ణ అవగాహన ఉంటే వంద యుద్ధాలకు కూడా భయపడనవసరంలేద'ని 'యుద్ధ కళ'ను రచించిన ప్రాచీన చైనా యుద్ధ నిపుణుడు సన్ జూ అంటాడు. 'నీ గురించి తెలిసినా శత్రువును తెలుసుకోవడంలో విఫలమైతే ప్రతి విజయం వెంటా అపజయం ఎదురవుతుంటుంద'ని హెచ్చరిస్తాడు. 'నీ గురించి, నీ శత్రువు గురించి కూడా తెలుసుకోలేని స్థితిలో పడితే నీకు శాశ్వతంగా ఓటమే రాసిపెట్టి ఉంటుంద'ని చెబుతాడు. విపక్షాలన్నీ ఈ మూడో అవస్థతో సతమతమవుతున్నాయి. వాటికి స్వస్వరూప జ్ఞానమూ శూన్యమే... తమ ప్రత్యర్థి గురించిన అవగాహనా అంతంత మాత్రమే.

మొన్న జనవరిలో మహాకూటమిగా ఏర్పడినప్పుడు మాయావతి, అఖిలేష్ యాదవ్ ఎంతో ఉత్సాహంగా మాట్లాడారు. లోక్‌సభలో మాయావతికి ఎస్‌పీ మద్దతుగా నిలబడటానికి, అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్‌పీ అఖిలేష్‌కు ఆసరా ఇవ్వడానికి ఆ రెండు పార్టీల మధ్యా అంగీకారం కుదిరింది. మరో మాటలో చెప్పాలంటే ప్రధాని పదవిని మాయావతి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిని అఖిలేష్ యాదవ్ 'పంచుకున్నారు'. కానీ ఓటర్లు మాత్రం వేరేవిధంగా ఆలోచించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ కూటమిని ఓడించి, బీజేపీకి పట్టంగట్టారు. 80 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 62 గెల్చుకోగా, ఆ పార్టీ మిత్రపక్షం అప్నాదళ్‌కు 2 స్థానాలొచ్చాయి. మహాకూటమి కేవలం 15 (బీఎస్‌పీ10, ఎస్‌పీ–5) స్థానాలతో సరిపెట్టుకోవాల్సివచ్చింది. కూటమి నుంచి కాంగ్రెస్‌ను దూరం పెట్టినందువల్ల 10 స్థానాలు చేజారాయని లెక్కలు చెబుతున్నాయి. దానికి గెలిచే సత్తా లేకపోయినా కూటమి అవకాశాలను బాగా దెబ్బతీసింది. కేవలం కులాన్ని నమ్ముకుని, పరస్పరం ఓట్లు బదిలీ అవుతాయన్న విశ్వాసాన్ని పెట్టుకుని కూటమి బరిలోకి దిగింది. బీజేపీ విధానాలకు ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందుంచడంలో ఘోరంగా విఫలమైంది. ప్రజల్లో విశ్వసనీయతను పెంచుకోవడానికి ఏం చేయాలన్న విషయంలో దానికి స్పష్టత లేదు. కేవలం వేదికలపై నేతలు చేతులు కలిపినంత మాత్రాన ఏ ప్రయోజనమూ ఉండదని ఫలితాలు వచ్చాకగానీ అర్థం కాలేదు. ఎన్నికల అనంతరం రెండు పార్టీలూ కూర్చుని వైఫల్యానికి గల కారణాలు చర్చించుకుని ఉంటే వేరుగా ఉండేది. పొత్తులో తమకు యాదవుల ఓటు బదిలీ కాలేదని మాయావతి ఆరోపిస్తున్నారు. బీఎస్‌పీ తరపున తాము నిలబెట్టిన అభ్యర్థుల్లో 10మంది యాదవులకు మినహా దళితులతోసహా ఇతర కులాల అభ్యర్థులెవరికీ యాదవుల ఓట్లు రాలేదని ఆమె అభియోగం. మొత్తంగా చూస్తే మహాకూటమికి జాతవ్ దళితులు(74 శాతం), ముస్లింలు(76 శాతం), యాదవులు(72 శాతం) గణనీయంగా ఓట్లేశారు. కానీ యాదవేతర ఓబీసీలు(72 శాతం), ఎస్టీలు(61శాతం), జాతవేతర దళితులు(57 శాతం), ఆధిపత్య కులాలు(74 శాతం), జాట్‌లు(55 శాతం) బీజేపీవైపు మొగ్గారు. అందువల్లే బీజేపీకి అధిక స్థానాలు లభించాయి.

దళితులు, ఓబీసీల్లో బీఎస్‌పీ, ఎస్‌పీ అధినేతలకు చెందిన సామాజిక వర్గాలు తప్ప మిగిలిన వారెవరూ కూటమికి ఎందుకు ఓట్లేయలేదన్న ఆత్మ పరిశీలన చేసుకుని ఉంటే చాలా అంశాలు వెలుగులోకొచ్చేవి. సామాజిక న్యాయం పేరుతో దేశంలో నూతన రాజకీయాలకు శ్రీకారం చుట్టిన ఈ రెండు పార్టీలూ కాలక్రమంలో కుల రాజకీయాల్లో కూరుకుపోయాయి. మాయావతి తన సామాజిక వర్గానికి అందుబాటులో ఉంటారు తప్ప, దళితుల్లోని ఇతరులను పట్టించుకోరన్న అపవాదు మూటగట్టుకున్నారు. ఇటు అఖిలేష్‌పైనా ఇదే ముద్ర ఉంది. ఆయన యాదవ సామాజిక వర్గం మినహా ఓబీసీల్లో ఇతర సామాజిక వర్గాలను నిర్లక్ష్యం చేస్తారన్న విమర్శ ఉంది. దానికితోడు గెలవాలన్న ఏక సూత్ర కార్యక్రమం తప్ప మరేవిధమైన సైద్ధాంతిక ప్రాతిపదిక ఈ పార్టీలకు లేదు. ఈ లోటుపాట్లను సరిదిద్దుకోవాలన్న స్పృహ కూడా వాటికి ఉండటం లేదు. ఈ మాదిరి రాజకీయాలకు తమ మద్దతు ఉండబోదని మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు చాటిచెప్పారు. ఆ తీర్పులోని సారాంశాన్ని సక్రమంగా అవగాహన చేసుకుంటేనే విపక్షాలకు భవిష్యత్తు ఉంటుంది. లేనట్టయితే అవి క్రమేపీ కొడిగట్టడం ఖాయం.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, తిథి శు.విదియ ప.1.18 వరకు, తదుపరి తదియ నక్షత్రం ఆరుద్ర రా.11.35 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం ఉ.8.29 నుంచి 10.03 వరకు, దుర్ముహూర్తం ప.11.30 నుంచి 12.21 వరకు, అమృతఘడియలు... ప.1.54 నుంచి 2.45 వరకు, బుద్ధజయంతి.

**సూర్యోదయం :** 5.28
**సూర్యాస్తమయం:** 6.25
**రాహుకాలం :** ప. 12.00 నుంచి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు

# నిష్క్రమణే నికార్సయిన మందు!

విశ్లేషణ



హరీష్ ఖరే

**జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలను అంతర్గతంగా కూడా ప్రశ్నిస్తూ వచ్చిన రాజకీయ సంస్కృతి సోనియా గాంధీ హయాం నుంచి కనుమరుగు కావడమే కాంగ్రెస్ ప్రస్తుత పతనానికి ముఖ్యకారణం. కుటుంబ నాయకత్వంపట్ల తిరుగులేని విశ్వాసం ప్రదర్శించడంతో పార్టీ స్వీయ విమర్శనా సమర్థతకు తీవ్ర హాని జరిగింది. కొత్త ప్రయోగాలు చేయడానికి సిద్ధం కావడం కాదుకదా.. మార్పు అనే భావనకే అది దూరమైపోయింది. రాహుల్ గాంధీ స్వీయ నిష్క్రమణ కాంగ్రెస్ భవిష్యత్తుకు నిక్కమైన మేలు చేస్తుంది. చరిత్రలో నిర్ణాయకమైన స్థానంవైపు ముందుకు నడవడంలో ఏ రాజకీయ పార్టీ అయినా కఠిన నిర్ణయానికి సిద్ధపడాల్సి ఉంటుంది. ఈ సంధికాలంలోనే పార్టీ సభ్యులు నాయకత్వాన్ని పరీక్షించడం, ప్రశ్నించడం నేర్చుకోవాలి. సంస్థ నిర్మాణాన్ని బాగు చేసుకోవడంలో కాంగ్రెస్ నిజంగా రక్తమోడ్చాల్సి ఉంటుంది.**

కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సూత్రాలు, దాని సిద్ధాంతం, దాని విధానాలు, సంప్రదాయాల గురించి చర్చించే అవకాశం తమకు కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ సభ్యులు యావన్మందీ రాహుల్ గాంధీకి కృతజ్ఞులై ఉండాలి. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరపరాజయం పొందడంతో రాజకీయ పార్టీ అంటే ఎన్నికలకు సంబంధించింది మాత్రమే కాదని, దానికి మించిన ప్రాధాన్యం ఉంటుందని కాంగ్రెస్ వాదులకు బోధపడింది. దేశ ఐక్యత, సమగ్రత, భద్రత, సుస్థిరత, సౌభాగ్యం, సామరస్యం, సమానత్వం, న్యాయం వంటి భారత రిపబ్లిక్ ఆశయాల పరిరక్షణకు సదా నిలుస్తూ వచ్చిన సూత్రబద్ధ సంస్థగా కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ విలువను పునరుద్ధరించేందుకు రాహుల్ రాజీనామాకు మించిన గొప్ప సందర్భం బహుశా ఉండదు. పైన పేర్కొన్న విలువలు, లక్ష్యాలు ఏ సంఘటిత రాజకీయ సంస్థకైనా అవసరమే. అనుకూల, వ్యతిరేక స్వభావంతో ఉన్న ఇరుగుపొరుగు దేశాలు, అననుకూలమైన, ఇబ్బందికరమైన ప్రపంచ వాతావరణం రెండింటినీ సర్దుబాటు చేసుకుని భారత ప్రభుత్వం ముందుకు నడుస్తున్న తరుణమిది. జాతీయ స్వాతంత్య్ర పోరాటాన్ని నడపటంలో, శిశుప్రాయంలోని జాతీయ రాజ్యాన్ని సంఘటిత పర్చడంలో బలమైన రాజకీయ ఉపకరణంగా నిలిచిన కాంగ్రెస్ పార్టీకి గర్వించదగిన చరిత్ర ఉంది. పైగా మన ప్రజాస్వామిక రాజ్యపాలనా విధానాన్ని సచేతనంగా ఉంచడంలో ఈ పార్టీ కీలకపాత్ర పోషిస్తోంది కూడా.

ఇంతటి ఘనతర చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి తన రాజకీయ స్వరాన్ని మళ్లీ కనుగొనవలసిన అవసరం ఉంది. ఇన్నాళ్లుగా కాంగ్రెస్ వాదులు తమ పార్టీ నాయకత్వాన్ని డిమాండ్ చేయడం ఆపివేసిన కారణంగానే ఈ లక్ష్యం నిర్లక్ష్యానికి గురైంది. అయితే కాంగ్రెస్ అన్ని కాలాల్లోనూ ఇలాగే ఉండేదని చెప్పలేం. గతాన్ని కాస్త పరికిద్దాం. జవహర్‌లాల్ నెహ్రూ దేశ ప్రధానిగా పనిచేసినంత కాలం ఆయన విధానాలు సొంతపార్టీలోనే సవాలుకు గురయ్యేవి. ఇక ఇందిరాగాంధీ హయాంలో స్పష్టంగా రెండు చీలికలను మనం చూడవచ్చు. మారుతున్న రాజకీయ అర్థశాస్త్రానికి అనుగుణంగా పార్టీ అంతర్గత సమీకరణలను పునరేకీకరించడానికి ఈ చీలికలు ముందుకొచ్చాయి. ఇక రాజీవ్ గాంధీ హయాంలో వీపీ సింగ్, అరుణ్ నెహ్రూ, పీవీ నరసింహారావు ఆయనతో నేరుగా తలపడ్డారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే వీరు రాజీవ్‌ని సవాలు చేశారు. ఈ క్రమంలో తల్కాతోరా స్టేడియంలో జరిగిన ఒక బోగస్ తిరుగుబాటు ఉదంతాన్ని కూడా మనం గుర్తు చేసుకోవాలి. ఇక తర్వాత ఎన్నికైన పార్టీ అధ్యక్షుడు సీతారాం కేసరిని 1998 మార్చి 14న జరిగిన అప్రతిష్టాకరమైన కుట్రలో పదవినుంచి తొలగించేశారు.

ఆనాటి నుంచి కాంగ్రెస్ పార్టీ తన యథాతథ స్థితి పట్ల సౌకర్యవంతంగా ఫీలవుతూ, పూర్తి సంతృప్తి చెందుతూ కాలం గడుపుతూ వచ్చింది. కుటుంబ నాయకత్వ నమూనా పట్ల తిరుగులేని విశ్వాసం ప్రదర్శించిన యథాతథ స్థితిని అనాలోచితంగా ఆలింగనం చేసుకోవడంతో తనను తాను విమర్శించుకోవడంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సమర్థతకు తీవ్రంగా హాని జరిగింది. ఈ ఆరాధనా భావం వల్ల పార్టీ విధానాలు దెబ్బతినిపోవడమే కాకుండా, జాతీయ లక్ష్యాలు, ప్రయోజనాలకు కూడా హాని కలిగింది. ఈ క్రమంలో సంస్థాగత నిర్మాణంలో ఎలాంటి కొత్త ప్రయోగాలు చేయడానికి కూడా ఆ పార్టీ భీతిల్లిపోయింది. పైగా మార్పు అనే భావననుంచే అది దూరం జరిగిపోయింది.



పార్టీ అధ్యక్షురాలిగా సుదీర్ఘకాలం పనిచేసిన సోనియా గాంధీ అనుభవజ్ఞులైన, సీజనల్ నేతల కూటమికి మాత్రమే అందుబాటులో ఉండేవారు. పార్టీ పాలనా విధానంలో నెహ్రూవియన్ సమానతావాదానికి కేంద్ర స్థానం కల్పిస్తూ పాత విధానాలనే పునరుద్ధరించాలని వీరు ఆందోళన చేసేవారు. వీరే సోనియాకు రక్షణ కవచంగా ఉండి ఆమెను రక్షించే పనిలో మునిగిపోయారు. కానీ అలాంటి నాయకులందరూ ఇప్పుడు ముసలివారైపోయారు. పైగా గాయాల బారిన పడిన పార్టీని యథాతథంగా కొనసాగించడం అనే ఆటలో వీరంతా అలసిపోయారు. వారసత్వాన్ని సమర్థిస్తూవచ్చిన ఈ వయోవృద్ధులు ఎవరూ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఏకైక అభ్యర్థిగా రాహుల్ గాంధీనే తగినవారు అనే భావనను ముందుకు తీసుకెళ్లడంలో స్వయంగా రాహుల్‌నే మెప్పించలేకపోయారు. తమ సొంత కుమారులను, కుమార్తెలను ప్రోత్సహించే విషయంలో ప్రలోభాలకు దూరంగా ఉండటంలో విఫలమైన వీరు రాహుల్ గాంధీకి రాజకీయ సమగ్రత్వం, సంపూర్ణత్వం అలవర్చగలరని ఎలా ఊహించగలం?

తన వెనుకనుంచి తనకు తగిలిస్తున్న 'పప్పు' ముద్రనుంచి బయటపడటానికి రాహుల్ గాంధీకి దాదాపు దశాబ్ద కాలం పట్టింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గట్టి పోరాటమే చేశారు. చాలామంది ఈ ఎన్నికల్లో రాహుల్ పనితీరుపట్ల ప్రశంసలు కురిపించారు. తీవ్రమైన వెనుకంజలు, ఎదురుదెబ్బలను తట్టుకుని నిలబడటంలో రాహుల్ కనబర్చిన అసాధారణ స్థిరత్వం పట్ల ప్రజల్లో గౌరవం పెరిగింది. కానీ రాహుల్ చేసిన ఈ రాజీనామా విషయం ఎలా అర్థం చేసుకోవాలి? తనపై దాడికి దిగిన కాషాయపార్టీ ప్రత్యర్థులతో తలపడడానికి అవసరమైన నిర్ణయాత్మక శక్తి, నిపుణతలు, కృత నిశ్చయం వంటివి తనకు లేవని రాహుల్ స్వయంగా అర్థ చేసుకున్నట్లు కనబడుతోంది. భారతదేశంలో కానీ, ప్రపంచంలో మరెక్కడైనా సరే రాజకీయ జీవితం అనేది వ్యక్తులకున్న పరిధిని, మనోభావాలను సామూహిక హితానికి పూర్తిగా లోబర్చవలసి ఉంటుందని డిమాండ్ చేస్తుంటుంది. ఇలా చేయడం తనకు సాధ్యం కాదని రాహుల్ భావిస్తూ ఉండవచ్చు.

అందుకే రాహుల్ గాంధీ తన అధ్యక్ష పదవికి చేసిన రాజీనామాను కాంగ్రెస్ ఇప్పుడు తప్పకుండా ఆమోదించాలి. గాంధీ కుటుంబం వెలుపల నుండి ఆయన స్థానాన్ని భర్తీ చేయగల సమర్థుడిని కనుగొనాల్సి ఉంది. ఇది కీలకమైన దశ. కాంగ్రెస్ పార్టీ ఈ అవకాశాన్ని వదులుకోకూడదు. చరిత్రలో నిర్ణాయకమైన స్థానంవైపు ముందుకు నడవడంలో ఏ రాజకీయ పార్టీ అయినా కఠిన నిర్ణయానికి సిద్ధపడాల్సి ఉంటుంది. మారుతున్న కాలంలో ప్రజల అవసరాలకు సమాధానం ఇవ్వడంలో వాజ్‌పేయి, అద్వానీ ద్వయం ఇక ముందుకు పోలేరన్న వాస్తవాన్ని బీజేపీ కేడర్లకు, నాయకులకు వివరించి నచ్చచెప్పడంలో నరేంద్రమోదీ అద్భుత కృషి చేశారు. పైగా రాహుల్ గాంధీ వయస్సు కూడా ఒక ప్రశ్నగా మారింది. అంటే ఆయనను ఇప్పుడు ఇంటికి వెళ్లడానికి అనుమతించకపోతే, మరో 20 ఏళ్లపాటు కాంగ్రెస్ పార్టీ రాహుల్‌నే అంటిపెట్టుకుంటుంది. అది కూడా రాహుల్ పెట్టే షరతులపైనే పార్టీ కొనసాగాల్సి ఉంది. ఇది కచ్చితంగా వారసత్వాన్ని కొనసాగించడం వైపే సాగుతుంది.

ఇదే సమయంలో ప్రియాంక గాంధీని స్టార్ కేంపెయినర్‌గా ముందుకు తీసుకురావడం ఎన్నికల సీజన్‌లో ఒక రకమైన శక్తిని పార్టీకి తీసుకొచ్చింది. కానీ దీనివల్ల కూడా కాంగ్రెస్ పార్టీ వారసత్వ ముద్రనే మళ్లీ వెలుగులోకి తీసుకొచ్చినట్లయింది. దీంతో కాంగ్రెస్ భాయి–బెహెన్ (అన్నా, చెల్లెలు) పార్టీ స్థాయికి కుదించుకుపోయింది. అందుకే నామ్‌ధార్, కామ్‌ధార్ నినాదంతో నరేంద్రమోదీ ఈ వంశపారంపర్య రాజకీయాలను తన ప్రచారంలో సులువుగా ఎండగట్టగలిగేరు.

అమేథీలో రాహుల్ నామినేషన్ దాఖలు చేసిన రోజు అప్రదిష్టపాలైన రాబర్ట్ వాద్రా తెరముందుకొచ్చారు. ఆయన కుమారుడు రెహాన్ కాంగ్రెస్ కుటుంబ రాజకీయ వ్యవస్థ సంభావ్య వారసుడిగా ఆ సమయంలో కనిపించాడు. ఒకరకంగా 2019 పోలింగ్‌కి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరాజయం కంటే ఎక్కువ విలువ కలిగింది. వారసత్వ రాజకీయ నాయకత్వ నమూనాను ఇది తిరస్కరించింది. ఏమాత్రం రాజీపడని రాజకీయ ప్రత్యర్థిని కాంగ్రెస్ ఎదుర్కొంది. నెహ్రూవియన్ విధానాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని వ్యతిరేకిస్తున్న ఒక సిద్ధాంతంతో కాంగ్రెస్ పార్టీకి సవాలు ఎదురైంది. దీంతో భారతీయ సామాజిక సమీకరణాలనే కాంగ్రెస్ కొత్తగా మథనం చేయాల్సి వచ్చింది. మన దేశపౌరులకు తిరిగి హామీ ఇవ్వగలిగిన ఒక విశ్వసనీయమైన ప్రాపంచిక దృక్పథాన్ని అది నేర్చుకోవలసి వచ్చింది. పైగా తన కేడర్, కార్యకర్తలు సంతోషంగా స్వీకరించగలిగిన ఒక స్పష్టతను, దార్శనికతను అది ప్రదర్శించవలసి వచ్చింది. దీనికోసం కాంగ్రెస్ పార్టీకి నిజంగానే సాంస్కృతిక విప్లవం లాంటిది అవసరమవుతుంది.. కానీ ఈ తరహా పరిష్కారంలో 'గాంధీ'లు భాగం కాలేరు.

పార్టీ అధ్యక్ష పదవి నుంచి రాహుల్ గాంధీ నిష్క్రమణను కాంగ్రెస్ దయతో అనుమతించాల్సి ఉంది. అనేకమంది కాంగ్రెస్ వాదుల వ్యక్తిగత అదృష్టాలు గాంధీ కుటుంబంతోనే ముడిపడివున్నాయి. ఇలాంటి నాయకులే ఇప్పుడు రాహుల్ పదవినుంచి దిగిపోతే, అస్త్రసన్యాసం చేస్తే పార్టీ విచ్ఛిన్నమవుతుందనీ, కుప్పగూలిపోతుందనీ భయాందోళనలను ప్రచారం చేస్తూ వస్తున్నారు. అనివార్యమైన ఈ ఉపద్రవం, ఈ కల్లోలభరిత కాలం కాంగ్రెస్ పార్టీకి నిజంగానే మంచి చేస్తుంది. ఈ సంధికాలంలోనే పార్టీ సభ్యులు నాయకత్వాన్ని పరీక్షించడం, ప్రశ్నించడం నేర్చుకోవాల్సి ఉంటుంది. పైగా అవసరమైతే నాయకత్వానికి, కార్యకర్తలకు మధ్య, ఆదేశాలకు, విధేయతకు మధ్య ఉన్న సంబంధాల సంప్రదాయాన్ని కూడా వీరు ఛేదించవలసి ఉంటుంది. యావత్ పార్టీ నిర్మాణాన్ని బాగు చేసుకునే క్రమంలో కాంగ్రెస్ నిజంగానే రక్తమోడ్చాల్సి ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
'ది వైర్'తో ప్రత్యేక ఏర్పాటు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### భక్తి



"**మోదీ:** ప్రజలు చెల్లించిన పన్నుల డబ్బుతో నేను రూ.3వేల కోట్ల విలువైన విగ్రహం నిర్మించా. **భక్తులు:** వావ్.. ఎంత అద్భుతమైన నాయకుడు, ఆయన దేశాన్ని మరింత ముందుకు తీసుకుపోతాడు. **కేజ్రీవాల్:** ప్రజలు చెల్లించిన పన్నుల మొత్తాన్ని కనీస అవసరాలపై సబ్సిడీకి వినియోగిస్తా. **భక్తులు:** పన్నుల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారు"

– అభిజీత్ డిప్కే, ఆప్ నేత

### పాట



"విభజన, విద్వేష నేరాలపై పరిశోధించడానికి నేను ఓ రెండు వారాలు జార్ఖండ్‌లో గడిపాను. ఉద్రిక్తతలకు దారితీసేది ఏడాదికి ఒకసారి జరిగే అతిపెద్ద రామ నవమి ఊరేగింపే. సాయుధంగా జరిగే ఆ ఊరేగింపు మసీదుల ముందు ఆగుతుంది. మతపరమైన, ఆయుధాలను కీర్తించే పాటలు పాడతారు. హిందుత్వ సంగీతంతో ఇది సమాంతరంగా సాగుతుంది. చాలామంది యువకులు ఈ పాటలను కాలర్ ట్యూన్‌లుగా, రింగ్ టోన్‌లుగా వాడుతున్నారు"

– కునాల్ పురోహిత్, జర్నలిస్ట్

### పునర్జన్మ



"జుహూ ఎస్‌ఎన్‌డీటీ రోడ్‌ను మూసివేశారు. జుహూ నుంచి బంద్రా చేరుకోవాలనుకుంటే మూడే అవకాశాలు ఉన్నాయి. 1. సముద్రంలో ఈదుకుంటూ పోవడం, 2. మెట్రో కోసం తవ్విన గోతుల్లోంచి నడుచుకుంటూ వెళ్లడం, 3. జుహూలో మనల్ని మనం చంపేసుకుని వచ్చే జన్మలో బంద్రాలో పుట్టాలని ప్రార్థించాలి"

– అతుల్ ఖత్రీ, కమెడియన్

### ప్రయాణం



"మెట్రోలో, బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాలని ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం నిర్ణయించడం చాలా అభినందనీయం. మహిళలు ప్రజా రవాణాను వినియోగించుకునేందుకు ఈ చర్య దోహదపడుతుంది. సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా, దిలీప్ పాండేలతో కూడిన మీ బృందానికి వందనాలు"

– శత్రుఘ్న సిన్హా, నటుడు

### వయసు



"వయసు మళ్లిన వారికి పదవులు వద్దని భారతీయ జనతా పార్టీ చెబుతుంది. కానీ, అజిత్ దోవల్ వయసు ఇప్పుడు డెబ్బయి నాలుగేళ్లు, అయినా ఆయనను కేబినెట్ ర్యాంకుతో ఐదేళ్లపాటు ఎన్‌ఎస్‌ఏగా నియమించారు. ఎంపీలు, మంత్రులకు వర్తించేవి బహుశా కేబినెట్ ర్యాంకువారికి వర్తించవనుకుంట. పాపం సుమిత్రా మహాజన్"

– యశ్వంత్ సిన్హా, కేంద్ర మాజీ మంత్రి

# పర్యావరణ రక్షణతోనే భవిష్యత్తు

పర్యావరణం మీద కాలుష్య ప్రభావం అధికంగా ఉంది. నేటి ఆధునిక నాగరికత ఫలితంగా ఉత్పన్నమవుతున్న కాలుష్యం కారణంగా పర్యావరణంలో అనేక హానికర విష పదార్థాలు ఎక్కువ పరిమాణంలో ఉంటున్నాయి. అడవుల్లో రగిలే కార్చిచ్చు, అగ్ని పర్వతాలు బద్ధలు కావడం వంటి సహజ కాలుష్య కారణాలకు తోడు, అటవీ ప్రాంతాలను పంట భూములుగా, రహదారులుగా, క్వారీలు, గనులుగా మారుస్తున్నారు. వాహనాల నుంచి, పరిశ్రమల నుంచి వెలువడే విష వాయువులు పర్యావరణానికి హాని చేస్తున్నాయి.

భూమి తీవ్ర స్థాయిలో వేడెక్కడం వల్ల ప్రకృతి సమతుల్యం దెబ్బతినడంతోపాటు, సకాలంలో వర్షాలు పడకపోవడం, భూ ఉపరితలంపై ఉష్ణోగ్రత పెరగడంవల్ల ధ్రువ ప్రాంతాలలో మంచు కరిగి సముద్రంలో కలిసినప్పుడు సముద్రపు నీటిలో ఉన్న లవణత తగ్గిపోవడం జరుగుతున్నాయి. మితిమీరిన స్థాయిలో ఇంధనాన్ని వాడటం వల్ల నత్రజనిలు వాతావరణంలో పేరుకుపోవడంతో భూమిపై హరిత గృహ వాయువుల పరిమాణం పెరిగిపోతున్నది. ఈ కారణం వల్ల క్రమేణా భూమి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మితిమీరిన మోతాదులో ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లు వాడటంవల్ల అందులో నుంచి వచ్చే ఫ్లోరిన్ సంబంధిత వాయువుల పరిమాణం గాలిలో ఎక్కువ అవుతుంది. అతినీలలోహిత కిరణాలవల్ల పంటలు దెబ్బతింటాయి. మనుషులకు అనేక వ్యాధులు వస్తాయి. చర్మ, కంటి సమస్యలు వస్తాయి. శబ్ద కాలుష్యం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. అధిక రక్తపోటు, ఒత్తిడి కలుగడంతోపాటు అనేక శబ్దాలు, హృదయనాళాల మీద తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకంవల్ల ప్రకృతి ప్రమాదకరంగా మారింది.

**పర్యావరణ పరిరక్షణకై తీసుకోవలసిన ముఖ్య జాగ్రత్తలు**

మొక్కలు అధికంగా నాటాలి. అడవులు నరికి వేయటం మానాలి. ఇంధన వినియోగాన్ని, దుబారాను తగ్గించాలి. రసాయన ఎరువులు, కీటక నాశనులు వాడకానికి బదులు సేంద్రీయ ఎరువులను ప్రోత్సహించాలి. మంచి శక్తివంతమైన సీఎఫ్‌ఎల్ బల్బులు కొనడం, విద్యుత్తును పొదుపుగా వాడుకోవడం, వాహనాలలో శుద్ధమైన ఇంధనాన్నే వాడటం, సౌరశక్తితో పనిచేసే పరికరాలను ఉపయోగించడంతోపాటు నీటిని సంరక్షించడానికి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి. పర్యావరణాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది.

జె. అజయ్‌కుమార్,
ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ (ఎయిడెడ్),
విజయనగర్ కాలేజ్ ఆఫ్ కామర్స్,
హైదరాబాద్

# పచ్చగా ఉండాలంటే.. పచ్చదనం ఉండాలి

మనిషి బతకాలంటే చుట్టూ ఉన్న అడవులు, కొండలు కోనలు, చెట్లు చేమలు, చెరువులు సెలయేళ్లు, నదులు సముద్రాలు, వీటన్నింటినీ అంటిపెట్టుకుని ఉండే సకల జీవకోటి బతకాలి. అప్పుడే మనిషి ప్రకృతిలో భాగంగా బతకగలడు. మనిషి ప్రకృతి నుంచి విడిపోయి మనుగడ సాగించలేడు.

భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశాలను మనం పంచ భూతాలుగా చెప్పుకుంటున్నాం. ఈ పంచ భూతాలు కలయికతో ఏర్పడేదే ప్రకృతి. ఈ పంచ భూతాత్మక ప్రకృతినే పర్యావరణం అంటాం. భూగోళాన్ని ఆవరించి ఉన్న వాయువునే వాతావరణం అంటాం. ఈ భూవాతావరణం అనేక జీవులు, నిర్జీవులతో కూడుకుని ఉంది. అందుకే మన పర్యావరణం కలుషితం కాకూడదనేదే అందరి వాదన. నేడు అడవుల సమతుల్యం, పర్యావరణ సమతుల్యం దెబ్బతినడంవల్లే జీవి మనుగడకు ప్రమాదం ఏర్పడింది. నగరీకరణ, ఆధునీకరణ, పారిశ్రామికీకరణ విషయంలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే జల, వాయు, శబ్ద, ఆహార కాలుష్యాలు ప్రమాద స్థాయిని మించి పోయాయి.

ప్రాచీన సంస్కృతులన్నీ ప్రకృతిని ఆరాధిస్తూనే పెరిగాయి. అన్ని ప్రధాన పండుగలు, సంప్రదాయాలలో నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తూ వచ్చింది. ఎప్పుడైతే మనం ప్రకృతితో ఉన్న అనుబంధం నుంచి దూరంగా ఉండడం మొదలు పెట్టామో.. అప్పటి నుంచే కాలుష్యాన్ని పుట్టించడం, పర్యావరణాన్ని నాశనం చేయడం మొదలైంది. నేడు దేశంలోని థర్మల్ కేంద్రాలు, చమురు శుద్ధి కర్మాగారాలు, ఎరువుల కర్మాగారాలు, మందులు, రసాయన పరిశ్రమలు, సిమెంట్, తోలు వంటి అనేక కర్మాగారాలు వెదజల్లుతున్న విషపూరిత వాయువు, రసాయన వ్యర్థ పదార్థాల వల్ల, నగరాలు, పట్టణాల్లో ఉత్పత్తి అవుతున్న తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు వంటి వాటి వల్ల నేడు పర్యావరణం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. జల కాలుష్యం, వాయు కాలుష్యం అభివృద్ధిని మించి పోయింది. దీంతో వాతావరణంలో మార్పులు సంభవించి భూమి వేడెక్కిపోతుంది. పర్యావరణ కాలుష్యం వల్ల నష్ట పోయేది ఎక్కువగా పేదలు, మధ్యతరగతి ప్రజలు, మూగజీవులే. సమాజంలో పది శాతం కూడా ఉండని సంపన్నులు వెదజల్లే



కాలుష్యానికి వీరు బలైపోతున్నారు. సంపన్నులు వాడే ఏసీ మిషన్లు వల్ల, వీరు ఉపయోగించే వాహనాలు వల్ల, వీరు నిర్వహించే పరిశ్రమల వల్ల, వీటి మూలంగా ఏర్పడే తీవ్రమైన ఎండలు, సైక్లోన్‌లు, కల్తీ ఆహారం, కలుషిత నీరు,కలుషిత వాయువు వల్ల అనారోగ్యానికి గురై నష్టపోయేది పేదలే. సంపన్నులు ఏసీ గదుల్లోను, ఆక్సిజన్ బార్లలోను, ఆర్గానిక్ ఆహారంతో కాలుష్య ఫలితాలకు దూరంగా జీవిస్తుంటారు. సామాన్యులు, మూగజీవులు మాత్రం కలుషిత ఆహారం, నీరు, అధిక ఉష్ణోగ్రతలు, గాలివానలు భరిస్తూ, గూడులేని జీవి తాన్ని గడుపుతూ కాలుష్య ఫలితాలు అనుభవిస్తున్నారు.

ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు బాధ్యత వహించుతూ బడ్జెట్‌లో అధిక శాతం నిధులు కేటాయించి చిత్తశుద్ధితో అమలు పర్చాలి. నిత్యం పర్యావరణ ఆడిటింగ్ జరుపుతూ కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి. కాలుష్య నివారణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. పర్యావరణ పరిరక్షణకు చట్టాలు మాత్రమే సరిపోవు. మనిషి జీవన విలువలలో పర్యావరణ పరిరక్షణను భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉంది. వినూత్న విధానాలతో నీటిని కాలుష్యం బారిన పడకుండా చూడటం, పొదుపు చేయడం. ఆక్సిజన్ బార్లు అవసరం రాని వాతావరణంను కల్పించుకోవడం, రసాయనాలు లేని వ్యవసాయం అమలు చేయడం, నదులను పునరుజ్జీవింప చేయడం, మొక్కలను పెంచడం, ప్లాస్టిక్ వినియోగంలో చైతన్యం తేవడం, వ్యర్థాలు ఏమాత్రం ఉత్పత్తి చేయని జీవన విధానాలను అవలంభించడం వంటి విషయాలలో అందరినీ ముఖ్యంగా యువతను భాగస్వాములు చేయాలి. పర్యావరణ కాలుష్యంకు కారకులైన కార్పొరేట్ సంస్థలు, సంపన్నులే.. ఈ కాలుష్య నివారణకు నడుంబిగించి ముందుకు రావాలి. కాలుష్య ఫలితంగా పేదలకు, మూగజీవులకు జరిగిన నష్టాలను ఎప్పటికప్పుడు అంచనా వేసి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత సంపన్నులు, ప్రభుత్వానిదే. అప్పుడే అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినం జరుపుకోవడంలో నిజమైన ఆనందం, లక్ష్యం సాధించగలం.

(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

యాతం వీరాస్వామి, రచయిత, విశ్లేషకులు
మొబైల్ : 95816 76918

# ప్రేమతత్వాన్ని ప్రోదిచేసే ఈద్

ముస్లిం సమాజం జరుపుకునే రెండు ముఖ్యమైన పండుగల్లో ఈదుల్ ఫిత్ర్ అత్యంత పవిత్రమైనది. ఈ నెలలో ముస్లింలు ఎంతో నియమనిష్టలతో రోజా వ్రతం పాటిస్తారు. భక్తిశ్రద్ధలతో రోజూ ఐదుసార్లు నమాజ్ చేస్తారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని భక్తితో పారాయణం చేస్తారు. ముహమ్మద్ ప్రవక్త(స) వారిపై సలాములు పంపుతూ ఉంటారు. ప్రతిరోజూ తరావీహ్ నమాజులో పాల్గొని తన్మయులవుతుంటారు. దానధర్మాలు చేస్తారు, ఫిత్రాలు చెల్లిస్తారు.

ఈ విధంగా రమజాన్ చంద్రవంక దర్శనంతో ప్రారంభమైన ఉపవాస దీక్షలు నెల రోజుల తరువాత షవ్వాల్ మాసం నెలవంక దర్శనంతో సమాప్తమవుతాయి. షవ్వాల్ మొదటి తేదీన జరుపుకునే 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినాన్నే మనం రమజాన్ పండుగ అంటున్నాము. రమజాన్ ఉపవాసదీక్షలు, పవిత్ర ఖురాన్ అవతరణతో దీని సంబంధం పెనవేసుకుపోయిఉంది. మానవుల్లో దైవభక్తిని, దైవభీతిని, సదాచారాన్ని, మానవీయ విలువల్ని జనింపజేయడానికి సృష్టికర్త ఉపవాస వ్రతాన్ని విధిగా నిర్ణయించాడు. రమజాన్ ఉపవాసవ్రతం మనిషిని ఒక క్రమశిక్షణాయుత జీవనవిధానానికి, బాధ్యతాయుతమైన జీవనవిధానానికి, దైవభక్తి పరాయణతతో కూడుకున్న



రుజుమార్గం

జీవన విధానానికి అలవాటుచేస్తుంది. మానవుల్లో మహోన్నత విలువలను, సుగుణాలను జనింపజేసే వ్రతాన్ని పరాత్పరుడైన అల్లాహ్ వారికి అనుగ్రహించినందుకు, వాటిని వారు నెలరోజులూ మనోవాక్కాయ కర్మల ద్వారా త్రికరణశుద్ధిగా పాటించగలిగినందుకు సంతోష సంబరాల్లో తేలిపోతూ కృతజ్ఞతా పూర్వకంగా భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు.

ఈ విధంగా రమజాన్ నెల ఆరంభం నుండి అంతం వరకు ఒక క్రమ పద్ధతిలో ధర్మం చూపిన బాటలో నడుస్తూ, దైవప్రసన్నత, పుణ్యఫలాపేక్షతో గడిపినవారు ధన్యులు. అందుకే 'ఈద్' (పండుగ)ను శ్రామికుని వేతనం (ప్రతిఫలం) లభించే రోజు అంటారు. ఆ రోజు ముస్లిములందరూ ఈద్ నమాజ్ ముగించుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు ప్రత్యేకంగా తయారుచేసిన సేమియా పాయసాన్ని తమ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు సోదరులందరికీ ఆప్యాయంగా రుచిచూపించి తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు. 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుంటారు. ఈ విధంగా రమజాన్ పర్వదినం మనిషిని ఉన్నత మానవీయ విలువలు కలవాడుగా తీర్చిదిద్ది, సమాజంలో శాంతి, సమానత్వం, సామరస్యం, సోదర భావాలకు పునాది వేస్తుంది. ప్రేమ తత్వాన్ని ప్రోది చేస్తుంది. ఇదీ ఈదుల్ ఫిత్ర్ – రమజాన్ పర్వదిన పరమార్థం.

– యండి.ఉస్మాన్ ఖాన్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

# ఇంజనీరింగ్‌లో బాలురు.. అగ్రి-మెడికల్‌లో బాలికల హవా

**ఎంసెట్-2019 ఫలితాలు విడుదల**
- ఇంజనీరింగ్‌లో 74.39 శాతం.. అగ్రి–మెడికల్‌లో 83.64 శాతం ఉత్తీర్ణత
- టాప్ టెన్ ర్యాంకుల్లో బాలురదే పైచేయి
- ర్యాంకర్లలో 9 మంది తెలంగాణ విద్యార్థులు.. ఒకరు బీహారీ
- ఇంజనీరింగ్‌లో 10 ప్రశ్నలకు, అగ్రి–మెడికల్‌లో మూడు ప్రశ్నల సమాధానాల ఆప్షన్‌లలో మార్పులు
- ఈనెల 18లోగా అడ్మిషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు

**సాక్షి, అమరావతి/తాడేపల్లిగూడెం/సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/ఆర్ఆర్‌పేట (ఏలూరు) :** బీటెక్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్సు టెక్నాలజీ, బి–ఫార్మసీ, ఫార్మాడీ, బీఎస్సీ హార్టికల్చర్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఎంసెట్–2019 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి దమయంతి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ విజయరాజు ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కోటేశ్వరరావు, ఎంసెట్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం.రామలింగరాజు, కన్వీనర్ ప్రొ. సీహెచ్.సాయిబాబు, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ జీఎస్ పండాదాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తీర్ణతా శాతాలు ఇలా..

ఇంజనీరింగ్‌లో బాలురు, అగ్రి–మెడికల్ విభాగంలో బాలికలు ఆధిక్యాన్ని కనబరిచారు. అలాగే, ఇంజనీరింగ్‌లో 74.39 శాతం మంది, అగ్రి–మెడికల్‌లో 83.64 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంజనీరింగ్ టాప్ పది ర్యాంకుల్లో బాలురు ఉండగా.. అగ్రి–మెడికల్‌లో బాలురు, బాలికలు చెరో అయిదు స్థానాల్లో నిలిచారు. ఇంజనీరింగ్, అగ్రి–మెడికల్ రెండు విభాగాల్లోని 20 ర్యాంకర్లలో తొమ్మిది మంది తెలంగాణ, ఒకరు బీహార్‌కు చెందిన వారు కాగా.. మిగిలిన వారు ఏపీ విద్యార్థులు. కాగా, ఏపీ ఎంసెట్–2019 పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించారు.

### కనీస అర్హత మార్కులు 40

ఇదిలా ఉంటే.. 160 మార్కులకు ఎంసెట్ పరీక్షలు నిర్వహించగా 40 మార్కులను కనీస అర్హత మార్కులుగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి అర్హత మార్కుల్లేవు. ఇంజనీరింగ్ విభాగంలో 1,95,719 మంది దరఖాస్తు చేయగా 1,85,711 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,38,160 (74.39 శాతం) మంది అర్హత సాధించారు. అగ్రి, మెడికల్ విభాగంలో 86,986 మంది దరఖాస్తు చేయగా 81,916 మంది పరీక్ష రాశారు. వీరిలో 68,512 మంది (83.64 శాతం) అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో బాలురు 82,088 మంది, బాలికలు 56,072 మంది అర్హత సాధించారు. అగ్రి–మెడికల్‌లో బాలురు 22,946 మంది, బాలికలు 45,566 మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా, ఇంజనీరింగ్ విభాగంలో 1,22,188 మందికి, అగ్రి, మెడికల్ విభాగంలో 63,206 మందికి ర్యాంకులు కేటాయించారు.

### ఎంసెట్‌లో పాసైనా ఇంటర్‌లో ఫెయిల్

మరోవైపు.. ఎంసెట్ పరీక్షలు రాసిన విద్యార్థులు అందులో ఉత్తీర్ణులైనా ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో వారికి ర్యాంకులు కేటాయించలేదు. ఇంజనీరింగ్ విభాగంలో 12,874 మంది ఎంసెట్‌లో ఉత్తీర్ణులైనా ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించలేదు. అగ్రి–మెడికల్ విభాగంలో ఉత్తీర్ణులైన 3,152 మంది ఇంటర్‌లో పాస్ కాలేదు. అలాగే, ఇంటర్మీడియెట్ కాకుండా వేరే బోర్డుల నుంచి ఎంసెట్ పరీక్షకు హాజరైన ఇంజనీరింగ్ విభాగంలోని 3,067 మంది, అగ్రి–మెడికల్ విభాగంలో 2,153 మంది విద్యార్థులు ఇంటర్ మార్కులు అందచేయకపోవడంవల్ల వారికి ర్యాంకులు కేటాయించలేదు.

### సమాధానాల ఆప్షన్లలో మార్పులు

ఇంజనీరింగ్ విభాగంలో ఏడు సెషన్లలో నిర్వహించిన పరీక్షలలో ప్రాథమిక కీ కి సంబంధించి 139 ప్రశ్నలపై అభ్యంతరాలు రాగా నిపుణుల సలహా మేరకు 10 ప్రశ్నలకు ఆప్షన్లు మార్పుచేశారు. మరో 10 ప్రశ్నల మల్టిపుల్ ఆప్షన్లకు మార్కులు కేటాయించారు. అలాగే, మెడికల్ విభాగంలో మూడు సెషన్లలో జరిగిన పరీక్షలలో 41 ప్రశ్నలకుగాను నిపుణుల సలహా మేరకు మూడు ప్రశ్నలకు ఆప్షన్లను మార్పు చేయగా ఒక ప్రశ్న మల్టిపుల్ ఆప్షన్లకు మార్కులు కేటాయించారు.

### 10 నుంచి ర్యాంకు కార్డులు

ఇదిలా ఉంటే.. ఎంసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు జూన్ పదో తేదీ నుంచి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్/ఈఏఎంసీఈటీ’ వెబ్‌సైట్ ద్వారా తమ ర్యాంకు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### 18లోగా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

సాధ్యమైనంత త్వరగా అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈనెల 18 లోగానే అడ్మిషన్లను చేపడతామని అధికారులు చెప్పారు.

**అగ్రి-మెడికల్ ర్యాంకర్లు**


3 సాయి ప్రవీణ్ గుప్తా


4 టి. హాసిత


5 జి. మాధురి


6 జి. కృష్ణవంశీ

**ఇంజనీరింగ్ ర్యాంకర్లు**


3 జి. భానుదత్తా


4 డి. చంద్రశేఖర్


5 బి. కార్తికేయ


6 రిషి షరాఫ్

**ఐఏఎస్ అవుతా**

ఐఏఎస్ కావడమే నా లక్ష్యం. ఫస్ట్ ర్యాంకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ముంబై ఐఐటీలో సీఎస్ఈ గ్రూపు చదవాలని ఉంది. పదో తరగతిలో 9.8 జీపీఏ, ఇంటర్ ఎంపీసీలో పదికి పది జీపీఏ, జేఈఈ మెయిన్స్‌లో 136వ ర్యాంకు వచ్చింది. బిట్ శాట్‌లో 450 మార్కులకు 450 మార్కులు వచ్చాయి.
– రవి శ్రీతేజ, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా, ఎంసెట్ ఇంజనీరింగ్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్

**కార్డియాలజిస్ట్‌ను అవుతా**

కార్డియాలజిస్ట్ కావాలని ఉంది. తల్లిదండ్రులు విజయశాంతి, సూర్యభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఇచ్చిన స్ఫూర్తితో ఎంసెట్ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించగలిగా.
– దాసరి కిరణ్‌కుమార్, ఎంసెట్ అగ్రికల్చర్ విభాగంలో 2వ ర్యాంకర్, రాజమహేంద్రవరం,

**పరిశోధనా రంగంలో రాణిస్తా**

పరిశోధన రంగంలో నూతన ఆవిష్కరణలు చేసి దేశాన్ని సమాచార, సాంకేతిక రంగంలో ముందంజలో నిలపాలని ఉంది.
– గొర్తి భానుదత్త, ఇంజనీరింగ్ 3వ ర్యాంకర్, భీమవరం,

**న్యూరో సర్జన్ కావడమే లక్ష్యం**

నేను న్యూరో సర్జన్ అవుతా. నీట్‌లోనూ మంచి ర్యాంకు సాధించి ఉత్తమ వైద్య కళాశాలలో చేరి ఎంబీబీఎస్ పూర్తిచేస్తా.
– ఎస్.సాయిస్వాతి, తిరుపతి, ఎంసెట్ అగ్రికల్చర్ ఫస్ట్ ర్యాంకర్

**ఎంసెట్‌లో ఉత్తీర్ణతా శాతం ఇలా..**

| ఏడాది | ఇంజనీరింగ్ | అగ్రి–మెడికల్ |
|---|---|---|
| 2015 | 83.70 | 97.29 |
| 2016 | 73.32 | 87.59 |
| 2017 | 79.74 | 91.24 |
| 2018 | 72.28 | 87.06 |
| 2019 | 74.39 | 83.64 |

**ఇంజనీరింగ్‌లో టాప్ 10 ర్యాంకర్లు..**
- కురిశేటి రవి శ్రీతేజ (పశ్చిమగోదావరి)
- పి. వేదప్రణవ్ (రంగారెడ్డి, తెలంగాణ)
- గొర్తి భానుదత్త (పశ్చిమగోదావరి)
- డి. చంద్రశేఖర్ ఎస్ఎస్ హేతహవ్య (రంగారెడ్డి, తెలంగాణ)
- బి. కార్తికేయ (రంగారెడ్డి, తెలంగాణ)
- రిషి షరాఫ్ (మాధేపూర్, బీహార్)
- జీవీకె సూర్య లిఖిత్ (పశ్చిమగోదావరి)
- ఎ. అభిజిత్‌రెడ్డి (రంగారెడ్డి, తెలంగాణ)
- ఆర్యన్ లడ్డా (రంగారెడ్డి, తెలంగాణ)
- ఎ. హేమవెంకట అభినవ్ (కొత్తగూడెం, తెలంగాణ)

**అగ్రి–మెడికల్‌లో టాప్ 10 ర్యాంకర్లు..**
- సుంకర సాయిస్వాతి (చిత్తూరు)
- దాసరి కిరణ్‌కుమార్‌రెడ్డి (తూర్పుగోదావరి)
- అత్యం సాయిప్రవీణ్ గుప్తా (తూర్పుగోదావరి)
- తిప్పరాజు హాసిత (హైదరాబాద్)
- జి.మాధురిరెడ్డి (రంగారెడ్డి, తెలంగాణ)
- గొంగటి కృష్ణవంశీ (నెల్లూరు)
- కేజే వైష్ణవీ వర్మ (కర్నూలు)
- డి. సుభిక్ష (తూర్పుగోదావరి)
- కొర్నెపాటి హరిప్రసాద్ (గుంటూరు)
- ఎంపటి కుష్వంత్ (భూపాలపల్లి, తెలంగాణ)

## ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

**చేబ్రోలు(పొన్నూరు):** ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ జూనియర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు పొందినట్లు కళాశాలల సమన్వయకర్త జి.శ్రీకూర్మనాథ్ తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో శ్రీకూర్మనాథ్ మాట్లాడుతూ.. తమ కళాశాలలకు చెందిన పది శాతం మంది విద్యార్థులు వెయ్యి లోపు ర్యాంకులు సాధించారని, 20 శాతానికి పైగా విద్యార్థులు 5 వేల లోపు ర్యాంకులు సాధించారని, 35 శాతానికి పైగా విద్యార్థులు 10 వేల లోపు ర్యాంకులు సాధించారని, 50 శాతం వరకు విద్యార్థులు 20 వేల లోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వడ్లమూడి జూనియర్ కళాశాలకు చెందిన ఎ.లీలా గురుచరణ్ 264వ ర్యాంకు, జి.విష్ణువర్ధన్‌రెడ్డి 430వ ర్యాంకు, ఎస్‌వీఎన్ మణికంఠ 517వ ర్యాంకు, ఎస్.వినయ్‌కుమార్ 523వ ర్యాంకు పొందినట్లు తెలిపారు. జూనియర్ మహిళా కళాశాలకు చెందిన భవ్య 983వ ర్యాంకు, జె.లక్ష్మీ వర్షిత 1543వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. ర్యాంకులను సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్, వైస్‌చైర్మన్‌లు లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు.

## ఎంసెట్ ఫలితాల్లో ఆదిత్య హవా

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** ఎంసెట్ ఫలితాల్లో తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని ఆదిత్య విద్యార్థులు హవా కొనసాగించారు. మెడికల్ విభాగంలో డి.సుభిక్ష (8వ ర్యాంక్)తో పాటు 44, 48, 438, 509, 576, 590, 609 ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో డి.రోహిత్ రాష్ట్ర స్థాయిలో 40వ ర్యాంక్‌తో పాటు 44, 48, 56, 81, 107, 218, 319, 368, 454, 495, 515, 592, 641, 669, 675, 697, 774, 805, 810, 822, 938, 940, 964 ర్యాంకులు సాధించారు. విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్ రెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి అభినందించారు.

## తిరుమల విజయకేతనం

**రాజమహేంద్రవరం రూరల్:** ఎంసెట్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చరల్ విభాగంలో రాష్ట్రస్థాయి మూడో ర్యాంకుతో పాటు 35, 102, 124, 168, 176, 208, 225, 245, 265, 272, 281 ర్యాంకులు.. 1,000 లోపు 44 మంది ర్యాంకులు సాధించారన్నారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 16, 91, 110, 117, 126, 148, 154, 168, 180, 207, 219, 225, 229, 233, 235, 239, 265, 267, 269 ర్యాంకులతో పాటు 60 మంది 1,000 లోపు ర్యాంకులు సాధించారన్నారు.

## సత్తా చాటిన భాష్యం

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఏపీ ఎంసెట్ ఫలితాల్లో భాష్యం విద్యా సంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో టాప్ ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. బైపీసీ విభాగంలో కె.హరిప్రసాద్ 9వ ర్యాంకు, వి.హర్షవర్ధన్ 26, షేక్ ఎండీ రియాజ్ 32, ఇ.శంకర్ 43, ఎన్.ప్రమోద 53, కె.దేవిశ్రీ 65, ఎన్.నరేన్‌దీప్ 70, వై.లలితకృష్ణ 71, కె.మానస 8, పి.మంజిత్ శ్రీరాజ్ 95వ ర్యాంకు సాధించారని వివరించారు. ఇంజనీరింగ్ విభాగంలో డి.హాకేష్ 66, పి.శ్రీవర్ధన్ 67, టి.యశ్వంత్ 79వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. మొత్తం 100 లోపు 13 స్టేట్ ర్యాంకులు కైవసం చేసుకున్నామని తెలిపారు.

## ఎన్నారై విజయకేతనం

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఎంసెట్ ఫలితాల్లో ఎన్నారై విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. వెయ్యి లోపు వరుసగా 316, 364, 469, 473, 588, 680, 701, 794, 834, 891, 904వ ర్యాంకులు దక్కాయని తెలిపారు. 5 వేల లోపు 196 మంది విద్యార్థులు ర్యాంకులు కైవసం చేసుకున్నారని వివరించారు. ఎంసెట్‌కు హాజరైన విద్యార్థుల్లో 95 శాతం మంది అర్హత సాధించారని తెలిపారు.

### కేకేఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థుల సత్తా

కేకేఆర్ గౌతమ్ స్కూల్స్‌లో 10వ తరగతి వరకు చదివి, ఐఐటీ ఫౌండేషన్ తీసుకున్న విద్యార్థులు ఏపీ ఎంసెట్‌లో సత్తా చాటారు. ఈ మేరకు గౌతమ్ స్కూల్స్ చైర్మన్ కోటేశ్వరరావు ఓ ప్రకటన విడుదల చేశారు. తమ పూర్వ విద్యార్థుల్లో ఇంజనీరింగ్ విభాగంలో 3, 7, 10 ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే 23, 26, 31, 32, 45, 46, 49, 51, 52, 58, 61, 63, 65, 77, 93, 95 వంటి 100 లోపు 19 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్లు పేర్కొన్నారు.

### శశి విద్యార్థుల ఆధిక్యత

ఎంసెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు మరోసారి ప్రతిభ కనిబరిచారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో తమ విద్యార్థులు 146, 151 ర్యాంకులతో పాటు 500 లోపు 19 ర్యాంకులు, 1,000 లోపు 49 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే అగ్రికల్చర్/ ఫార్మసీ విభాగంలో 61, 64, 73 ర్యాంకులతో పాటు 100 లోపు 3 ర్యాంకులు, 200 లోపు 14 ర్యాంకులు, 500 లోపు 30 ర్యాంకులు, 1,000 లోపు 57 ర్యాంకులు సాధించినట్లు వివరించారు.

### శ్రీవిశ్వశాంతి జూనియర్ కాలేజీ హవా

ఎంసెట్ ఫలితాల్లో శ్రీ విశ్వశాంతి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ– ఉయ్యూరు విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, డైరెక్టర్ సూర్యశేఖర్ తెలిపారు. 124 ఎంపీసీ విద్యార్థుల్లో 78 మంది, 53 బైపీసీ విద్యార్థుల్లో 47 మంది ఇంజనీరింగ్, ఫార్మసి, వెటర్నరీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు.

**తెలంగాణ**

## పల్లెలన్నీ గులాబీ తోటలే!

- పరిషత్ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయదుందుభి
- 32 జెడ్పీలూ అధికార పార్టీ కైవసం
- 538 జెడ్పీటీసీల్లో 451 చోట్ల విజయం

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ పరిషత్ పోరులో గులాబీ గుబాళించింది. బ్యాలెట్ పేపర్ ద్వారా జరిగిన ఈ ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ విజయదుందుభి మోగించింది. రాష్ట్రంలోని 32 జిల్లా పరిషత్ స్థానాలను క్లీన్ స్వీప్ చేసింది. ఒక్కచోట కూడా కాంగ్రెస్ పార్టీ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. మొత్తం 538 జడ్పీటీసీ స్థానాలకు గానూ 451 చోట్ల టీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందగా, కాంగ్రెస్ 73 స్థానాల్లో, బీజేపీ 8 స్థానాల్లో, ఇతరులు 5 స్థానాల్లో విజయం సాధించారు. ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కారు దూసుకుపోయింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,556 ఎంపీటీసీ స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ పార్టీ 1,396 చోట్ల గెలుపొందగా.. బీజేపీ 208 చోట్ల, లెఫ్ట్ పార్టీలు, టీడీపీ, ఇతరులు కలిపి 649 స్థానాల్లో విజయం సాధించారు. గెలిచిన ఎంపీటీసీ స్థానాలను బట్టి చూస్తే.. 537 మండల పరిషత్‌లలో 415 ఎంపీపీ పీఠాలను అధికార టీఆర్ఎస్ కైవసం చేసుకునే అవకాశం ఉంది. 60 ఎంపీపీ స్థానాల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ రాగా.. 4 స్థానాల్లో ఇతరులు గెలుపొందే అవకాశం కనిపిస్తోంది. 53 చోట్ల ఏ పార్టీకి ఎంపీపీ పీఠం దక్కించుకునే మెజార్టీ రాలేదు. అయితే, వీటిలో కూడా మెజార్టీ స్థానాలను టీఆర్ఎస్ గెలుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తమ్మీద 60 శాతం ఎంపీటీసీ, 84 శాతం జడ్పీటీసీ స్థానాలను గెలుచుకుని రాష్ట్రంలో తమకు తిరుగులేదని టీఆర్ఎస్ మరోసారి నిరూపించుకుంది.

**టీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆధిక్యం...**
టీఆర్ఎస్ స్పష్టమైన ఆధిక్యత కనబర్చింది. జెడ్పీటీసీ ఎన్నికల్లో 12 జిల్లాల్లో దాదాపు స్వీప్ చేసింది. కరీంనగర్, వరంగల్ రూరల్, అర్బన్, జనగామ, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని అన్ని జెడ్పీటీసీ స్థానాలను గెలుపొందగా, మరో 6 చోట్ల కేవలం ఒక్క స్థానంలో మాత్రమే ఓటమి పాలైంది. ఎంపీపీలను కూడా అదే స్థాయిలో టీఆర్ఎస్ గెలుచుకుంది.

## నేడే ‘నీట్’ ఫలితాలు

**సాక్షి, హైదరాబాద్:** నీట్ ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఫలితాలు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లు https://ntaneet.nic.in/, https://www.mcc.nic.inలో చూసుకోవచ్చు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు గత నెల 5న నీట్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

# అవినీతి రహిత పాలన దిశగా..

**హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో జ్యుడిషియల్ కమిషన్**
- హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిని కోరిన సీఎం జగన్
- నీతిమంతంగా నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపడతాం
- టెండర్ల ప్రక్రియను న్యాయ వ్యవస్థ చేతిలో పెడతాం
- కమిషన్ సూచన మేరకు టెండర్ల ప్రక్రియలో మార్పులు చేస్తాం
- టెండర్ విధానంలో సంస్కరణలకు సిద్ధం

**సాక్షి, అమరావతి**

ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతి నిర్మూలనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించారు. అవినీతితో కునారిల్లిపోయిన టెండరింగ్ విధానంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అవినీతి జరిగిందని న్యాయ వ్యవస్థను ఆశ్రయిస్తున్న స్థితిని మార్చి, అవినీతికి ఏ మాత్రం ఆస్కారం లేకుండా న్యాయ వ్యవస్థ చేతికే టెండరింగ్ విధాన నిర్ణయాన్ని అప్పగించాలని నిర్ణయించారు. దేశంలోనే తొలిసారిగా, దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా గొప్ప పారదర్శక విధానానికి శ్రీకారం చుడుతూ అడుగు వేశారు. సీఎం పదవి స్వీకరిస్తూ, మే 30న తాను ప్రకటించిన విధంగా టెండర్ విధానంలో సంస్కరణలు కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్‌ను వైఎస్ జగన్ కలిశారు. సాయంత్రం 6 గంటలకు ఏసీజే ఇంటికి వెళ్లిన ఆయన దాదాపు గంట పాటు అక్కడ గడిపారు. సీఎం వెంట ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం, అడ్వొకేట్ జనరల్‌గా నియమితులైన సుబ్రహ్మణ్యం శ్రీరామ్, అదనపు అడ్వొకేట్ జనరల్‌గా నియమితులు కానున్న పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఏసీజేను జగన్‌మోహన్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం టెండర్లలో అవినీతికి ఆస్కారమే లేని పారదర్శక విధానాన్ని తీసుకు వచ్చేందుకు ప్రత్యేకమైన జుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాల్సిందిగా ఏసీజేకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఇందు కోసం ప్రత్యేకించి ఒక హైకోర్టు జడ్జిని కేటాయించాలని కోరారు. హైకోర్టు జడ్జి ఆధ్వర్యంలోని కమిషన్‌కు, సిబ్బందికి అయ్యే వ్యయం మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

### కమిషన్ సూచన మేరకు టెండర్ల ప్రక్రియలో మార్పులు

ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం పిలిచే టెండర్లను ముందుగానే హైకోర్టు జడ్జి నేతృత్వంలోని కమిషన్‌కు పంపుతామని, టెండర్‌కు సంబంధించిన అంశాలపై జుడిషియల్ కమిషన్ సంబంధిత ప్రభుత్వ అధికారులతో చర్చించి మార్పు, చేర్పుల్ని సూచిస్తే ఆ ప్రకారంగానే టెండర్లు పిలుస్తామని సీఎం జగన్.. ఏసీజేకు విన్నవించారు. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఒక టైలర్ మేడ్‌గా, అంటే.. కమీషన్ల కోసం తాను ముందుగానే నిర్ణయించుకున్న కాంట్రాక్టర్‌కు ఉన్న అనుభవం, అర్హతల ప్రకారం టెండర్ నిబంధనలు తయారు చేసి, వారికే టెండర్ దక్కేలా చేసిన విధానం వల్ల వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని వైఎస్ జగన్ ప్రజలకు వివరించిన విషయం తెలిసిందే. ప్రతి టెండర్‌లోనూ 20 నుంచి 25 శాతం మేర అవినీతి జరిగిందని, ఆమేరకు ప్రజాధనాన్ని మిగిల్చే విధంగా రివర్స్ టెండరింగ్ విధానాన్ని అమలు చేస్తామని కూడా ఆయన ప్రకటించారు. తద్వారా ఇరిగేషన్ కాంట్రాక్టులంటేనే అవినీతి, అక్రమాలకు మారుపేరుగా మారిన పరిస్థితి నుంచి పూర్తి పాదర్శకమైన విధానాన్ని అమలు చేయడానికి ముందడుగు వేశారు.

## సీఎం ముఖ్య సలహాదారుగా అజేయ కల్లం

### కార్యదర్శులకు శాఖలు కేటాయించే అధికారం

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి అజేయ కల్లం కేబినెట్ హోదాతో తాజాగా సీఎం ముఖ్య సలహాదారుగా నియమితులయ్యారు. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎం పేషీ) అధిపతిగా ఆయన వ్యవహరిస్తారు. సీఎంవో కార్యదర్శులకు శాఖలను కేటాయించే బాధ్యత కూడా ఆయనకే అప్పగించారు. ప్రభుత్వ సలహాదారులతోపాటు రాష్ట్రంలో ఏ శాఖకు చెందిన అధికారినైనా పిలిచి సలహాలు ఇచ్చే అధికారాన్ని ప్రభుత్వం ఆయనకు కల్పించింది. అందరూ ఆయనకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆయన మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. పర్యటనలకు వెళ్లినప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రిటైర్ కాకముందు ఉన్న టీఏ, డీఏలు వర్తిస్తాయి. ప్రభుత్వ వాహనంతోపాటు నివాస వసతి సౌకర్యం కల్పిస్తారు. లేదంటే ప్రభుత్వం అద్దె చెల్లిస్తుంది.

**డిప్యుటేషన్‌పై సిబ్బంది నియామకానికి ఆదేశాలు**
కల్లంకు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)తోపాటు పేషీలో ప్రైవేట్ కార్యదర్శి, వ్యక్తిగత సహాయకుడు, ఇద్దరు డ్రైవర్లు, నలుగురు ఆఫీసు సబార్డినేట్లు ఉంటారు. ఈ పోస్టులను ఆన్ డ్యూటీ పద్ధతిలో కేటాయిస్తారు. వారికి మాతృసంస్థల్లో వచ్చే వేతనాలతో పాటు పేషీలో పనిచేసినందుకు ప్రత్యేక అలవెన్సులు పొందడానికి అర్హత ఉంటుంది. డ్రైవర్లు, సబార్డినేట్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవచ్చు. డిప్యుటేషన్‌పై సిబ్బందిని నియమించేందుకు సాధారణ పరిపాలన శాఖ తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు.

**ఎక్కడ పనిచేసినా మన్ననలే**

అజేయ కల్లం టీటీడీ కార్యనిర్వహణ అధికారిగా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పలు కీలక బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేశారు. తన అభిప్రాయాలను ఫైళ్లపై నిర్మొహమాటంగా రాశారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉండగా రాజధాని అమరావతిలో స్విస్ ఛాలెంజ్ విధానాన్ని తప్పుబడుతూ ఫైలులో కుండబద్దలు కొట్టినట్లు రాశారు. ‘స్విస్ ఛాలెంజ్ లోపభూయిష్టంగా ఉంది. ఇది పనికిమాలిన విధానం. దీనివల్ల నష్టం తప్ప రాష్ట్రానికి ప్రయోజనం ఉండదు. ఈ విధానాన్ని ఉపసంహరించుకోవడం ఉత్తమం..’ అని ఫైలులో మూడు పేరాలు పొందుపరిచారు.

# పోలీసుల ఎదుటకు రవిప్రకాశ్

**విచారణకు సహకరించని వైనం**
- పోలీసులు అడిగిన ప్రశ్నలకు పొంతన లేని సమాధానలు
- 27 రోజులపాటు పరారీలోనే...
- సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగలడంతోనే పోలీసుల ఎదుటకు



**సాక్షి, హైదరాబాద్:** టీవీ9 కేసులో ఫోర్జరీ, డేటా చౌర్యం తదితర నేరారోపణలు ఎదుర్కొంటున్న ఆ చానల్ మాజీ సీఈఓ రవిప్రకాశ్ ఎట్టకేలకు 27 రోజుల పరారీ తర్వాత పోలీసుల ఎదుటకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో పోర్షే కారులో(పీవీ05సీ 0055) రవిప్రకాశ్ సైబరాబాద్ సైబర్ క్రైం కార్యాలయానికి చేరుకున్నాడు. అక్కడ ఉన్న విలేకరులను పలకరిస్తూ నేరుగా కార్యాలయంలోకి వెళ్లిపోయాడు.

**ఐదు గంటల పాటు విచారణ:** ఫోర్జరీ, నిధుల మళ్లింపు, డేటా చౌర్యం కింద నమోదైన రెండు కేసుల్లో ఇప్పటికే పోలీసులు సిద్ధం చేసుకున్న ప్రశ్నావళి ప్రకారం రవిప్రకాశ్‌ను ఐదు గంటల పాటు ప్రశ్నించారు. పోలీసుల ప్రశ్నలకు రవిప్రకాష్ ఏమాత్రం సహకరించలేదని, పొంతన లేని సమాధానాలిచ్చినట్టు సమాచారం. కొన్ని ప్రశ్నలకు అడ్డదిడ్డమైన సమాధానాలతో పాటు అప్పుడు తాను లేనని, తనకు గుర్తు లేదని, తన లాయర్లు సమాధానం చెబుతారంటూ దాటవేసే విధంగా మాట్లాడినట్టు తెలుస్తోంది.

**మరోసారి హాజరు కావాలని నోటీస్...**
బుధవారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరు కావాలని రవిప్రకాశ్‌కు నోటీస్ ఇచ్చినట్టు సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. తాము అడిగిన ప్రశ్నలకు రవిప్రకాశ్ సరైన సమాధానం ఇవ్వడం లేదని చెప్పారు. విచారణ అనంతరం రవిప్రకాశ్ మాట్లాడారు. ‘‘టీవీ9ను ఇద్దరు ధనికులు అక్రమంగా కొనుకున్నారు. నాపై దొంగ కేసులు పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా బోర్డ్ మీటింగ్ పెట్టుకొని నన్ను అక్రమంగా టీవీ9 నుంచి బయటికి పంపించారు. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాను. పోలీసులకు పూర్తిగా సహకరిస్తున్న. ఇది మాఫియాకు, మీడియాకు జరుగుతున్న ధర్మయుద్ధం. ఈ యుద్ధంలో జర్నలిజమే గెలుస్తుంది’’ అని పేర్కొన్నారు.

**గత్యంతరం లేకనే వచ్చాడు**
పోలీసులు ఎన్నిసార్లు ప్రయత్నించినా రవిప్రకాశ్ అందుబాటులోకి రాలేదు. విచారణకు హాజరు కాకుండా పరారై పోయి, ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు సాగించాడు. ఏపీలో అతడికి మద్దతిచ్చే రాజకీయ నాయకులకు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. దీనికితోడు రెండు సార్లు, హైకోర్టులో.. ఆఖరుగా సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ కోసం విశ్వప్రయత్నాలు చేశాడు. అక్కడ ఎదురు దెబ్బ తగలడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రవిప్రకాశ్ సైబరాబాద్ పోలీసుల ఎదుట హాజరైనట్లు తెలుస్తోంది.

**నమోదైన కేసులివే..**

శొంఠినేని శివాజీతో కలిసి నకిలీ కొనుగోలు పత్రాల సృష్టి, నిధుల మళ్లింపు, కుట్ర, నకిలీ పత్రాల సృష్టి, సంస్థ కార్యదర్శి సంతకం ఫోర్జరీ తదితర ఆరోపణలపై రవిప్రకాశ్‌పై అలందా మీడియా కార్యదర్శి కౌశిక్‌రావు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐటీ యాక్ట్, 66, 72 ఐపీసీ 406, 420, 467, 469, 471 సెక్షన్ల కింద కేసులు సైబరాబాద్ పోలీసులు నమోదు చేశారు. మరో కేసులో రవిప్రకాశ్‌తోపాటు ఎంకేవీఎన్ మూర్తిపైనా ఐటీ యాక్ట్ 66(సీ), 66(డీ), ఐపీసీ 420, 468, 471, 120(బీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీసులు మే 9వ తేదీన టీవీ9 కార్యాలయంతోపాటు, బంజారా హిల్స్‌లోని రవిప్రకాశ్ నివాసం, హిమాయత్‌నగర్‌లోని శివాజీ నివాసంలోనూ సోదాలు నిర్వహించారు. కంప్యూటర్ హార్డ్‌డిస్కులు, ల్యాప్‌ట్యాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇదే క్రమంలో రవిప్రకాశ్‌పై మే 16వ తేదీన టీవీ9 లోగో, కాపీరైట్స్, ట్రేడ్‌మార్కులు 2018 మేలో మీడియా నెక్ట్స్ ఇండియా కంపెనీకి బదలాయించడంపై బంజారాహిల్స్ పోలీస్ ఠాణాలో కేసు నమోదైంది. ఈ కేసులో ఐపీసీ 467, 420, 409, 406, 120(బీ) సెక్షన్ల కింద హైదరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయా కేసుల్లో విచారణకు హాజరుకావాలని సీఆర్‌పీసీ 160 కింద పోలీసులు రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. మరో రెండుసార్లు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద అతని ఇంటికి నోటీసులు అంటించి వచ్చారు.

# ట్యాంక్ వీరుడిపై వీడని మిస్టరీ




**మూడు దశాబ్దాల కిందట చైనాలోని తియానన్మెన్ స్క్వేర్‌లో ప్రజాస్వామిక హక్కులకోసం నిరసన ప్రదర్శనలు పెల్లుబికిన సందర్భంలో అతడు ఒక ధీరునిగా కనిపించాడు. ఉద్యమాన్ని అణిచేసేందుకు చైనా సైన్యం ట్యాంకులతో రంగంలోకి దిగగా వాటికి ఎదురొడ్డి నిలిచాడు. నిరసనకారులకు స్ఫూర్తినిచ్చాడు. ఎవరతను? ఎక్కడివ్యక్తి? 30 ఏళ్లు గడిచినా ఈ ప్రశ్నలకు సమాధానాలు లేవు. ట్యాంకుల శ్రేణిని ఎదుర్కొని ట్యాంక్ మ్యాన్‌గా గుర్తింపు పొందాడు. ప్రపంచం అదే పేరుతో అతడిని పిలుస్తోంది. అతడి పట్ల ఎడతెగని ఆకర్షణ ఇంకా కొనసాగుతూనే ఉంది. అతడు కనిపించి ఇవాళ్టికి ముప్పదేళ్లు.**

## తియానన్మెన్ స్క్వేర్ ఘటనకు 30 ఏళ్లు

**ట్యాంక్‌మ్యాన్** ప్రతిఘటనకు దిగిన వేళ – 1989 జూన్ 5న కొందరు అతడి ఫొటోలు తీశారు. ఆ సమయంలో అతడు తెల్ల చొక్కా వేసుకున్నాడు. చేతిలో రెండు సంచులున్నాయి. నేరుగా వెళ్లి భారీ ట్యాంకులకు ఎదురొడ్డి నిలబడ్డాడు. విదేశీ పత్రికల ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు సమీప హోటళ్ల బాల్కనీల్లో నుంచి అతడి ఫొటోలు తీశారు. ఆ తర్వాత అతడు ఏమయ్యాడో ఎవ్వరికీ తెలియదు. అతడికి మరణశిక్ష అమలు చేశారని కొందరు భావిస్తుంటారు. ఎక్కడో రహస్య జీవనం గడుపుతున్నాడనేది మరికొందరి అభిప్రాయం. మిలటరీ అతడి ప్రాణానికి ఎలాంటి హానీ తలపెట్టలేదని చైనా అధికారులు ప్రకటించారు. చైనా మాజీ అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ కూడా 1990లో బార్బరా వాల్టర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అతణ్ని చంపలేదని చెప్పారు. మొత్తం మీద ట్యాంక్‌మ్యాన్ గురించిన చర్చ నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. ఆ ధీరునికి ఏమయ్యిందో వెల్లడించాలని చైనా ప్రభుత్వాన్ని కోరుతూ తియానన్మెన్ నిరసనల్లో పాల్గొని, ప్రస్తుతం అమెరికాలో హక్కుల కార్యకర్తగా పని చేస్తున్న యాంగ్ జియాన్లీ ఇటీవల ఒక పిటిషన్ రూపొందించి విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లాడు. ట్యాంక్ మ్యాన్ జ్ఞాపకాలను తుడిచేసే పనిలో పడిన చైనా.. ఇటీవల అతడి ఆన్‌లైన్ ఫొటోలపై నిషేధం విధించింది. ఆజ్ఞలను ధిక్కరించిన వారికి శిక్ష విధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 49 శాతం మంది అతడి ఫొటోలను తాము గుర్తుపడతామంటారు. చైనా వెలుపల ట్యాంక్‌మ్యాన్ ఒక హీరో. అతడిని కేంద్రంగా చేసుకుని పలు పుస్తకాలు, డాక్యుమెంటరీలు వెలువడ్డాయి. టీవీ షోలు ప్రసారమయ్యాయి. ఆర్ట్ ఎగ్జిబిషన్లు ఏర్పాటయ్యాయి. 'చిమెరికా'పేరిట ఇటీవల ప్రారంభమైన బ్రిటీష్ టెలివిజన్ సిరీస్ ట్యాంక్‌మ్యాన్ పాపులారిటీకి ఒక ఉదాహరణ. ట్యాంక్‌మ్యాన్ మిస్టరీని ఛేదించేందుకు ఓ అమెరికన్ ఫొటో జర్నలిస్టు జరిపే అన్వేషణ ఇందులోని ఇతివృత్తం. మొత్తం మీద – తన చిత్రాలు, పోస్టర్లు, తన చిత్తరువులు ముద్రితమైన టీ షర్టులు, టీవీ షోల ద్వారా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు ట్యాంక్‌మ్యాన్.

### అమెరికా, చైనా పరస్పర విమర్శలు

**బీజింగ్/వాషింగ్టన్:** ఊచకోత ఘటనలో ఎంత మంది ప్రజాస్వామ్యవాద నిరసనకారులు మరణించారో బహిరంగంగా ప్రకటించాలంటూ చైనాను అమెరికా విదేశాంగ మంత్రి పాంపియో కోరారు. మారణకాండకు చైనా ఆర్మీదే బాధ్యత అని అన్నారు. దీనిపై చైనా విదేశాంగ మంత్రి గెంగ్ షువాంగ్ మాట్లాడుతూ అమెరికా ఆరోపణలను తాము ఖండిస్తున్నట్లు చెప్పారు. పాంపియో వ్యాఖ్యలపై అమెరికాతో తీవ్ర చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. 'ప్రజాస్వామ్యం, మానవ హక్కులనే నెపంతో ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే కొందరు అమెరికా వ్యక్తులు తమ సొంత దేశంలోని సమస్యలపై మాత్రం మాట్లాడటం లేదు' అని షువాంగ్ అన్నారు.

**చైనా మౌనం వీడాలి: ఈయూ**
తియానన్మెన్ స్క్వేర్ వద్ద జరిగిన దారుణాలపై చైనా పెదవి విప్పాలనీ, 30 ఏళ్ల క్రితం అక్కడ చనిపోయిన నిరసనకారులు ఎంతమందో, ఇంకెందరిని జైళ్లలో పెట్టారనే సంఖ్యలను చైనా ప్రకటించాలని యూరోపియన్ యూనియన్(ఈయూ) డిమాండ్ చేసింది. అప్పుడు అరెస్టయిన వారిలో ఇంకా జైళ్లలో మగ్గుతున్న వారిని వెంటనే విడుదల చేయాలని చైనాను ఈయూ కోరింది.

# ఒంటరి పోరు చేటెవరికి?

## యూపీలో ఎవరికి వారే

**ఉప ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ ఒంటరిపోరు**

**న్యూఢిల్లీ/లక్నో:** లోక్‌సభ ఎన్నికలకు ముందు ఉత్తరప్రదేశ్‌లో ఏర్పడిన 'మహాగఠ్‌బంధన్' చీలిపోయింది. సార్వత్రిక ఎన్నికల్లో ఊహించిన ఫలితాలు సాధించకపోవడంతో రానున్న ఉప ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని ఎస్పీ, బీఎస్పీ నిర్ణయించుకున్నాయి. బీఎస్పీ చీఫ్ మాయావతి మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. 'ఉప ఎన్నికల షెడ్యూల్ ఏ క్షణంలోనైనా రావచ్చు. యూపీ ఉప ఎన్నికల్లో అన్ని సీట్లలోనూ ఒంటరిగా పోటీ చేయాలనుకుంటున్నాం' అని తెలిపారు.

**మేం కూడా సిద్ధమే: అఖిలేశ్**
మహాగఠ్ బంధన్ లేకుంటే రానున్న ఉప ఎన్నికల్లో మొత్తం 11 చోట్ల నుంచి ఒంటరిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూటమి అంత ముఖ్యం కాదని తెలిపారు.

**స్వార్థం కోసమే కూటమి**
ఎస్పీ, బీఎస్పీ నేతలు తమ కుటుంబసభ్యుల ప్రయోజనాలను కాపాడుకునేందుకే కూటమిగా ఒక్కటయ్యారని బీజేపీ విమర్శించింది. కుల సమీకరణాల ఆధారంగానే ఎన్నికల్లో గెలవాలనుకుని ఆశపడిన మాయావతి, అఖిలేశ్ భంగపాటు కలిగిందని పేర్కొంది.

**అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ కమల వికాసమేనా?**




బీజేపీని, ప్రధాని మోదీని ఓడించాలన్న విపక్షాల ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో యూపీలో ఏర్పడిన 'మహాగఠ్ బంధన్'లో లుకలుకలు మొదలయ్యాయి. ఆ కూటమి నేతలు ఇప్పుడు తలోదారి వెతుక్కునే పనిలో పడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ–బీఎస్పీ–ఆర్‌ఎల్‌డీ కూటమి మొత్తం 80 స్థానాలకు గాను 75 చోట్ల పోటీ చేసి కేవలం 15 సీట్లు మాత్రమే దక్కించుకోగలిగాయి. దీంతో కూటమిలో ఉంటే అసలుకే ఎసరు వచ్చేలా ఉందని వెంటనే గ్రహించిన బీఎస్పీ అధినేత్రి మాయావతి తెగదెంపులకు సిద్ధపడగా ఎస్పీ కూడా సరేనంది. దీంతో త్వరలో యూపీలో 11 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఉపఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీలు ఎవరికి వారుగానే బరిలో దిగడం ఖాయమైంది.

**ఎస్పీ–బీఎస్పీల మధ్య విభేదాలు**
లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై ఎస్పీ, బీఎస్పీ పరస్పరం నిందారోపణలు చేసుకుంటున్నాయి. ఎస్పీకి సంప్రదాయంగా మద్దతునిచ్చే యాదవులు, ముస్లింలు బీఎస్పీ అభ్యర్థులకు ఓటు వేశారని, కానీ బీఎస్పీకి పట్టున్న జాటవ్ సామాజికవర్గం ఓట్లు తమకు పడలేదని ఎస్పీ శిబిరం అంటోంది. ఎస్సీల్లో ఒక వర్గమైన జాటవ్‌లు ఎన్నికల ఫలితాల్ని తారుమారు చేసే శక్తి కలిగిన సామాజిక వర్గం. అయితే ఎస్పీ నిందిస్తున్నట్టుగా జరగలేదని ఆ పార్టీకి పట్టున్న కనోజ్, బదౌన్, ఫిరోజాబాద్‌లలో ఎస్పీ ఎందుకు ఓడిపోయిందని బీఎస్పీ ప్రశ్నిస్తోంది. జాటవ్ ఓట్లన్నీ ఎస్పీకి పడినా, యాదవులు, ముస్లిం ఓట్లు తమకు కాకుండా బీజేపీకే పోయాయని బీఎస్పీ వాదిస్తోంది. ఈ ఎన్నికల్లో ఎస్పీ అసమ్మతి నేత, అఖిలేశ్ చిన్నాన్న శివపాల్ ఎస్పీకి వ్యతిరేకంగా అభ్యర్థుల్ని బరిలోకి దింపడంతో బీజేపీకి లాభించిందని అనుమానిస్తున్నారు.

**మాయావతి వ్యూహం ఏమిటి?**
కూటమితో తీవ్రంగా నష్టపోయినట్టుగా భావిస్తున్న మాయావతి పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. అందుకోసం భాయ్‌చారా కమిటీలు (సౌభ్రాతృత్వ కమిటీలు) పునరుద్ధరించనున్నారు. వచ్చే ఉప ఎన్నికలతో పాటుగా, 2022లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలి ఎన్నికల్లో ఎస్పీ కంటే బీఎస్పీకే సీట్లతో పాటు ఓట్ల శాతం కూడా పెరిగింది. దీన్ని బట్టి బీఎస్పీ ఓట్లేవీ ఎస్పీకి పడలేదని అర్థం అవుతోంది. ఎస్పీ, ఆర్‌ఎల్‌డీ వంటి పార్టీలు యూపీకే ఎక్కువగా పరిమితం కాగా బీఎస్పీ పంజాబ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బలంగా కూడా ఉంది. క్లిష్ట సమయాల్లో అత్యంత కీలకంగా వ్యవహరించే రాజకీయ నాయకురాలైన మాయావతి కూటమికి ముందే గుడ్‌బై చెప్పారు.

**బీజేపీకి ఎంతవరకు లాభం?**
యూపీలో రాజకీయ పరిణామాలన్నీ అంతిమంగా బీజేపీకి లాభం చేకూర్చేలా ఉన్నాయి. బీఎస్పీ, ఎస్పీ వంటి బలమైన ప్రాంతీయ పక్షాలు, చిరకాల ప్రత్యర్థులు చేతులు కలిపినా పై చేయి సాధించకపోవడానికి ఆ పార్టీల్లో అంతర్గత కలహాలే కారణమని భావిస్తున్నారు. ఎస్పీ కుటుంబ కలహాలతో చితికిపోయింది. ఎస్పీ, బీఎస్పీలది అవకాశవాద పొత్తు అంటూ బీజేపీ చేసిన ప్రచారం లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి లబ్ధి చేకూరిస్తే, వచ్చే ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగితే అగ్రవర్ణాలు, యాదవేతర బీసీలు, జాటవేతర దళితులు ఒక బలమైన శక్తిగా రూపొందుతారు. దీంతో సమీప భవిష్యత్‌లో బీజేపీకి ఎదురు ఉండదనే అభిప్రాయం వినిపిస్తోంది.

# కేరళ విద్యార్థికి 'నిఫా'

**వైద్యుల పరిశీలనలో మరో 311 మంది**



ఎర్నాకుళం ఆస్పత్రిలో మాస్కులతో వైద్యులు

**కొచ్చి/తిరువనంతపురం:** కేరళలో ఒక విద్యార్థికి నిఫా వైరస్ సోకినట్లు కేరళ సర్కార్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మరో 311 మందిని వైద్యుల పరిశీలనలో ఉంచామని కేరళ ఆరోగ్యమంత్రి శైలజ నిర్ధారించారు. విద్యార్థి రక్త నమూనాను పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్‌ఐవీ)కు పంపించగా వారు మంగళవారం ఉదయం నిఫా వైరస్‌గా నిర్ధారించారని ఆమె తెలిపారు. ఆ విద్యార్థి ఆరోగ్యం స్థిరంగా ఉందని, ఎటువంటి ఇబ్బందికర పరిస్థితి లేదని ఆమె తెలిపారు. వైరస్ వ్యాప్తిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేవలం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పరిస్థితిని అదుపులో ఉంచవచ్చని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. ఆస్ట్రేలియాలో తయారైన యాంటీ నిఫా మందును కేరళకు పంపిస్తున్నామని కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ హామీ ఇచ్చారని ఆమె వెల్లడించారు. వ్యాధిని సమర్థంగా ఎదుర్కొనేందుకు సరిపడా మందులు, వైద్య పరికరాలు ఉన్నాయని ఆమె భరోసా ఇచ్చారు.

**కేంద్రంతో నిరంతర సంప్రదింపులు: సీఎం విజయన్**
'మేం కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నాం, వైద్య నిపుణుల బృందం ఇప్పటికే కోచి చేరుకుంది. ఈ వైరస్‌ను అదుపుచేసేందుకు వారు పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నారు'అని ఆ రాష్ట్ర సీఎం విజయన్ ప్రకటించారు. గత ఏడాది ఈ వైరస్ కారణంగా 17 మంది చనిపోయారు.

## జమ్మూ కశ్మీర్‌లో ఈ ఏడాదే ఎన్నికలు

**న్యూఢిల్లీ:** కశ్మీర్ శాసనసభ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర ముగిసిన తర్వాత ప్రకటిస్తామని ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం చెప్పింది. అమర్‌నాథ్ యాత్ర వచ్చే నెలలో ప్రారంభం కానుంది. అంటే ఈ ఏడాదిలోనే కశ్మీర్ శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు తాము ఏకగ్రీవంగా నిర్ణయించామని ఈసీ తెలిపింది. 2018 జూన్‌లో పీడీపీ–బీజేపీల సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయిన అనంతరం ఆ రాష్ట్రంలో ప్రజలచేత ఎన్నికైన ప్రభుత్వ పాలనే లేదు. ఆ రాష్ట్రంలో 2018 జూన్ 19 నుంచి డిసెంబర్ 19 వరకు గవర్నర్ పాలన, ఆ తర్వాత రాష్ట్రపతి పాలన నడుస్తోంది. జూన్ 19న రాష్ట్రపతి పాలన గడువు ముగుస్తుండగా, దాన్ని పొడిగించేందుకు అంతా సిద్ధం చేశారు.

## విరాళాల వివరాలివ్వని బీజేపీ, కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా వచ్చిన విరాళాల వివరాలను బీజేపీ, కాంగ్రెస్, డీఎంకే పార్టీలు ఇప్పటివరకు ఎన్నికల సంఘానికి అందజేయలేదని తాజాగా తెలిసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మే 31 వరకే విరాళాల వివరాలు సీల్డ్ కవర్‌లో అందజేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలకు గత నెలలో ఎన్నికల సంఘం లేఖలు రాసింది. అయినా ఆ పార్టీలు వివరాలు అందజేయలేదని సమాచారం. ఎలక్టోరల్ బాండ్స్‌ను ఎవరైనా గుర్తింపు పొందిన బ్యాంకుల నుంచి కొనుగోలు చేయొచ్చు. వాటిని పార్టీలకు విరాళాల రూపంలో అందజేయవచ్చు. పార్టీలకు అందే విరాళాల విషయంలో పారదర్శకత పెంచేందుకు ఎలక్టోరల్ బాండ్స్ పథకాన్ని 2017 కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బాండ్స్‌ను సదరు పార్టీలు బ్యాంకుల్లో అందజేస్తే బ్యాంకు ఖాతాల్లో ఆ మొత్తం డిపాజిట్ అవుతుంది.

# విద్యావ్యవస్థను సంస్కరించండి

**పూర్తి మార్పులు చేయండంటూ కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం**

**న్యూఢిల్లీ:** వివిధ కోర్సుల అడ్మిషన్ల సమయంలో విద్యార్థులకు అధిక ఆర్థిక భారం, మానసిక ఒత్తిడి లేకుండా చూడటం కోసం మొత్తం విద్యా వ్యవస్థలో మార్పులు చేయాలని కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలను సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. మహారాష్ట్రలో 2019–20 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్, డెంటల్ కోర్సుల అడ్మిషన్లలో నెలకొన్న అనిశ్చితి కారణంగా విద్యార్థులు పడుతున్న దురవస్థ గురించి కోర్టు ప్రస్తావిస్తూ, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇది కష్టంగా ఉంటుందని వ్యాఖ్యానించింది. 'మా విచారం అంతా విద్యార్థుల గురించే. ఇది ప్రతి ఏడాదీ జరుగుతుంది. మెడికల్ లేదా ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి విద్యార్థుల మెదళ్లలో అనిశ్చితి నెలకొంటోంది' అని జస్టిస్ ఇందూ మల్హోత్రా, జస్టిస్ ఎంఆర్ షాల వేసవికాల సెలవుల ధర్మాసనం పేర్కొంది. 'విద్యా వ్యవస్థను మీరు పూర్తిగా ఎందుకు మార్చరు? విద్యార్థులకు ఈ మానసిక క్షోభ, ఒత్తిడి ఎందుకు? ఈ కేసులన్నీ ఎందుకు? విద్యార్థుల దుస్థితిని ఒకసారి పరిశీలించాల్సిందిగా కేంద్రం అలాగే అన్ని రాష్ట్రాలను మేం ఆదేశిస్తున్నాం. ఇలాంటి అనిశ్చితి కారణంగా విద్యార్థుల మొత్తం కెరీర్‌పైనే దుష్ప్రభావం పడుతుంది' అని సుప్రీంకోర్టు పేర్కొంది.

**14లోపు తుది కౌన్సెలింగ్ నిర్వహించండి**
మహారాష్ట్రలో 2019–20 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 14లోపు తుది విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు సంబంధించిన నోటిఫికేసన్‌పై తాము స్టే విధించిన తర్వాత కూడా ఇంకా కౌన్సెలింగ్‌ను ఎందుకు పూర్తి చేయలేదని కోర్టు ప్రశ్నించింది. కౌన్సెలింగ్‌కు సంబంధించి స్థానిక వార్తా పత్రికల్లో ప్రభుత్వం వెంటనే ప్రకటనలు ఇవ్వాలనీ, 14వ తేదీలోపు కౌన్సెలింగ్ నిర్వహించి తీరాలని కోర్టు చెప్పింది. ఈ విడత కౌన్సెలింగే చివరిదని కూడా ప్రకటనల్లో స్పష్టంగా పేర్కొనాలంది. అలాగే ఈ కేసులో తాము ఇప్పుడు ఇస్తున్న ఉత్తర్వులే అంతిమమనీ, ఇకపై ఈ కేసుకు సంబంధించి ఎలాంటి పిటిషన్లనూ దేశంలోని ఏ కోర్టూ స్వీకరించకూడదని జస్టిస్ ఇందూ మల్హోత్రా, జస్టిస్ ఎంఆర్ షాలు స్పష్టం చేశారు.



# ముదిరిన 'కర్ణాటక' కష్టాలు

- **జేడీఎస్ అధ్యక్ష పదవికి విశ్వనాథ్ రాజీనామా**
- **కాంగ్రెస్‌లోనూ అంతర్గత కుమ్ములాటలు**



ఏహెచ్ విశ్వనాథ్

**బెంగళూరు:** కర్ణాటకలో జేడీఎస్–కాంగ్రెస్ పార్టీల సంకీర్ణ ప్రభుత్వం వరుస షాక్‌లతో సతమతమవుతోంది. తాజాగా జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.హెచ్.విశ్వనాథ్ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయానికి బాధ్యత వహిస్తూ తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా పత్రాన్ని పార్టీ అధినేత, మాజీ ప్రధాని దేవెగౌడకు అందజేశారు. సంకీర్ణ ప్రభుత్వం సరైన రీతిలో పనిచేసేందుకు గాను సిద్ధరామయ్య నేతృత్వంలో ఏర్పాటైన సమన్వయ కమిటీ ఏడాది గడుస్తున్నా ఉమ్మడి ప్రణాళికను రూపొందించలేకపోయిందని మండిపడ్డారు. ఇరు పార్టీల మధ్య సమన్వయానికి సిద్ధరామయ్య చర్యలు తీసుకోలేదన్నారు. తుముకూరులో మాజీ ప్రధాని దేవెగౌడ ఓటమి వెనుక కుట్ర ఉందని ఆరోపణలు చేశారు.

**కాంగ్రెస్‌లో ధిక్కార స్వరం**
కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రామలింగారెడ్డి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తీసుకున్న పలు నిర్ణయాలపై మండిపడుతున్నారు. కొత్తగా వచ్చిన వాళ్లకి, ఇతర పార్టీల నుంచి చేరిన వారికి, కాంగ్రెస్ విధానాలు తెలియని వారికి ప్రాధాన్యత ఇవ్వడమే పార్టీ ప్రస్తుత స్థితికి కారణమని ధ్వజమెత్తారు. ఇదే పరిస్థితి కొనసాగితే సీనియర్ నేతలు పార్టీలో ఉండలేరని స్పష్టం చేశారు. ఇక కాంగ్రెస్ సీనియర్ నేత రోషన్ బేగ్ సైతం ప్రస్తుత కాంగ్రెస్ పరిస్థితికి సిద్దరామయ్య, దినేశ్ రావులే కారణమని మరోసారి తీవ్రంగా మండిపడ్డారు. సిద్దరామయ్య పొగరు వల్లే పార్టీ ఇలా తయారైందన్నారు.



**మంగళవారం లండన్‌లో బ్రిటన్ ప్రధాని థెరిసా మేతో కలసి సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్. ఇరు దేశాల మధ్య తాను మరింత పటిష్టమైన వాణిజ్య ఒప్పందాన్ని కోరుకుంటున్నానని ఈ సందర్భంగా డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు.**

## రాహుల్‌కు నోటీసు వివరాలు చెప్పలేం



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పౌరసత్వంపై వచ్చిన ఫిర్యాదుకు సంబంధించి ఆయనకు పంపిన నోటీసు వివరాలను బయటపెట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిరాకరించింది. ఆ వివరాలను చెప్తే ఈ కేసు దర్యాప్తుకు ఆటంకం కలుగుతుందని హోంశాఖ పేర్కొంది. రాహుల్ పౌరసత్వంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బీజేపీ ఎంపీ సుబ్రమణ్య స్వామి ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్‌లో రాహుల్‌కు హోం శాఖ నోటీసులు పంపింది. తన వాదనను, వాస్తవాలను పక్షం రోజుల్లో తమకు చెప్పాల్సిందగా రాహుల్‌ను కేంద్రం ఆ నోటీసులో కోరింది. రాహుల్‌కు పంపిన నోటీసు ప్రతి, అలాగే రాహుల్ స్పందన వివరాలు కావాలని సమాచార హక్కు చట్టం కింద ఓ వ్యక్తి హోం శాఖను కోరారు.

## కేబినెట్ నిర్ణయాలు అమలు చేయొద్దు

**పుదుచ్చేరి సీఎంకు సుప్రీం నోటీసులు**

**న్యూఢిల్లీ:** పుదుచ్చేరి సీఎం వి.నారాయణ స్వామికి, లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) కిరణ్ బేడీకి అధికారాల విషయంలో తలెత్తిన వివాదంలో సుప్రీంకోర్టు సీఎంకు నోటీసులు జారీ చేసింది. అలాగే ఈనెల 7న కేబినెట్ సమావేశంలో తీసుకోబోయే ఎలాంటి ఆర్థికపరమైన నిర్ణయాలను జూన్ 21వరకు అమలు చేయరాదని ఆదేశించింది. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రభుత్వ రోజువారీ కార్యకలాపాల్లో లెఫ్టినెంట్ గవర్నర్ జోక్యం చేసుకోకూడదని మద్రాస్ హైకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ తీర్పుతో పుదుచ్చేరిలో పాలన స్తంభించిపోయిందని, ఏప్రిల్ 30కి ముందున్న పరిస్థితులను పునరుద్ధరించేలా ఆదేశాలు జారీ చేయాలని సుప్రీంకోర్టులో కేంద్రంతో పాటు కిరణ్ బేడీ పిటిషన్ దాఖలు చేశారు.

## ఇఫ్తార్‌పై గిరిరాజ్ వివాదాస్పద ట్వీట్

**మందలించిన పార్టీ అధ్యక్షుడు అమిత్ షా**



లోక్‌జన శక్తి పార్టీ అధ్యక్షుడు పాశ్వాన్‌తోపాటు బిహార్ ప్రతిపక్ష నేత జితన్ రామ్ మాంఝీ పట్నాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులకు సంబంధించినవే ఈ ఫొటోలు.

**న్యూఢిల్లీ:** బిహార్‌లో ఇఫ్తార్ విందులకు ఎన్డీయే నేతలు హాజరవుతుండటంపై కేంద్ర మంత్రి, బీజేపీ నాయకుడు గిరిరాజ్ సింగ్ చేసిన ట్వీట్ ఒకటి వివాదాస్పదమైంది. గిరిరాజ్ ట్వీట్‌పై జేడీయూ నేతలు విమర్శలు వ్యక్తం చేయడంతో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా రంగంలోకి దిగి గిరిరాజ్‌ను మందలించారు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్, కేంద్ర మంత్రి రాం విలాస్ పాశ్వాన్ సహా మొత్తం నలుగురు ఎన్డీయే నేతలు ఇఫ్తార్ విందులకు హాజరైన ఫొటోలను గిరిరాజ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ 'నవరాత్రి రోజుల్లో ఫలాహారం ఏర్పాటు చేసి ఇలాంటి ఫొటోలు తీసుకుంటే అవి ఎంత అందంగా ఉండేవో!. మనం మన మతానికి సంబంధించిన కర్మ, ధర్మాలను ఆచరించడంలో నిరాసక్తంగా ఉంటాం కానీ వేరే మతంపై ప్రేమను నటించడంలో ముందుంటాం' అని రాశారు. ఓ ఫొటోలో బిహార్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత సుశీల్ మోదీ కూడా ఉండటం గమనార్హం. గిరిరాజ్ ట్వీట్‌పై జేడీయూ, ఎల్జేపీ నేతలు అసంతృప్తి, విమర్శలు వ్యక్తం చేయడంతో అమిత్ షా రంగంలోకి దిగారు. గిరిరాజ్‌ను మందలిస్తూ ఇలాంటి వ్యాఖ్యలను మళ్లీ భవిష్యత్తులో చేయకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. హిందూత్వ భావజాలం బాగా కలిగిన గిరిరాజ్ గతంలోనూ పలు వివాదాలకు కేంద్ర బిందువుగా మారడం తెలిసిందే.

## నేడే ఈద్‌–ఉల్‌–ఫితర్

**న్యూఢిల్లీ/హైదరాబాద్:** మంగళవారం నెలవంక దర్శనంతో దేశవ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ నెల ఉపవాసాలు విరమించి బుధవారం ఈద్–ఉల్–ఫితర్ పండుగ ఆచరించనున్నారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన నెలవంక దర్శన కమిటీ సమావేశానంతరం జామా మసీదు షాహి ఇమామ్ సయ్యద్ అహ్మద్ బుఖారి ఈ మేరకు ప్రకటన చేశారు. 'మంగళవారం చంద్రుడు కన్పించాడు. అందువల్ల బుధవారం ఈద్ (పండుగ) జరుపుకోవాలి' అని మసీదు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ నెల 5వ తేదీ బుధవారం ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకోవాలని హైదరాబాద్‌లోని రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) అధ్యక్షుడు మౌలానా ఖుబ్బుల్‌పాషా చెప్పారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## జాతీయ ప్రత్యామ్నాయానికి కలిసి రండి

**బిహార్ సీఎంకు ఆర్జేడీ నేత ఆహ్వానం**

**పట్నా:** బీజేపీకి వ్యతిరేకంగా తమతో చేతులు కలపాలంటూ జేడీయూ చీఫ్, బిహార్ సీఎం నితీశ్‌కు ఆర్జేడీ సీనియర్ నేత రఘువంశ్ ప్రసాద్ స్నేహ హస్తం అందించారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ కేంద్ర కేబినెట్‌లో జేడీయూ చేరకపోవడం, రాష్ట్ర కేబినెట్ తాజా విస్తరణలో బీజేపీకి స్థానం కల్పించక పోవడం.. రెండు పార్టీల మధ్య అంతరం ఏర్పడిందన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీయేతర పార్టీలన్నీ నితీశ్, లేక మరెవరైనా సరే జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయంగా ఏర్పడేందుకు ఒకే వేదికపైకి కలిసిరావాలి. మాకు ఏ పార్టీ లేదా నేతపై ద్వేష భావం లేదు. బీజేపీని దీటుగా ఎదుర్కొనేందుకు చిన్న పార్టీలన్నీ ఒకే గొడుగు కిందకు రావాలి' అని అన్నారు. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. లాలూతో కలిసి పనిచేశా. దాదాపుగా ఇద్దరి అభిప్రాయాలు ఒక్కటే' అని అన్నారు.

## ఐఎండీ చీఫ్‌గా మృత్యుంజయ మహాపాత్ర

**న్యూఢిల్లీ:** భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చీఫ్‌గా ప్రముఖ శాస్త్రవేత్త, 'సైక్లోన్ మ్యాన్' మృత్యుంజయ మహాపాత్ర(54) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. ఐఎండీలో అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న మహాపాత్రను ఐఎండీ డైరెక్టర్ జనరల్‌గా ఐదేళ్ల కాలానికి నియమించింది. ఆయన ఆగస్టులో బాధ్యతలు చేపట్టనున్నారు. దేశంలో వాతావరణంలో మార్పులను పసిగట్టడం ఐఎండీ ముఖ్య విధి. ఐఎండీలోని తుపాను హెచ్చరికల విభాగంలో పనిచేసే మహాపాత్రతోపాటు, ఆయన బృందం సభ్యులకు తుపాను రాకను కచ్చితంగా గుర్తిస్తారనే పేరుంది. అందుకే మహాపాత్రకు 'సైక్లోన్‌మ్యాన్' అనే పేరు వచ్చింది.

# విమానం జాడపై తొలగని ఉత్కంఠ

**కొనసాగుతున్న గాలింపు చర్యలు**



ఏఎన్-32 రకం రవాణా విమానం (ఫైల్)

**ఈటానగర్/న్యూఢిల్లీ:** భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రకం రవాణా విమానం ఆచూకీ ఇంకా తెలియరాలేదు. దీనికి సంబంధించి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వాయుసేన విమానం జాడ కనిపెట్టేందుకు మంగళవారం భారతీయ నేవీ కూడా రంగంలోకి దిగింది. మొత్తం 13 మందితో వెళ్తున్న ఏఎన్-32 విమానం అస్సాంలోని జోర్హాత్ నుంచి టేకాఫ్ అయిన 33 నిమిషాలకే అదృశ్యమైన విషయం తెలిసిందే. అరుణాచల్ ప్రదేశ్‌లోని మెచుకా ప్రాంతానికి చేరాల్సి ఉండగా, మార్గమధ్యంలోనే గల్లంతైంది. అదృశ్యమైన విమానాన్ని వెతికేందుకు శక్తివంతమైన పీ8ఐ విమానం తమిళనాడులోని ఎర్నాకులంలో ఉన్న ఐఎన్ఎస్ రాజలీ నుంచి మంగళవారం మధ్యాహ్నం బయలుదేరిందని నేవీ అధికార ప్రతినిధి కెప్టెన్ డీకే శర్మ వెల్లడించారు. ఇది ఎలక్ట్రో ఆప్టికల్, ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్ల సాయంతో గాలింపు చర్యలు చేపడుతుందని తెలిపారు. ఇప్పటికే ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన రెండు ఎంఐ–17 విమానాలు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు విమానం కోసం మెంచుకా అటవీ ప్రాంతంలో గాలిస్తున్నాయని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో కొంతమంది బృందాలుగా ఏర్పడి విమానం జాడ కోసం వెతుకుతున్నాయని తెలిపారు. సోమవారం ఓ చోట విమానం కూలిపోయినట్లు తమకు సమాచారం అందిందని.. వెంటనే అక్కడకు వెళ్లి పరిశీలించగా అలాంటిదేం లేదని గుర్తించామని భారత వైమానిక దళం ఒక ప్రకటనలో వెల్లడించింది.

**అస్సాంకు చేరిన ఫ్లైట్ లెఫ్టినెంట్ కుటుంబసభ్యులు**
**పటియాలా:** అదృశ్యమైన విమానంలో ఎనిమిది మంది వైమానిక సిబ్బంది సహా ఐదుగురు ప్యాసింజర్లు ఉన్నారని తెలిపింది. వీరిలో పటియాలాలోని సమానా ప్రాంతానికి చెందిన ఫ్లైట్ లెఫ్టినెంట్ మోహిత్ గార్గ్ కూడా ఉన్నారు. విమానం గల్లంతైన వార్త తెలియగానే మోహిత్ తండ్రి సురీందర్ గార్గ్, అంకుల్ రిషీ గార్గ్ అస్సాంకు చేరుకున్నారని వారి కుటుంబసభ్యులు వెల్లడించారు. మోహిత్ క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు అతని సోదరుడు అశ్వనీ గార్గ్ తెలిపారు. మోహిత్‌కు గతేడాది వివాహమైంది. అతని భార్య అస్సాంలోని ఓ బ్యాంకులో పనిచేస్తోంది.

### పదేళ్ల క్రితమూ ఇలాగే..

అది 2009 సంవత్సరం జూన్ నెల. భారత వాయుసేనకు చెందిన ఏఎన్–32 రకం రవాణా విమానం 13 మందిని ఎక్కించుకుని వెళ్తుండగా అరుణాచల్ ప్రదేశ్‌లో కూలిపోయింది. అందులోని మొత్తం 13 మంది మరణించారు. పశ్చిమ సియాంగ్ జిల్లాలోని రించీ హిల్‌పైన ఆ విమానం కూలిపోయింది. ఆ విమానం మెచుకా నుంచి అసోంలోని మోహన్‌బరి వైమానిక స్థావరానికి వెళ్తుండగా మెచుకాకు 30 కిలోమీటర్ల దూరంలో దుర్ఘటన జరిగింది. విచిత్రం ఏమిటంటే సరిగ్గా పదేళ్లకు జూన్ నెలలోనే 13 మందితో మెచుకా వెళ్తున్న ఏఎన్–32 రకం విమానం సోమవారం కన్పించకుండా పోయింది. ఇందులో కూడా 13 మందే ఉండటం గమనార్హం. ఈ విమానం మెచుకాకు వెళుతుండగా అదృశ్యం కావడం విశేషం.

# సాక్షి బిజినెస్

బుధవారం
5-6-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 184 ▼ | 67 ▼ |
| 40,084 | 12,022 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం...
www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,500 | ▲ 166 |
| డోజోన్స్ | 25,263 | ▲ 443 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,214 | ▲ 29 |
| డాక్స్ | 11,971 | ▲ 178 |
| షాంఘై | 2,862 | ▼ 28 |
| నికాయ్ | 20,409 | ▼ 2 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.33 | 69.97 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.03 | 89.14 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.36 | 79.28 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.81 | 65.24 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.22 | 49.36 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.66 | 51.41 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.69 | 19.45 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.12 | 19.68 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.40 | 10.76 |

## ఐట్యూన్స్‌కు యాపిల్ గుడ్‌బై..




శాన్ జోస్: ఆన్‌లైన్ మ్యూజిక్ రూపురేఖలు మార్చేసిన ఐట్యూన్స్ యాప్ ఇకపై కనుమరుగు కానుంది. దీని స్థానంలో మూడు యాప్స్‌ను ప్రవేశపెడుతున్నట్లు టెక్ దిగ్గజం యాపిల్ ప్రకటించింది. యాపిల్ మ్యూజిక్, పాడ్‌కాస్ట్స్ యాపిల్ టీవీ ఇందులో ఉంటాయని వివరించింది. 2001లో తొలిసారిగా ఐట్యూన్స్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఇంటర్నెట్ మాధ్యమంగా మ్యూజిక్, ఆన్ డిమాండ్ వీడియోలు మొదలైనవి ప్రాచుర్యంలోకి వచ్చాయి. తాజాగా ఐట్యూన్స్‌ను మూడు వేర్వేరు యాప్‌ల కింద తీసుకురావడం ద్వారా ఈ ఏడాదే ప్రవేశపెట్టబోయే టీవీప్లస్ సర్వీసులకు మరిన్ని హంగులు అద్దేందుకు యాపిల్ ప్రయత్నిస్తోంది. యాపిల్ టీవీ యాప్‌ను స్మార్ట్ టెలివిజన్స్‌లో పొందుపర్చడంతో పాటు రోకు, అమెజాన్ ఫైర్ టీవీ మొదలైన థర్డ్ పార్టీ ప్లాట్‌ఫామ్‌ల్లో కూడా అందుబాటులోకి తేనున్నట్లు సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ క్రెగ్ ఫెడరిగి తెలిపారు.

## పెన్నా సిమెంట్ ఐపీఓకు సెబీ ఓకే

**ఐపీఓ సైజు రూ.1,550 కోట్లు**




**న్యూఢిల్లీ:** పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ ఐపీఓకు (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న పెన్నా సిమెంట్... ఈ ఐపీఓ ద్వారా రూ.1,550 కోట్లు సమీకరించనున్నది. ఐపీఓలో భాగంగా రూ.1,300 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. అంతే కాకుండా రూ.250 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయిస్తారు. ఈ ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను రుణ భారం తగ్గించుకోవడానికి, సాధారణ వ్యాపార కార్యకలాపాలకు వినియోగించుకోవాలని కంపెనీ యోచిస్తోంది. ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐఐఎఫ్ఎల్ హోల్డింగ్స్, జేఎమ్ ఫైనాన్షియల్, యస్ సెక్యూరిటీస్ వ్యవహరిస్తున్నాయి. పెన్నా సిమెంట్ కంపెనీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో నాలుగు సిమెంట్ ప్లాంట్లు, రెండు గ్రైండింగ్ యూనిట్లున్నాయి.






## 10వ తేదీ నుంచి బడ్జెట్ తయారీ ప్రక్రియ

### జూలై 5న మోదీ సర్కారు బడ్జెట్




**న్యూఢిల్లీ:** కేంద్రంలో కొత్తగా కొలువుతీరిన నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019–20) పూర్తి స్థాయి బడ్జెట్‌ను జూలై 5వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి సన్నద్ధమవుతోంది. సోమవారం నుంచీ బడ్జెట్ తయారీ ప్రక్రియకు శ్రీకారం చుడుతోంది. ఆర్థికమంత్రిత్వశాఖ కార్యాలయం ఉన్న నార్త్‌బ్లాక్‌లో బడ్జెట్ ముద్రణ కార్యకలాపాలు సోమవారంనాడు ప్రారంభంకానున్నాయి. నాటి నుంచీ బడ్జెట్ తయారీ ప్రక్రియలో పాల్గొననున్న అధికారులకు జూలై 5వ తేదీ వరకూ బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా సంబంధాలు తెగిపోనున్నాయి. ఇటీవల జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో... పరిమిత కాలానికి ప్రభుత్వ వ్యయాలకు వీలు కల్పిస్తూ, ఫిబ్రవరి 1న కేంద్రం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇక ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ నేతృత్వంలోని తాజా బడ్జెట్ టీమ్‌లో ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణ్యన్ ఉన్నారు. ఫైనాన్స్ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ నేతృత్వంలోని అధికారుల బృందంలో వ్యయ వ్యవహారాల కార్యదర్శి గిరీష్ చంద్ర ముర్మూ, రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషన్ పాండే, డీపీఏఎం సెక్రటరీ అతన్ చక్రవర్తి, ఫైనాన్స్ సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్‌లు ఉంటారు. కొత్తగా ఎన్నికైన 17వ లోక్‌సభ మొదటి సమావేశాలు జూన్ 17 నుంచి జూలై 26వ తేదీ వరకూ జరుగుతాయి. 2018–19 ఆర్థిక సర్వేను జూలై 4న ఆర్థికమంత్రి ప్రవేశపెడతారు. ఆ తదుపరిరోజు 2018–19 పూర్తిస్థాయి బడ్జెట్‌ను పార్లమెంటు ముందు ఉంచుతారు.

## గూగుల్ మ్యాప్స్‌లో రైళ్ల అప్‌డేట్స్

**న్యూఢిల్లీ:** గూగుల్ మ్యాప్స్ యూజర్లు ఇకపై బస్సు ప్రయాణాలకు పట్టే సమయం, ప్లాట్‌ఫాంపై రైళ్ల రాక గురించిన వివరాలను లైవ్‌లో తెలుసుకోవచ్చు. హైదరాబాద్ సహా దేశంలోని 10 పెద్ద నగరాల్లో ఈ సర్వీసులు అందుబాటులోకి తెచ్చినట్లు గూగుల్ తెలిపింది. అలాగే, ఆటో, ప్రజా రవాణా వాహనాలకు సంబంధించిన సమాచారం కూడా ఇచ్చే ఫీచర్‌ను మ్యాప్స్‌లో పొందుపర్చినట్లు వివరించింది. లైవ్ ట్రాఫిక్ వివరాలు అందించడం ద్వారా తమ యూజర్లకు ప్రయాణాలను మరింత సులభతరం చేయనున్నట్లు గూగుల్ పేర్కొంది. గూగుల్ మ్యాప్స్ ద్వారా ట్రెయిన్ రన్నింగ్ స్టేటస్‌ను గురించి తెలుసుకోవచ్చు. అలాగే వివిధ ప్రాంతాల మధ్య తిరిగే రైళ్ల లిస్టు వివరాలు పొందవచ్చు. గతేడాది కొనుగోలు చేసిన వేర్ ఈజ్ మై ట్రెయిన్ యాప్ సంస్థతో కలిసి ఈ ఫీచర్‌ను అభివృద్ధి చేసినట్లు గూగుల్ పేర్కొంది.



# లాభాలొచ్చినా... వడ్డీకి సరి!

- తగ్గిన డిమాండ్; పేరుకుంటున్న నిల్వలు
- వర్కింగ్ క్యాపిటల్ కోసం కొత్త రుణాలు
- ఇప్పటికే పాత రుణాలతో కుదేలు
- పాత, కొత్త రుణాలపై వడ్డీలు తడిసి మోపెడు
- సేల్స్ పుంజుకున్నా, తగ్గిన నిర్వహణ లాభం
- కొత్త ప్రభుత్వ సంస్కరణలపై కార్పొరేట్ల ఆశ



గంప లాభం చిల్లి తీసిందని సామెత. దాదాపు మూడేళ్లపాటు అంతంతమాత్రంగా ఉన్న కంపెనీల ఆర్థిక ఫలితాలు ఇప్పుడిప్పుడే ఒక దారికి వస్తున్నాయి. అయితే అలాంటి కంపెనీల లాభాలను వడ్డీ చెల్లింపులు హరించేస్తున్నాయి. ఈ ఏడాది మార్చితో ముగిసిన ఆరు నెలల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే... స్టాక్ మార్కెట్లో లిస్టైన టాప్ కంపెనీల (ఆర్థిక, ఆయిల్, గ్యాస్ కంపెనీలు మినహా) వడ్డీ చెల్లింపులు 15 శాతం మేర పెరిగాయి. స్టాక్ మార్కెట్లో లిస్టయిన 1,202 కంపెనీల ఆరు నెలల ఆర్థిక ఫలితాలను విశ్లేషిస్తే వెల్లడయిన వాస్తవమిది. అయితే ఈ జాబితాలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, గ్యాస్, చమురు కంపెనీలు మాత్రం లేవనుకోండి. ఇంకా ఈ విశ్లేషణలో ఏం తేలిందంటే..

**వడ్డీ భారం భరించలేనంత...**

నికర అమ్మకాలు, నిర్వహణ లాభాల కంటే వడ్డీ చెల్లింపులే జోరుగా పెరిగాయి. గత మూడున్నరేళ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, వడ్డీ వ్యయాలు ఇంతగా పెరగడం ఇదే మొదటిసారి. గత ఆర్థిక సంవత్సరం చివరి రెండు క్వార్టర్లలో కంపెనీల నిర్వహణ లాభం (ఎబిటా) 6 శాతం తగ్గింది. గత మూడున్నరేళ్ల కాలంలో ఇదే అత్యంత అధ్వాన్న పరిస్థితి. ఇదే కాలంలో నికర అమ్మకాలు మాత్రం 11 శాతం పెరిగాయి. ఇక సీక్వెన్షియల్‌గా చూసినా నికర అమ్మకాలు పుంజుకున్నాయి.

**లాభాలు ఆవిరి...**

నిర్వహణ లాభంలో పెద్దగా మెరుగుదల లేకపోవడం, వడ్డీ వ్యయాలు పెరగడంతో కంపెనీల నికర లాభాలు తగ్గాయి. కంపెనీల నికర లాభం (అసాధారణ లాభాలు, నష్టాలను మినహాయించుకొని) గత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధ భాగంలో 3.5 శాతం తగ్గిపోయింది. మూడున్నరేళ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఇదే అత్యంత ఘోరమైన పనితీరు. అసాధారణ లాభాలను మినహాయిస్తే. నికర లాభం 24 శాతం తగ్గింది. గత ఏడాది కాలంలో నిధుల కొరత సమస్య తీవ్రంగా ఉంది. అంతే కాకుండా వడ్డీరేట్లు పెరిగాయి. మరోవైపు కంపెనీల రుణాలు కూడా పెరిగాయి. ఈ కారణాల వల్ల నికర లాభం కుదేలైంది.

**పాత వాటికితోడు కొత్త రుణాలు...**

డిమాండ్ తగ్గడంతో వివిధ రంగాలకు చెందిన పలు కంపెనీల వద్ద నిల్వలు పెరిగిపోయాయి. దీంతో వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు పెరిగిపోయాయి. ఫలితంగా కంపెనీలు రుణాలు తీసుకోవడం కూడా పెరిగింది. పాత రుణాలు, కొత్త రుణాలు కలిసి మొత్తంమీద వడ్డీ వ్యయాలు తడిసిమోపెడయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం చివర 6 నెలల్లో కంపెనీల రుణాలు 13% పెరిగాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీల రుణాలు 3.3% మేర తగ్గాయి. ఈ కంపెనీలు మొత్తం రుణభారం రూ.11.2 లక్షల కోట్ల నుంచి రూ.12,7 లక్షల కోట్లకు పెరిగింది. కంపెనీల తీసుకున్న రుణాలపై వడ్డీరేట్లు పెరిగాయి. సగటు వడ్డీరేటు 8.85% నుంచి 9.01%కి పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లోని వడ్డీరేట్లతో పోల్చితే తర్వాతి రెండు క్వార్టర్లలో వడ్డీ రేట్లు 24 బేసిస్ పాయింట్లు తగ్గడం కొంత ఊరటనిచ్చే విషయం.

### పేరుకుపోతున్న నిల్వలు

ఇన్వెంటరీ పలు రంగాల్లో అధికంగా పేరుకుపోయింది. ముఖ్యంగా వాహన, నిర్మాణ మౌలిక రంగాల్లో నిల్వలు బాగా పెరిగిపోయాయి. వినియోగదారుల నుంచి డిమాండ్ తగ్గడంతో వాహన కంపెనీల వల్ల నిల్వలు పెరిగాయి. విద్యుత్, మౌలిక రంగ కంపెనీలకు ప్రభుత్వం నుంచి రావలసిన చెల్లింపుల్లో జాప్యం నెలకొనటం కూడా ప్రభావం చూపించింది. రెండోసారి కొలువుదీరిన నరేంద్ర మోదీ ప్రభుత్వం వినియోగం పెంచే చర్యలు తీసుకుంటుందని, సంస్కరణలను మరింత ముందుకు తీసుకుపోతుందనే అంచనాలు ఉన్నాయి. ఈ అంచనాలు సాకారమైతే, అమ్మకాలు పుంజుకొని కంపెనీల నిర్వహణ లాభం మెరుగుపడుతుందని, అంతకంతకూ పెరిగిపోతున్న వడ్డీ వ్యయాల నుంచి ఉపశమనం లభించగలదని కంపెనీలు ఆశిస్తున్నాయి.

## టెక్నో పెయింట్స్ మరో తయారీ కేంద్రం

- రూ.2.5 కోట్లతో ఆర్‌అండ్‌డీ సెంటర్ కూడా..
- హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో; 10న ఆరంభం
- త్వరలో మార్కెట్లోకి గ్రానైట్, మార్బుల్ పెయింట్స్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** పెయింట్స్ రంగంలోని హైదరాబాదీ కంపెనీ ఫార్చ్యూన్ పెయింట్స్ (టెక్నో పెయింట్స్) మరో తయారీ కేంద్రాన్ని ప్రారంభించనుంది. రూ.2.5 కోట్ల పెట్టుబడితో ప్లాంట్, ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఫార్చ్యూన్ గ్రూప్ ఎండీ ఆకూరి శ్రీనివాస రెడ్డి చెప్పారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఈ నెల 10న ప్రారంభిస్తామని, ఇందులో 50 మంది ఉద్యోగులుంటారని తెలియజేశారు. ఏపీఎస్ రీసెర్చ్ అండ్ మీడియా ఇంటర్నేషనల్ సంస్థ 2019వ సంవత్సరానికి ఫార్చ్యూన్ పెయింట్స్‌కు ప్రొడక్ట్ అండ్ సర్వీసెస్ విభాగంలో క్వాలిటీ మ్యానుఫాక్చరింగ్ అవార్డు ఇచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు.

**20 వేల మెట్రిక్ టన్నులు..**

ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో రెండు, గుంటూరులోని నడికుడిలో మరో తయారీ కేంద్రం ఉన్నాయి. వీటి వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 20 వేల మెట్రిక్ టన్నులు. ''ఇప్పటివరకు రూ.25 కోట్ల పెట్టుబడులు పెట్టాం. ఆస్ట్రేలియా, యూరప్ వంటి దేశాల నుంచి ముడి సరుకులను దిగుమతి చేసుకొని, పెయింట్స్, సొల్యూషన్స్‌ను తయారు చేస్తున్నాం. ప్రస్తుతం గ్రానైట్ టెక్స్చర్, మార్బుల్ ఫినిష్ పెయింటింగ్‌ల మీద పరిశోధనలు జరుగుతున్నాయి. త్వరలోనే వీటిని మార్కెట్లోకి ప్రవేశపెడతాం'' అని శ్రీనివాసరెడ్డి చెప్పారు.



అవార్డు అందుకుంటున్న ఆకూరి శ్రీనివాస రెడ్డి

**రూ.100 కోట్ల టర్నోవర్..:** ఫార్చ్యూన్ గ్రూప్‌నకు ఫార్చ్యూన్ పెయింట్స్, ఫినెట్రీ యూపీవీసీ, ఏఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, టెక్నో ట్రేడర్స్ కంపెనీలున్నాయి. తమ గ్రూప్ గత ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్ల టర్నోవర్ నమోదు చేసిందని, దీన్లో పెయింట్ల విభాగానిది రూ.70 కోట్లని శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ''మా ఆదాయంలో 40 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాల నుంచే ఉంటుంది. గత ఐదేళ్ల నుంచి 50 శాతం వృద్ధిని నమోదు చేస్తున్నాం. ఇప్పటివరకు 600కు పైగా ప్రాజెక్ట్‌లకు పెయింటింగ్‌ను పూర్తి చేశాం. మై హోమ్, అపర్ణా, శోభ, పూర్వాంకర వంటి ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలన్నీ మా క్లయింట్లే. ఇటీవలే అమరావతిలో కార్యాలయాన్ని ప్రారంభించాం'' అని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

## ఆడిటర్లపై చర్యలు తీసుకోవాలి

- ఆర్‌బీఐతో అంతర్గత విచారణ
- ఐఎల్‌ఎఫ్ఎస్ కుంభకోణంపై ఎస్ఎఫ్ఐవో సూచన
- నష్టాల రికవరీకి చర్యలపై ప్రణాళిక



**న్యూఢిల్లీ:** దాదాపు రూ. 90,000 కోట్ల రుణ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ కేసులో తీవ్ర నేరాల విచారణ సంస్థ (ఎస్ఎఫ్ఐవో) దర్యాప్తు వేగవంతం చేసింది. మోసాల్లో పాలుపంచుకున్న ఆడిటర్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అలాగే, లోపాలను గుర్తించడంలో జాప్యానికి గల కారణాల అన్వేషణకు రిజర్వ్ బ్యాంక్ అంతర్గతంగా విచారణ జరపాలని సూచించింది. ఉన్నతాధికారులు కుమ్మక్కై పాల్పడిన మోసం కారణంగా వాటిల్లిన నష్టాలను రాబట్టేందుకు ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఫిన్) కొత్త మేనేజ్‌మెంట్ తగు చర్యలు తీసుకోవాల్సి ఉందని ఎస్ఎఫ్ఐవో పేర్కొంది. ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ గ్రూప్ సంస్థ అయిన ఐఫిన్ వ్యవహారంపై విస్తృతంగా దర్యాప్తు చేసిన అనంతరం ఎస్ఎఫ్ఐవో తాజాగా తొలి చార్జి షీటు దాఖలు చేసింది. ఈ భారీ ఆర్థిక కుంభకోణం వెనుక 9 మంది కోటరీ ఉన్నట్లు అందులో పేర్కొంది. కంపెనీని ఇష్టారాజ్యంగా నడిపిస్తూ కొందరు స్వతంత్ర డైరెక్టర్లు, ఆడిటర్లు కుమ్మక్కై ఈ కుంభకోణానికి వ్యూహ రచన చేసినట్లు ఆరోపణలు చేసింది. హరి శంకరన్, రవి పార్థసారథి, అరుణ్ సాహా, రమేష్ బవా, విభవ్ కపూర్, కే రామ్ చంద్ తదితరులు ఈ కోటరీలో ఉన్నట్లు పేర్కొంది. రుణాలు, నికరంగా చేతిలో ఉన్న నిధుల లెక్కింపులో ఐఫిన్ అవకతవకలకు పాల్పడుతోందంటూ 2015 నుంచి ఆర్‌బీఐ అనేక నివేదికల్లో పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐవో ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో జరిమానాల విధింపులో జాప్యానికి గల కారణాలను వెలికితీసేందుకు అంతర్గతంగా విచారణ జరపాలని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐకి ఎస్ఎఫ్ఐవో తెలిపింది.

# మరింతగా అప్పుల 'చమురు'!

- భారీ రుణ భారంలో చమురు మార్కెటింగ్ సంస్థలు
- మార్చినాటికి ఏకంగా రూ.1.62 లక్షల కోట్ల రుణాలు
- భారీ మూలధన వ్యయాలతో పెరిగిన రుణాలు
- ప్రభుత్వం సబ్సిడీలు చెల్లించకపోవటంతో ఇంకాస్త...



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగంలోని చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) రుణాలపై ఆధారపడడం రానురాను మరింత పెరుగుతోంది. ఇందుకు నిదర్శనంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌నే (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) ఉమ్మడి రుణాలను చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ మూడింటి రుణాలూ ఈ ఏడాది మార్చి నాటికి ఐదేళ్ల గరిష్ట స్థాయి 1.62 లక్షల కోట్లకు పెరిగిపోయాయి. ఏడాది క్రితం ఉన్న రూ.1.25 లక్షల కోట్ల రుణాలతో పోలిస్తే ఇవి ఏకంగా 30 శాతం పెరిగిపోయాయి. ముఖ్యంగా వీటిల్లో ఒక్క ఐవోసీ రుణాలే 2019 మార్చి నాటికి రూ.92,712 కోట్లు కావడం గమనార్హం. ఆ తర్వాత బీపీసీఎల్ రుణాలు రూ.42,915 కోట్లు, హెచ్‌పీసీఎల్ రుణ భారం రూ.26,036 కోట్లు చొప్పున ఉన్నాయి. ఈ మూడు కంపెనీలూ కలసి కొత్తగా రూ.36,402 కోట్ల మేర రుణాలను సమీకరించినట్టు తెలుస్తోంది. ప్రధానంగా మూలధన విస్తరణ కార్యక్రమాలకు తోడు ప్రభుత్వం నుంచి సబ్సిడీలు సకాలంలో రాకపోవడమే రుణ భారం పెరిగేందుకు కారణంగా నిపుణులు చెబుతున్నారు. లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ), కిరోసిన్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.33,900 కోట్ల మేర సబ్సిడీ ఓఎంసీలకు రావాల్సి ఉంది. ద్రవ్య లోటు సర్దుబాటు కోసమని ఓఎంసీల సబ్సిడీల చెల్లింపులను ప్రభుత్వం వాయిదా వేయడం గమనార్హం.

**భారీ విస్తరణ కార్యక్రమాలు**

అయితే 2018–19 ఆర్థిక సంవత్సరం నాటికి ఓఎంసీల ఉమ్మడి రుణ భారం రూ.1.62 లక్షల కోట్లుగా ఉన్నప్పటికీ... 2014 ఆర్థిక సంవత్సరం కంటే తక్కువే ఉందని చెప్పాలి. అప్పట్లో చమురు ధరలు చారిత్రక గరిష్టాలకు చేరిన సమయం కావడంతో ఓఎంసీల ఉమ్మడి రుణ భారం రూ.1.76 లక్షల కోట్ల స్థాయికి పెరిగిపోయింది. ''బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలతో పోలిస్తే ఐవోసీ భారీగా మూలధన వ్యయ ప్రణాళికలను అమలు చేస్తోంది. హెచ్‌పీసీఎల్‌కు ఎక్కువ శాతం మార్కెటింగ్ కార్యకలాపాలు కావడంతో నగదు ప్రవాహాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే, మోస్తరు విస్తరణ ప్రణాళికలను అమల్లో పెట్టింది. బీపీసీఎల్‌కు మాత్రం చమురు వెలికితీత, ఉత్పత్తితో పాటు పట్టణ గ్యాస్ పంపిణీ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి'' అని ఆయిల్ అండ్ గ్యాస్ రంగ విశ్లేషకుడు ఒకరు పేర్కొన్నారు.

**రావాల్సిన బకాయిలు**

కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ చెల్లింపుల్లో జాప్యం చేయడం కారణంగానే ఓఎంసీలకు ఒక్కోదానికి మార్చి నెలలో రూ.5,000– 10,000 కోట్ల వరకు రుణం పెరిగినట్టు బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక పేర్కొంది. ''మా రుణభారం ఇప్పటి వరకైతే రూ.81,000 కోట్లకు పెరిగింది. ప్రధానంగా ప్రభుత్వం నుంచి రూ.19,000 కోట్ల మేర బకాయిలు రాకపోవడం వల్లే. ఇందులో ఎల్‌పీజీకి సంబంధించి ప్రత్యక్ష నగదు బదిలీ రూ.13,883 కోట్లుగా ఉంటే, కిరోసిన్ సబ్సిడీ రూ.3,395 కోట్ల మేర ఉంది. మిగిలిన రూ.2,000 కోట్లు పీఎంయూవై డిపాజిట్'' అని ఈ నెల 17న ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ ఏకే శర్మ పేర్కొనడం గమనార్హం. ఇక కేంద్ర ప్రభుత్వానికి అధిక డివిడెండ్ చెల్లించాల్సి రావడం, మధుర రిఫైనరీకి సంబంధించి ఎంట్రీ ట్యాక్స్ సైతం ఇండియన్ ఆయిల్ రుణ భారం పెరిగిపోవడానికి కారణాలుగా ఉన్నాయి.

**ఏటేటా పెరిగిపోయిన రుణాలు**

| ఆర్థిక సంవత్సరం | కంపెనీ | రుణభారం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2014 | బీపీసీఎల్ | రూ.33,152 |
| | హెచ్‌పీసీఎల్ | 47,995 |
| | ఐవోసీ | 94,916 |
| 2015 | బీపీసీఎల్ | 25,492 |
| | హెచ్‌పీసీఎల్ | 36,916 |
| | ఐవోసీ | 64,893 |
| 2016 | బీపీసీఎల్ | 23,388 |
| | హెచ్‌పీసీఎల్ | 22,160 |
| | ఐవోసీ | 58,552 |
| 2017 | బీపీసీఎల్ | 35,725 |
| | హెచ్‌పీసీఎల్ | 22,130 |
| | ఐవోసీ | 63,271 |
| 2018 | బీపీసీఎల్ | 37,659 |
| | హెచ్‌పీసీఎల్ | 21,952 |
| | ఐవోసీ | 65,650 |
| 2019 | బీపీసీఎల్ | 42,915 |
| | హెచ్‌పీసీఎల్ | 26,036 |
| | ఐవోసీ | 92,712 |

## 'ఎయిర్‌ట్రాఫిక్'పై ఏఏఐ, బోయింగ్ జట్టు

- పదేళ్ల రోడ్‌మ్యాప్ కోసం కుదిరిన ఒప్పందం
- ఏడాదిన్నరలో రోడ్‌మ్యాప్ సిద్ధం



**న్యూఢిల్లీ:** భారత్‌లో విమానాల నిర్వహణ వ్యవస్థను ఆధునీకరించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ)తో కలిసి పదేళ్ల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు బోయింగ్ తెలియజేసింది. ఈ రోడ్‌మ్యాప్‌ను రూపొందించేందుకు తాము సాంకేతిక సహకారం అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ కార్యాచరణ ప్రణాళిక 18 నెలల్లో సిద్ధం కావచ్చని, అమెరికా ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(యూఎస్‌టీడీఏ) నిధులతో దీన్ని చేపట్టనున్నామని సంస్థ తెలిపింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఏఏఐ నేతృత్వంలో 125 విమానాశ్రయాలను కొనసాగుతున్నాయి. అంతర్జాతీయంగా, స్థానికంగా ఉన్న అత్యుత్తమ ప్రమాణాలకు లోబడి జాతీయ ఎయిర్‌స్పేస్ వ్యవస్థను ఆధునీకరించడానికి ఈ రోడ్‌మ్యాప్ మార్గదర్శకత్వం వహిస్తుంది. ఎయిర్‌స్పేస్ సామర్థ్యాన్ని గరిష్ట స్థాయిలో వినియోగించుకునేలా, కమ్యూనికేషన్స్‌ను పెంచడం, నిఘా, విమానాల రద్దీ నియంత్రణలోనూ ఈ రోడ్‌మ్యాప్ ఉపకరిస్తుందని బోయింగ్ పేర్కొంది. ఈ విషయంలో డీజీసీఏతోనూ కలసి పనిచేస్తామని ప్రకటించింది. ఆధునిక టెక్నాలజీలు, అంతర్జాతీయ విధానాలను అమలు చేయడం ద్వారా భారత్ తన గగనతల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోగలదని ఏఏఐ చైర్మన్ గురుప్రసాద్ మొహపాత్రా పేర్కొన్నారు.

## రుణాలకు పెరుగుతున్న డిమాండ్

- ఈ ఏడాది 10–12 శాతం వృద్ధి
- రికవరీ అవకాశాలు మెరుగు
- వార్షిక నివేదికలో ఎస్‌బీఐ




**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10–12 శాతం వృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ఉన్నట్టు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) స్పష్టంచేసింది. రుణాలకు తిరిగి డిమాండ్ ఏర్పడుతుండడం, రుణాల వసూళ్ల అవకాశాలు మెరుగుపడడంతో ఈ లక్ష్యాన్ని సాధించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. బలమైన వ్యాపార వృద్ధితోపాటు తగినంత మూలధనం, లిక్విడిటీ, మార్కెట్ లీడర్‌గా రుణాలపై తగినంత మార్జిన్ వసూలు చేసే సామర్థ్యాలు బ్యాంకుకు ఉన్నాయని 2018–19 వార్షిక నివేదికలో బ్యాంకు వివరించింది. అంతకుముందు కొన్ని సంవత్సరాల పాటు రుణాలకు వృద్ధి తక్కువగా ఉన్న తర్వాత 2018–19లో కార్పొరేట్ రంగం నుంచి రుణాలకు డిమాండ్ తిరిగి నెలకొందని, అలాగే, వ్యక్తిగత రుణాల్లోనూ డిమాండ్ ఉందని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ తెలిపారు. 2019 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ రూ.862 కోట్ల స్టాండెలోన్ లాభాన్ని, రూ.2,300 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని నమోదు చేసింది. సకాలంలో వసూలు కాక మాఫీ చేసిన రుణాల్లో 57 శాతాన్ని ఎస్‌బీఐ గత ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసుకోగలిగింది.

## ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ లాభం రూ.231 కోట్లు




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.231 కోట్ల నికరలాభం ఆర్జించింది. పెన్షన్లకు చేసిన కేటాయింపులు రూ.209 కోట్లని బ్యాంక్ వెల్లడించింది. నెట్ వర్త్ రూ.2,210 కోట్లకు చేరుకుంది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో ఇదే అత్యధిక నెట్‌వర్త్ అని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ఏ.వెంకట రెడ్డి తెలిపారు. నికర ఎన్‌పీఏలు సున్నా శాతమని పేర్కొన్నారు. డిపాజిట్లు 9.7 శాతం అధికమై రూ.14,325 కోట్లు, అడ్వాన్సులు 16.6 శాతం పెరిగి రూ.13,691 కోట్లుగా ఉంది. మొత్తం వ్యాపారం 13 శాతం వృద్ధితో రూ.28,286 కోట్లకు చేరింది.

## డెల్, జీప్, ఎల్ఐసీ అత్యంత విశ్వసనీయ బ్రాండ్లు

**న్యూఢిల్లీ:** భారతీయ అత్యంత విశ్వసనీయ బ్రాండ్ల జాబితాలో ప్రముఖ ల్యాప్‌టాప్ బ్రాండ్ 'డెల్' తొలిస్థానంలో ఉన్నట్లు టీఆర్‌ఏ సంస్థ తన నివేదికలో పేర్కొంది. ఈ సంస్థ 'బ్రాండ్ ట్రస్ట్ రిపోర్ట్ 2019' పేరిట విడుదలచేసిన తాజా నివేదికలో ఆటోమొబైల్ కంపెనీ జీప్ అత్యంత విశ్వసనీయ బ్రాండ్ల జాబితాలో రెండవ స్థానంలో ఉండగా.. ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ మూడవ స్థానంలో నిలిచింది. ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ నాల్గవ స్థానంలో నిలవగా, ఆపిల్ ఐఫోన్ ఐదవ స్థానంలో ఉంది. దక్షిణ కొరియా మొబైల్ ఫోన్ బ్రాండ్ శాంసంగ్ ఐదవ స్థానంలోనూ, టెలివిజన్స్ పరంగా ఎల్‌జీ ఆరవ స్థానంలో ఉన్నాయి. అవివా లైఫ్ ఇన్సూరెన్స్, మారుతి సుజుకి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా ఎనిమిది, తొమ్మిది, పదవ స్థానాల్లో నిలిచాయి.

## జెట్ వైఫల్యంలో విధాన నిర్ణేతలకూ కొంత పాత్ర

### స్పైస్‌జెట్ చీఫ్ అజయ్ సింగ్ వ్యాఖ్య

**సియోల్:** ప్రైవేట్ రంగ విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ మూతబడటమనేది ఏవియేషన్ పరిశ్రమకు ఒక మేల్కొలుపు కావాలని స్పైస్‌జెట్ చీఫ్ అజయ్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో విధాన నిర్ణేతల పాపం కూడా కొంత ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఎయిర్‌లైన్ వ్యయాలు భారీగా పెరిగిపోయేలా విధానాలు ఉండటమే దీనికి కారణమని పేర్కొన్నారు. 'జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలు నిల్చిపోవడం చాలా బాధాకరం. ఇది ఏవియేషన్ రంగానికి, విధానకర్తలకు మేల్కొల్పు కావాలి' అన్నారు.

# పాలసీకి ముందు లాభాల స్వీకరణ

- స్వల్పంగా తగ్గిన రూపాయి
- నష్టపోయినా, కీలక స్థాయిల ఎగువనే సెన్సెక్స్, నిఫ్టీలు
- 184 పాయింట్లు తగ్గి 40,084కు సెన్సెక్స్
- 67 పాయింట్లు పతనమై 12,022కు నిఫ్టీ



ఆర్‌బీఐ పాలసీకి ముందు ఇన్వెస్టర్లు గరిష్ట స్థాయిల్లో లాభాల స్వీకరణ చేయడంతో మంగళవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. సోమవారం సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ జీవిత కాల గరిష్ట స్థాయి రికార్డ్‌లను సాధించిన విషయం తెలిసిందే. సూచీల ఆల్‌టైమ్ హై రికార్డ్‌ల నేపథ్యంలో లాభాల స్వీకరణ చోటు చేసుకున్నప్పటికీ, సెన్సెక్స్ 40,000 పాయింట్లు, నిఫ్టీ 12,000 పాయింట్ల ఎగువనే ముగిశాయి. సెన్సెక్స్ 184 పాయింట్లు నష్టపోయి 40,084 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 67 పాయింట్లు తగ్గి 12,022 పాయింట్ల వద్ద ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం స్వల్పంగా నష్టపోవడం కూడా ప్రతికూల ప్రభావం చూపించింది. ఐటీ, వాహన, బ్యాంక్ రంగ షేర్లు నష్టపోయాయి. క్యాపిటల్ గూడ్స్, లోహ, టెలికం షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి.

**281 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్....**

సమీప భవిష్యత్తులో ఆర్‌బీఐ పాలసీని బట్టే మార్కెట్ గమనం ఉంటుందని రెలిగేర్ బ్రోకింగ్ ఎనలిస్ట జయంత్ మాంగ్లిక్ వ్యాఖ్యానించారు. అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం నిమిత్తం చర్చలు, ముడి చమురు ధరల కదలికలు కీలకమని పేర్కొన్నారు. సెన్సెక్స్ నష్టాల్లో ఆరంభమైనా ఉదయం పదిగంటల వరకూ లాభ, నష్టాల మధ్య దోబూచులాడింది. ఆ తర్వాత అమ్మకాలు వెల్లువెత్తడంతో ఏ స్థాయిలోనూ కోలుకోలేకపోయింది. సెన్సెక్స్ ఒక దశలో 44 పాయింట్లు లాభపడగా, మరో దశలో 237 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద రోజంతా 281 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగిసినా, యూరప్ మార్కెట్లు లాభాల్లో ఆరంభమై, లాభాల్లోనే ముగిశాయి.

**నేడు మార్కెట్‌కు సెలవు**
రంజాన్ సందర్భంగా నేడు స్టాక్ మార్కెట్‌కు సెలవు. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈల్లో ట్రేడింగ్ జరగదు.

**ఆల్‌టైమ్ హైకి యాక్సిస్ బ్యాంక్ ....**

స్టాక్ మార్కెట్ నష్టపోయినా, యాక్సిస్ బ్యాంక్ షేర్ ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హై, రూ.826ను తాకింది. చివరకు 1.1 శాతం లాభంతో రూ.821 వద్ద ముగిసింది. ఈ బ్యాంక్‌తో పాటు మణప్పురం ఫైనాన్స్ కంపెనీ కూడా ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హై, రూ.141ను తాకింది. ఈ ఏడాది ఈ షేర్ ఇప్పటిదాకా 50 శాతానికి పైగా ఎగసింది. ఈ షేర్లతో పాటు 70కు పైగా షేర్లు ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైలను తాకాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్ , డీసీబీ బ్యాంక్, టైటాన్, హావెల్స్ ఇండియా, ఐసీఐసీఐ లాంబార్డ్, ఇంద్రప్రస్థ గ్యాస్, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీ సిమెంట్, ట్రెంట్, అదానీ గ్యాస్, ఎంబసీ ఆఫీస్ రీట్ ఈ జాబితాలో ఉన్నాయి. కాగా ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు రూ.40,000 కోట్ల మేర మూలధన నిధులు అందించే అవకా శాలున్నాయని, ఈ మేరకు జూలై 5న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రకటన ఉండొచ్చన్న వార్తలతో ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి.

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 2,625 |
| ఎన్‌ఎస్‌ఈ | 31,522 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 9,48,526 |
| ఎఫ్ఐఐ | -416 |
| డీఐఐ | -355 |

### ఎయిర్‌టెల్ ఆఫ్రికా ఐపీఓ @ రూ.5,189 కోట్లు

లండన్, నైజీరియా ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్టింగ్ !

టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ, ఎయిర్‌టెల్ ఆఫ్రికా ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ద్వారా కనీసం రూ.5,189 కోట్లు(75 కోట్ల డాలర్లు) సమీకరించనున్నది. నైజీరియా స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో పాటు, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో కూడా ఎయిర్‌టెల్ ఆఫ్రికా కంపెనీని లిస్టింగ్ చేయాలనుకుంటున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ఇక్కడి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు నివేదించింది. ఎయిర్‌టెల్ ఆఫ్రికా ఐపీఓ ద్వారా కనీసం 75 కోట్ల డాలర్లు సమీకరించనున్నామని ఎయిర్‌టెల్ పేర్కొంది. అదనంగా సబ్‌స్క్రిప్షన్ లభిస్తే, 15 శాతం మేర అదనపు నిధులను కూడా సమీకరిస్తామని వివరించింది. ఈ నిధులను రుణ భారం తగ్గించుకోవడానికి వినియోగిస్తామని పేర్కొంది.

### నిఫ్టీ 50

**టాప్ 10 గెయినర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| YESBANK | 153.35 | 2.61 |
| INFRATEL | 274.9 | 2.29 |
| NTPC | 135.1 | 1.5 |
| AXISBANK | 823.9 | 1.38 |
| COALINDIA | 263.7 | 1.07 |
| VEDL | 165.85 | 1 |
| WIPRO | 293.8 | 0.86 |
| LT | 1,572.25 | 0.82 |
| MARUTI | 7,080.65 | 0.82 |
| BAJFINANCE | 3,536.00 | 0.71 |

**టాప్ 10 లూజర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ZEEL | 346.25 | -3.7 |
| HEROMOTOCO | 2,759.00 | -2.86 |
| ASIANPAINT | 1,422.65 | -2.51 |
| DRREDDY | 2,657.95 | -2.43 |
| BPCL | 407.5 | -2.3 |
| HCLTECH | 1,090.00 | -2.26 |
| IOC | 165.9 | -2.24 |
| TCS | 2,188.00 | -1.63 |
| ULTRACEMCO | 4,694.00 | -1.43 |
| IBULHSGFIN | 799.5 | -1.4 |

## స్టార్టప్‌లకు 'జెమ్' ద్వారా రూ.275 కోట్ల ఆర్డర్లు

### ప్రభుత్వ ఈ మార్కెట్ ప్లేస్‌లో 1,862 స్టార్టప్‌లకు చోటు




**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గవర్నమెంట్ ఈ మార్కెట్ ప్లేస్‌లో (జెమ్) 1,862 స్టార్టప్‌లు నమోదయ్యాయని, ఈ వేదిక ద్వారా అవి ఇప్పటి వరకూ రూ.275 కోట్ల విలువైన 7,697 ఆర్డర్లను సాధించాయని డీపీఐఐటీ కార్యదర్శి రమేష్ అభిషేక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు తమకు కావాల్సిన సరుకులు, సేవలను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసుకునేందుకుగాను జెమ్‌ను 2016 ఆగస్ట్‌లో కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ వేదిక ద్వారా కొనుగోళ్ల వ్యయాలను తగ్గించాలన్నది ఆశయం. ప్రభుత్వం గుర్తించిన 16,105 స్టార్టప్‌లు ఇప్పటి వరకు 1,87,004 ఉద్యోగాలను కల్పించినట్టు అభిషేక్ తెలిపారు.

# ఇంధనాల రిటైలింగ్‌లో పోటీకి ఊతం

- పెట్రోల్ బంకు లైసెన్సు నిబంధనల సడలింపు మంచిదే
- పీఎస్‌యూల గుత్తాధిపత్యం తగ్గుతుంది: ఇక్రా నివేదిక

**న్యూఢిల్లీ:** పెట్రోల్ బంకుల ఏర్పాటు లైసెన్సుకు సంబంధించిన నిబంధనలను సడలించాలన్న నిపుణుల కమిటీ సిఫార్సులు అమలు చేస్తే ఇంధనాల రిటైలింగ్ రంగంలో పోటీకి తోడ్పాటు లభిస్తుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ఒక నివేదికలో పేర్కొంది. దీనివల్ల ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థల (ఓఎంసీ) గుత్తాధిపత్యానికి గండిపడుతుందని, అవి కూడా పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడగలదని తెలిపింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ మొదలైన ఇంధనాల రిటైల్ బంకులు ఏర్పాటు చేయాలనుకునే సంస్థలు హైడ్రోకార్బన్ ఉత్పత్తి, రిఫైనింగ్, పైప్‌లైన్స్, ద్రవీకృత సహజ వాయువు (ఎల్‌ఎన్‌జీ) టెర్మినల్స్‌పై రూ. 2,000 కోట్లు ఇన్వెస్ట్ చేయాల్సిందేనని నిబంధనలు ఉన్నాయి. అయితే, చమురు, గ్యాస్ రంగంలో అంత భారీగా ఇన్వెస్ట్ చేసే కంపెనీలకు ఇలాంటి రవాణా ఇంధనాల విక్రయ లైసెన్సులు పెద్ద ప్రోత్సాహకాలుగా అనిపించవని కేంద్ర ప్రభుత్వం అయిదుగురు సభ్యులతో నియమించిన నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. కాబట్టి రూ. 2,000 కోట్ల పెట్టుబడుల నిబంధనను ఎత్తివేస్తే వైవిధ్యంగా ఇంధన విక్రయ సేవలు అందించగలిగే సంస్థలకు అవకాశం లభించగలదని ఒక నివేదికలో సూచించింది. చాలా సున్నితమైన, నిత్యావసర ఉత్పత్తులైన ఇంధనాలను సురక్షితంగా విక్రయించేందుకు అనేక జాగ్రత్తలు అవసరమవుతాయి కాబట్టి దీని రిటైలింగ్ లైసెన్సులకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాల్సిందేనని పేర్కొంది. దరఖాస్తుదారు సామర్థ్యం, పూర్వ చరిత్ర ప్రాతిపదికగా లైసెన్సుల జారీ ఉండాలని సూచించింది. సిఫార్సుల ప్రకారం కొత్త సంస్థలు.. ఏడేళ్ల కాలంలో కనీసం 100 రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటు చేయాలి. వీటిలో 5 శాతం బంకులు నిర్దేశిత మారుమూల ప్రాంతాల్లో ఉండాలి.



**ఇప్పటిదాకా 9 ప్రైవేట్ సంస్థలకే లైసెన్సులు..**

2002లో ఇంధనాల రిటైలింగ్ రంగంలోకి ప్రైవేట్ సంస్థలను కూడా అనుమతించిన తర్వాత నుంచి ఇప్పటిదాకా కేవలం తొమ్మిది సంస్థలకు మాత్రమే అనుమతులు లభించినట్లు ఇక్రా పేర్కొంది. పీఎస్‌యూయేతర ఓఎంసీల మార్కెట్ వాటా 2013 మార్చి ఆఖరు నాటికి 6 శాతంగా ఉండగా.. 2019 మార్చి 31 నాటికి 10 శాతానికి చేరింది. ప్రైవేట్ రంగంలో ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ (గతంలో ఎస్సార్ ఆయిల్), రాయల్ డచ్ షెల్ సంస్థలు మాత్రమే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. రిలయన్స్‌కి సుమారు 1,400 అవుట్‌లెట్స్ ఉన్నాయి. నయారాకు 5,128 బంకులు, షెల్‌కు 145 బంకులు ఉన్నాయి. బ్రిటన్‌కు చెందిన బీపీ కొన్నాళ్ల క్రితమే 3,500 అవుట్‌లెట్స్ ఏర్పాటుకు లైసెన్సు దక్కించుకున్నా, ఇంకా కార్యకలాపాలు ప్రారంభించలేదు. అదానీ గ్రూప్‌తో కలిసి 1,500 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయనున్నట్లు గతేడాది ఫ్రాన్స్ దిగ్గజం టోటల్ వెల్లడించింది.

## ద్వితీయార్థంలో ఉక్కు డిమాండ్‌లో వృద్ధి..!

**ముంబై:** మౌలిక రంగానికి ప్రభుత్వం ఇస్తోన్న ప్రాధాన్యత ఆధారంగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఉక్కు డిమాండ్‌లో వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని ఆర్థిక సేవల సంస్థ ఇక్రా తన నివేదికలో పేర్కొంది. దేశీయంగా ఉత్పత్తి అవుతోన్న ఉక్కుకు.. దిగుమతి ఉక్కు ధరలకు మధ్య అంతరం ఉన్నందున 2019–20 రెండవ అర్ధభాగంలో అర్థవంతమైన స్థాయిలోనే ధరల పెరుగుదల ఉండేందుకు అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయంత్ రాయ్ అన్నారు. 2018–19 పూర్తి ఏడాదికి దేశీ ఉక్కు వినియోగం వృద్ధి 7.5 శాతానికి తగ్గిందని, అంతక్రితం ఏడాదిలో ఇది 7.9%గా ఉందని తెలిపారు. రెండవ అర్థభాగంలో ఆటో రంగం ఎదుర్కున్న ద్రవ్యలభ్యత సమస్య, ముడిచమురు ధరల పెరుగుదల ఇందుకు ప్రధాన కారణమని వివరించారు.



### కార్పొబ్రీఫ్

**నాట్కో:** అధిక రక్తపోటు చికిత్సలో వాడే బోసెంటన్ 32 ఎంజీ ట్యాబ్లెట్లకై ఏఎన్‌డీఏను యూఎస్‌ఎఫ్‌డీఏ వద్ద దాఖలు చేసింది.

### బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 33,080 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 31,500 | 0 |
| వెండి (కిలో) | 39,600 | ▲ 200 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 32,520 | ▲ 220 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,970 | ▲ 210 |
| వెండి (కిలో) | 39,600 | ▲ 200 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 32,520 | ▲ 220 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,970 | ▲ 210 |
| వెండి (కిలో) | 39,600 | ▲ 200 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 33,300 | ▲ 150 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,720 | ▲ 20 |
| వెండి (కిలో) | 37,700 | ▲ 100 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 33,210 | ▲ 110 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,890 | ▲ 100 |
| వెండి (కిలో) | 37,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 33,480 | ▲ 220 |
| బంగారం (22 క్యారెట్లు) | 30,970 | ▲ 210 |
| వెండి (కిలో) | 39,600 | ▲ 200 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 53.36 (రాత్రి 11.30కు) | $53.25 (సోమవారం ముగింపు) |
| బ్రెంట్ | 61.81 (రాత్రి 11.30కు) | $61.28 (సోమవారం ముగింపు) |

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 05-6-2019

| | |
|---|---|
| విశాఖ | 330-00 |
| చిత్తూరు | 378-00 |
| వరంగల్ | 328-00 |
| చెన్నై | 385-00 |
| ముంబై | 380-00 |
| విజయవాడ | 320-00 |
| నమక్కల్ | 375-00 |
| గోదావరి | 320-00 |
| **04-6-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 325-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.85 |

### ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 425.55 | 424.75 |
| ASIAN PAINT | 1421.5 | 1459.25 |
| AXIS BANK | 822.8 | 812.65 |
| BAJAJ AUTO | 2983.9 | 3034.6 |
| BAJAJ FINSE | 8312.85 | 8348.1 |
| BAJAJ FINAN | 3531.15 | 3511.05 |
| BHARTI AIRTEL | 352.4 | 352.75 |
| BPCL | 408.35 | 417.1 |
| BRITANNIA I | 2963.1 | 2970.2 |
| CIPLA LTD | 562.65 | 568.25 |
| COAL INDIA | 263.4 | 260.9 |
| EICHER MOTO | 20043.45 | 19948.15 |
| GAIL (INDIA | 358.25 | 357.45 |
| GRASIM INDU | 886.5 | 895.05 |
| HCL TECHNOL | 1085.85 | 1115.2 |
| HDFC LTD | 2223.95 | 2230.45 |
| HDFC BANK | 2452.3 | 2457.1 |
| HERO MOTOCO | 2752.7 | 2840.25 |
| HINDALCO | 197.8 | 199.4 |
| HUL | 1815.6 | 1839.7 |
| INDIABULLS | 796.45 | 810.85 |
| ICICI BANK | 419.1 | 422.9 |
| INDUSIND BA | 1638 | 1662.65 |
| BHARTI INFR | 274 | 268.75 |
| INFOSYS LIM | 735.3 | 744.65 |
| INDIAN OIL | 165.35 | 169.7 |
| ITC LTD | 279.25 | 278.55 |
| JSW STEEL | 274.2 | 274.55 |
| KOTAK MAHIN | 1531.35 | 1531.25 |
| LARSEN & T | 1569.8 | 1559.4 |
| MAHINDRA &M | 650.75 | 653.4 |
| MARUTI SUZU | 7051.8 | 7022.9 |
| NTPC LTD | 135.05 | 133.1 |
| ONGC | 170.6 | 172.15 |
| POWER GRID | 192.95 | 193.05 |
| RIL | 1351.65 | 1360.2 |
| SBI | 352.4 | 355.45 |
| SUN PHARMA | 411.15 | 416.8 |
| TATA MOTORS | 173.25 | 174.5 |
| TATA STEEL | 497.65 | 497.65 |
| TCS | 2183.1 | 2242.3 |
| TECH MAHIND | 748.3 | 757.6 |
| TITAN COMPA | 1248 | 1266.25 |
| ULTRATECH C | 4692 | 4762.3 |
| UPL LIMITED | 1010.95 | 1007.1 |
| VEDANTA LIM | 165.9 | 164.2 |
| WIPRO LTD | 293.75 | 291.3 |
| YES BANK LI | 152.8 | 149.45 |
| ZEE ENTERTA | 346.05 | 359.55 |

### నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

| | | |
|---|---|---|
| ABB INDIA L | 1561.65 | 1593.35 |
| ACC LIMITED | 1657.65 | 1725.2 |
| AMBUJA CEME | 226.95 | 237.15 |
| ASHOK LEYLA | 93.05 | 91.85 |
| BAJAJ HOLDI | 3503.35 | 3505.3 |
| BANDHAN BAN | 592.1 | 599.75 |
| BANK OF BAR | 132.6 | 131.55 |
| BHEL | 70.9 | 71.55 |
| BIOCON LIMI | 540.65 | 553.4 |
| BOSCH LIMIT | 17401.3 | 17404.85 |
| CADILA HEAL | 257.3 | 252.85 |
| COLGATE PAL | 1149.4 | 1168.8 |
| CONTAINER C | 537.65 | 530.9 |
| DABUR INDIA | 405.55 | 408.8 |
| DLF LIMITED | 195.45 | 196.15 |
| AVENUE SUPE | 1333.05 | 1340.3 |
| GENERAL INS | 223.8 | 229.9 |
| GODREJ CONS | 700.4 | 706.85 |
| HAVELLS IND | 779.9 | 769.95 |
| HDFC AMC LI | 1810.4 | 1784.25 |
| HDFC LIFE I | 442.7 | 444 |
| HINDUSTAN P | 317.85 | 324.75 |
| HINDUSTAN Zinc | 246.65 | 248.55 |
| ICICI LOMBA | 1243.85 | 1220.5 |
| ICICI PRU L | 394.8 | 398.2 |
| VODAFONE ID | 13.85 | 14 |
| INTERGLOBE | 1686.3 | 1691.35 |
| L&T FINANCE | 136.4 | 136.2 |
| LUPIN LIMIT | 740.1 | 745.25 |
| MARICO LIMI | 376.65 | 377.45 |
| UNITED SPIR | 571.8 | 557.6 |
| MOTHERSON S | 114.85 | 113.75 |
| MRF LTD | 57382.45 | 56002.45 |
| NHPC LTD | 25 | 24.85 |
| THE NEW IND | 160.85 | 163.25 |
| NMDC LTD. | 103.6 | 103.8 |
| ORACLE FIN | 3377.2 | 3435.95 |
| PAGE INDUST | 20115.3 | 21102 |
| PIRAMAL ENT | 2209.2 | 2223.3 |
| PETRONET LN | 246.75 | 245.5 |
| P&G HYGIENE | 10869.2 | 10969.6 |
| PIDILITE IN | 1279.5 | 1295.7 |
| STEEL AUTHO | 50.5 | 51.25 |
| SBI LIFE IN | 698.4 | 695.6 |
| SHREE CEMEN | 21200.5 | 21877.65 |
| SIEMENS LTD | 1267.25 | 1280.05 |
| SHRIRAM TRA | 1165.4 | 1169.55 |
| UNITED BREW | 1339.65 | 1333.5 |

# మార్కెట్లోకి ఫోర్డ్ 'ఎకోస్పోర్ట్ 2019'

- ధరల శ్రేణి రూ.7.69 లక్షల నుంచి రూ.11.33 లక్షలు
- రూ.57,400 వరకు తగ్గిన ధర



**న్యూఢిల్లీ:** ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'ఫోర్డ్ ఇండియా' తాజాగా తన పాపులర్ కాంపాక్ట్ ఎస్‌యూవీ 'ఎకోస్పోర్ట్'లో నూతన వెర్షన్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. పెట్రోల్, డీజిల్ ఇంజిన్లతో అందుబాటులోకి వచ్చిన ఈ 2019 ఎడిషన్ ధరల శ్రేణి రూ.7.69 లక్షల నుంచి రూ.11.33 లక్షలుగా నిర్ణయించింది. పెట్రోల్ వేరియంట్ 1.5లీటర్ల ఇంజిన్, 1–లీటర్ ఎకోబోస్ట్ ఇంజిన్ ఆప్షన్లతో లభిస్తుండగా.. డీజిల్ వేరియంట్ 1.5లీటర్ల ఇంజిన్‌తో అందుబాటులోకి వచ్చింది. 'థండర్ ఎడిషన్' డీజిల్ ఇంజిన్ ధరల శ్రేణి రూ.10.18 లక్షల నుంచి రూ.10.68 లక్షలు. ఇక గతేడాది ఎకోస్పోర్ట్ వెర్షన్‌తో పోల్చితే ఈ నూతన ఎడిషన్ ధర రూ.57,400 వరకు తగ్గినట్లు కంపెనీ ప్రకటించింది. ట్రిమ్ స్థాయి ఆధారంగా రూ.8,300 నుంచి గరిష్టంగా 57,400 వరకు తగ్గినట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఫోర్డ్ ఇండియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ మెహరోత్రా మాట్లాడుతూ.. 'ఉత్పత్తి అభివృద్ధి పరంగా బలమైన బృందం తమ పనితీరును ప్రదర్శించడం, కొనసాగుతున్న స్థానికీకరణ కృషి ఫలితంగా ఈ నూతన వెర్షన్ విడుదలైంది' అని అన్నారు.

# రేటు తగ్గింపు ఖాయం!

### రేపు ఆర్‌బీఐ పాలసీ సమావేశం

**ముంబై:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష గురువారం జరగనుంది. గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో జరగనున్న ఈ పరపతి కమిటీ సమావేశం సందర్భంగా రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు–ప్రస్తుతం 6%) 35 బేసిస్ పాయింట్లవరకూ తగ్గించే అవకాశం ఉందన్న అంచనాలున్నాయి. శక్తికాంత్ దాస్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇప్పటికే ఆర్‌బీఐ రెపోరేటు అరశాతం తగ్గిన సంగతి తెలిసిందే. రేటు తగ్గింపు ఖాయమన్న అంచనాలకు ప్రధాన కారణాలను చూస్తే...

- అటు వినియోగదారుల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం, ఇటు టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం ప్రభుత్వం, ఆర్‌బీఐ నిర్దేశిత 4 శాతం లోపు కొనసాగుతోంది.
- మరోవైపు పారిశ్రామిక ఉత్పత్తిలో వృద్ధి ధోరణులు పూర్తిగా ఆగిపోయింది. ఇంకా చెప్పాలంటే మార్చిలో వృద్ధిలేకపోగా క్షీణతలోకి పారిశ్రామిక రంగం జారింది. తయారీ, సేవల రంగాలు మందగమనంలోకి జారిపోయాయి.
- గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో (జనవరి–మార్చి) భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఐదేళ్ల కనిష్టస్థాయి 5.8 శాతానికి పడిపోయింది.
- ఆయా అంశాల నేపథ్యంలో వృద్ధిరేటు స్పీడ్‌కు రెపో రేటు తగ్గింపునకే అవకాశాలు ఉన్నాయన్నది మెజారిటీ వర్గాల విశ్వాసం.




Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.


B NEW
B NEW
SMART MOBILE STORE
ఈద్ ముబారక్
ఈద్ సంబరాల్ని చేసుకుందాం
మన బిన్యూ ఆఫర్లతో...
mi
Redmi Note 7 Pro
Redmi 6A
Redmi Y3
Redmi 7S
ALL MODELS AVAILABLE
EXCHANGE
OFFER
అదనపు ఖర్చు లేకుండా ఎక్స్ఛేంజ్ లో కొత్త మొబైల్ తీసుకెళ్లండి
ఈ అద్భుతమైన ఆఫర్ ఒక్కరోజు మాత్రమే
*On selected mobiles
T&C Apply
₹1
రూపాయి కే ఇన్సూరెన్స్
Paytm
Get 15% cashback
Finance Available On Accessories
0% INTREST DOWN PAYMENT
BAJAJ FINSERV
TVS CREDIT
HDFC BANK
IDFC FIRST Bank
HOME CREDIT
మా వద్ద ఇన్సూరెన్స్ మరియు ఫైనాన్స్ సదుపాయం కలదు
SAMSUNG Summer Surprise
Galaxy A50
Galaxy A70
Bumper Prize
1(N) Samsung 4K Smart QLED TV(50")
Mega Prize
7(N) Galaxy S10+
Other Prizes
32(N) Samsung Smart LED TV
60(N) Galaxy A10
460(N) Samsung Level U
900(N) Samsung Power Bank
Offer valid from 1st June 2019 to 30th June 2019.
vivo
Y17
Jio ₹4,000 Cashback
ALL MODELS AVAILABLE
oppo
A5 ₹12990
₹11990
F11Pro ₹22990
₹20990
ALL MODELS AVAILABLE
₹4000 WORTH
BLUETOTH HEADSET FREE
Mi A2
BEST PRICE
mobiistar
X1 Notch
POWERBANK FREE
ALL MODELS AVAILABLE
realme
3 Pro
ALL MODELS AVAILABLE
LAVA
POWERBANK FREE
ALL MODELS AVAILABLE
iPhone
6S
BEST PRICE
4G SmartPhone
2GB + 16GB
కేవలం ₹4786
4G SmartPhone
1GB + 8GB
కేవలం ₹3786
4G SMART PHONE
కేవలం ₹2986
3 Dual Sim Mobile
Lunch Box ఉచితం
కేవలం ₹1886
FAN+ PHONE
కేవలం ₹1486
జోడి ఆఫర్
కేవలం ₹1386
Iron Box ఉచితం
కేవలం ₹986
16GB MEMORY CARD
ఉచితం
కేవలం ₹886
Dual Sim + Camera
కేవలం ₹444
DEALS OF THE DAY
32GB MEMORY CARD CLASS10
₹1499
కేవలం ₹386
Bluetooth Earphones
Flat 85% OFF
₹4000
కేవలం ₹686
True Wireless Earbuds
₹2600
కేవలం ₹786
SPECIAL OFFER @86/-
16GB MEMORY CARD
కేవలం ₹186
Wired Headset
కేవలం ₹286
oraimo BLUETOOTH
కేవలం ₹386
Bluetooth Speaker
కేవలం ₹486
Bluetooth Headphone
కేవలం ₹586
POWERBANK 10000mAh
కేవలం ₹686
Bluetooth Neckband
కేవలం ₹786
B NEW
బి న్యూ
SMART MOBILE STORE
రామ మందిరం ఎదురుగా, ఏలూరు రోడ్, విజయవాడ. | విజయ టాకీస్ వద్ద, సూర్యారావుపేట, విజయవాడ,
బెంజ్ సర్కిల్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ, | బోస్ బొమ్మ సెంటర్, మెయిన్ రోడ్, తిరువూరు.
15-30-1 పార్క్ రోడ్డు, మార్కెట్ సెంటర్ దగ్గర, గుడివాడ.
Helpline
040 - 4849 1111

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ బుధవారం
5-6-2019

పోరాటం

# లైఫ్ ఈజ్ వండర్‌ఫుల్

**మెరుగైన చికిత్స కోసం జర్మనీ వెళ్లినప్పుడు అక్కడి వైద్యులు సుస్మితకు 'సినాథెన్' అనే పరీక్ష చేశారు. స్టెరాయిడ్స్ లేకుండా జీవితాన్ని కొనసాగించే అవకాశాలు ఉన్నదీ లేనిదీ తేల్చి చెప్పే పరీక్ష అది. ఆ పరీక్షను సుస్మితకు రెండుసార్లు చేసి వైద్యులు చెప్పిందేమిటంటే... ఆమె ఇక ఎప్పటికీ స్టెరాయిడ్స్ వాడుతూనే ఉండాలని! వాడకుంటే బతకడం కష్టమని!!**



సెలబ్రిటీల జీవితాల్లోని గ్లామర్ ఒక్కటే మనకు కనిపిస్తుంది. తమ జీవితంలోని కల్లోల సమయాల్లో వాళ్లు చేసిన పోరాటం గురించి వాళ్లకై వాళ్లు బయట పెడితే తప్ప ప్రపంచానికి ఎప్పటికీ తెలిసే అవకాశం లేదు. నాలుగేళ్ల క్రితం దీపికా పడుకోన్ తను డిప్రెషన్‌లోకి వెళ్లిన బాలీవుడ్ ప్రారంభపు రోజుల గురించి బహిర్గత పరిచినప్పుడు అభిమానులు నిర్ఘాంతపోయారు. ఇంత చలాకీగా, చక్కగా కెరీర్‌లో ఎదుగుతున్న అమ్మాయి జీవితంలోనూ డిప్రెషన్ ఉందా అని ఆశ్చర్యపోయారు. అయితే అంతకన్నా ఆశ్చర్యం ఆ డిప్రెషన్ నుంచి బయటపడేందుకు ఆమె చేసిన పోరాటం. అలాంటి స్ఫూర్తిదాయకమైన పోరాటమే 'విశ్వసుందరి' సుస్మితా సేన్ జీవితంలో ఉందని 'ఇండియా టుడే'కి ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడయింది.

2014లో బెంగాలీ సినిమా 'నిర్బాక్' చిత్రీకరణ పూర్తి అవుతుండగా సుస్మిత ఒక్కసారిగా కుప్పకూలిపోయి, తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యారు. అలా ఎందుకయ్యిందో వెంటనే ఎవరూ తెలుసుకోలేక పోయారు. అనేక నిర్ధారణ పరీక్షలు జరిపాక ఆమె దేహంలో అడ్రినల్ గ్రంథి.. కార్టిసాల్‌ను ఉత్పత్తి చెయ్యడం ఆగిపోయిందని వైద్యులు కనిపెట్టారు. కార్టిసాల్ అనేది ఒక ఉత్ప్రేరక హార్మోన్. రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను, జీర్ణక్రియను నియంత్రిస్తుంది. నొప్పుల్ని, వాపుల్ని నివారిస్తుంది. జ్ఞాపకశక్తికి సహాయకారిగా ఉంటుంది. దేహంలోని ఉప్పును, నీటిని సమన్వయపరిచి రక్తపోటును అదుపులో ఉంచుతుంది. మనిషి ఆరోగ్యానికి ఇంత కీలకమైన కార్టిసాల్‌ను అడ్రినల్ గ్రంథులు మూత్రపిండాల పైభాగంలో ఉంటాయి. అవి కార్టిసాల్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కోల్పోవడం వల్లనే సుస్మిత అకస్మాత్తుగా పడిపోయి, ఆ వెంటనే పూర్తి అనారోగ్యంలోకి వెళ్లారు. కారణం తెలిసిన వెంటనే వైద్యులు ఆమెకు చికిత్స మొదలు పెట్టారు. 'హైడ్రోకార్టిసన్' అనే స్టెరాయిడ్‌ను ఇచ్చి, ప్రతి ఎనిమిది గంటలకొక ఇంజెక్షన్ తీసుకోవాలనీ లేకుంటే కోలుకోవడం కష్టం అని చెప్పారు. ఆ తర్వాత ఇంజెక్షన్‌లకు ప్రత్యామ్నాయంగా మాత్రల్ని సిఫారసు చేశారు. దాదాపు రెండేళ్ల పాటు (2015–16) ఆ స్టెరాయిడ్‌ను వాడారు సుస్మిత. ఆ సమయంలో ఆమె నరకం అనుభవించారు. అంతకంటే ఎక్కువగా స్టెరాయిడ్ దుష్ప్రభావంతో శారీరకంగా, మానసికంగా ఆమె నలిగిపోయారు. చర్మం మునుపటి మెరుపు కోల్పోయింది. జుట్టు ఊడిపోవడం మొదలైంది. ఒంట్లో స్టెరాయిడ్ నిల్వలు పేరుకుని పోయి ముఖం చిన్నబోయింది. మెరుగైన చికిత్స కోసం జర్మనీ వెళ్లినప్పుడు అక్కడి వైద్యులు సుస్మితకు 'సినాథెన్' అనే పరీక్ష చేశారు. స్టెరాయిడ్స్ లేకుండా జీవితాన్ని కొనసాగించే అవకాశాలు ఉన్నదీ లేనిదీ తేల్చి చెప్పే పరీక్ష అది. ఆ పరీక్షను సుస్మితకు రెండుసార్లు చేసి వైద్యులు చెప్పిందేమిటంటే... ఆమె ఇక ఎప్పటికీ స్టెరాయిడ్స్ వాడుతూనే ఉండాలని!

ఆ మాటతో సుస్మిత ప్రపంచం తలకిందులైపోయింది. రోజుకు 60 మిల్లీ గ్రాముల స్టెరాయిడ్స్‌ను వైద్యులు సిఫారసు చేశారు. శక్తి మరీ సన్నగిల్లుతున్నప్పుడు ఆ మోతాదును 100 మిల్లీ గ్రాముల వరకు పెంచుకోవచ్చని చెప్పారు. ప్రెస్ కాన్ఫరెన్సులు అవీ ఉన్నప్పుడు మోతాదును పెంచి వేసుకునేవారు సుస్మిత. ఆ మోతాదుల ప్రభావంతో ఆమె కంటి చూపు మందగించింది. దేహంలోని శక్తి హరించుకుపోయింది. ఆ సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో తన గురించి మొత్తం రాసుకోవాలని భావించి కూడా ఆఖరు నిముషంలో ఆ ప్రయత్నం మానుకున్నారు. 'సుస్మితాసేన్ ఇలాక్కాదు తన అభిమానులకు గుర్తుండి పోవాలసింది' అనుకున్నారు. బతుకును ఇచ్చే నెపంతో చావుకు దగ్గర చేస్తున్న స్టెరాయిడ్‌తో ఫైట్ చెయ్యాలనుకున్నారు. డాక్టర్లు గురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేకంగా ఏ పనీ చేయకూడదని, అలా చేస్తే బ్రెయిన్‌కు రక్తం సరఫరా అవదని, అది మరింత

> అబుధాబి నుంచి దుబాయ్ వెళుతుండగా.. అబుధాబి డాక్టర్ నుంచి ఫోన్ వచ్చింది.. 'సుస్మితా మీరు ఈ పూట డోస్ వేసుకున్నారా?'' అని. ''లేదు. ఏదైనా తిని వేసుకుంటాను'' అన్నారు సుస్మిత.

ప్రమాదం అని డాక్టర్లు హెచ్చరించినప్పటికీ సుస్మిత వినలేదు. తన దేహంలో ఏం జరుగుతోందో తనకై తను తెలుసుకునే ప్రయత్నం చేశారు. తన అనారోగ్యంపై యోగాను ప్రయోగించుకున్నారు. 2016 అక్టోబర్ నాటికి మరీ శిథిలమైపోయారు. వెంటనే ఆమెను అబూధాబి ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ కూడా సుస్మితకు సినాథెన్ పరీక్ష జరిపి ఆమెను డిశ్చార్జ్ చేశారు. అక్కడి నుంచి దుబాయ్ వెళుతుండగా.. అబుధాబి డాక్టర్ నుంచి ఫోన్ వచ్చింది.. 'సుస్మితా మీరు ఈ పూట డోస్ వేసుకున్నారా?'' అని. ''లేదు. ఏదైనా తిని వేసుకుంటాను'' అన్నారు. సుస్మిత. ''అక్కర్లేదు. మీరిక పిల్స్ వేసుకోనక్కర్లేదు'' అన్నాడు డాక్టర్. సుస్మిత ఆశ్చర్యపోయి, ''ఎందుకు?'' అని అడిగారు. అప్పుడు డాక్టర్ చెప్పిన మాటకు ఆమె కొన్ని క్షణాల వరకు మామూలు మనిషి కాలేకపోయారు. డాక్టర్‌ను అడిగి మళ్లీ అదే మాట చెప్పించుకున్నారు. ''మీరిక కార్టిసాల్ పిల్స్ వేసుకోనక్కర్లేదు సుస్మితా. ఎందుకంటే మీ అడ్రినల్ గ్రంథులు కార్టిసాల్‌ను తిరిగి ఉత్పత్తి చెయ్యడం మొదలు పెట్టాయి'' అని చెప్పారు డాక్టర్. ఒక విధంగా అది వండర్. ఎందుకంటే తన ముప్పై ఐదేళ్ల ప్రాక్టీస్‌లో ఎప్పుడూ అలాంటి అనుభవాన్ని చూడలేదట ఆ డాక్టర్. ఇక సుస్మిత అయితే తన అదృష్టాన్ని తనే నమ్మలేకపోయారు. 2016 అక్టోబర్‌లోనే మందులు మానేశారు. మానేశాక కొంతకాలం మానడం వల్ల సంభవించే దుష్పరిణామాలు ఆమెను బాధించినా, తట్టుకుని నిలబడ్డారు. ఈ విషయాలన్నీ ఇంటర్వ్యూలో చెబుతూ.. 'వైద్యులు చెయ్యొద్దన్న దానిని చెయ్యడం నా ఉద్దేశం కాదు. మరణాన్ని తప్పించుకునే పోరాటప్రయత్నంలో నేను ఎలా మార్పు చెందుతానో అలా మారడానికి నా మనసు అంగీకరించ లేదు కాబట్టి.. వైద్యులు వారిస్తున్నా నేను చెయ్యాలనుకున్నట్లుగా యోగా చేశాను. జిమ్నాస్టిక్స్‌ని కూడా మొదలు పెట్టాను'' అన్నారు సుస్మిత. ●




**ప్రకృతిలోని మనిషి.. పొత్తిళ్లలోని బిడ్డలా పెరగాలి తప్ప 'కృత్రిమ' వర్ణాల కాలుష్యపు ఉయ్యాలలో ఊపిరి పీల్చుకుంటూ ఎదగకూడదు. బిడ్డ దరిదాపుల్లో సింథటిక్ క్లాత్ లేకుండా, సహజమైన దారపు పోగుల వస్త్రాలను వెయ్యడమూ పర్యావరణ పరిరక్షణే! అప్పుడిక బిడ్డకే కాదు.. భూగోళానికీ మన ఇల్లు 'పొత్తిల్లు' అవుతుంది. స్వచ్ఛమైన జోలపాట అవుతుంది.**

# లాలిజో.. లాలీజో...

పాపాయికి పాలు పట్టి, ఉయ్యాలలో పడుకోబెట్టింది మృదుల. అప్పటి వరకు తల్లిని చూస్తూ తల్లిముఖాన్ని తాకడానికి గాల్లో చేతులూపుతూ బోసినవ్వులు చిందిస్తోంది. ఉయ్యాలలో పడుకోబెట్టి తను వెనుదిరిగిన మరుక్షణం నుంచే పాపాయి ముఖం మారిపోయింది. దిగులుగా, చికాగ్గా ముఖం పెట్టి గట్టిగా ఏడుపందుకుంది. ఎక్కువ సేపు ఏడిస్తే ఆస్మా ఎక్కువవుతుందేమోనని ఆదుర్దాగా వచ్చి బిడ్డను ఎత్తుకుంది మృదుల. అప్పటికే పాపాయి ముఖం ఎర్రగా కందిపోయింది. తల్లికి హత్తుకుని పోయి రెండు మూడు నిమిషాలకు ఏడుపు ఆపేసి మామూలయింది.

''ఉయ్యాలలో పడుకోబెడితే ఏడుస్తోంది. ఇప్పుడిప్పుడే బోర్లా పడుతోంది. మంచం మీద పడుకోబెట్టి నేను కిచెన్‌లోకి వెళ్తే కిందపడుతుందేమోనని భయమేస్తోంది'' అన్నది మృదుల అత్తగారి వైపు చూస్తూ నిస్సహాయంగా. ''పిల్లలు తల్లి ముఖం గుర్తుపట్టడం మొదలైతే అంతేలే... తల్లి కనిపించకపోతే ఏడుస్తారు'' అని తేలిగ్గా అనేసింది మృదుల అత్తగారు. ''ఉయ్యాల నచ్చడం లేదేమో'' నసిగింది మృదుల. అదేమాట గట్టిగా అంటే ఆమెకు కోపం వస్తుందేమోనని. ''పిల్లలు ఉయ్యాల్లో వేస్తే కంటినిండా నిద్రపోతారు. పొద్దున స్నానం చేయించి పాలు పట్టి ఉయ్యాల్లో వేస్తే మధ్యాహ్నం వరకు కదిలేవాళ్లు కాదు. ఈ పాప ఉయ్యాలంటేనే గిట్టనట్లు మరీ ఎక్కువ ఏడుస్తోంది. చిన్నగా అలవాటవుతుందిలే. మీ పుట్టింట్లో ఉయ్యాలే అలవాటు చేయకపోతిరి'' అన్నదామె కొంచెం విసుగ్గా.

***

మృదులకు తెలియనిది, అత్తగారికి అర్థం కానిది, పాపాయి చెప్పలేనిది ఒక్కటే. చీర ఉయ్యాలలో పాపాయికి ఊపిరాడడం లేదేమోనని మృదులకు చిన్న సందేహం వచ్చింది. ''చంటిపిల్లలు ఉయ్యాల తొట్టికంటే చీర ఉయ్యాలనే ఇష్టపడతారు'' అంటూ మృదుల సందేహాన్ని కొట్టి పారేసింది అత్తగారు.

ఆమెతో వాదించడం ఎందుకులే అనుకుంటూ మృదుల పాపాయి ఒంటిని తడిమి చూసి మళ్లీ పడుకోబెట్టింది. పాపాయి ఒంటికి తరచూ ర్యాష్ వస్తోంది. డాక్టర్ ఇచ్చిన క్రీమ్‌లు రాసినప్పుడు తగ్గుతున్నాయి. మరో రెండురోజులకే మరోచోట పుట్టుకొస్తున్నాయి. పాపాయి పుట్టినప్పుడు ఏ కంప్లయింటూ లేకుండా హెల్దీగానే ఉంది. నెలలు నిండేకొద్దీ ఒక్కో సమస్య బయటపడుతోంది.

### ప్రకృతికి దూరమయ్యాం

చంటిపిల్లలు చీర ఉయ్యాలను ఇష్టపడే మాట నిజమే. అయితే ఆ చీర ఉయ్యాల వేయాల్సింది కాటన్‌చీరతో మాత్రమే. సింథటిక్ క్లాత్ నుంచి గాలి ప్రసరించదు. సింథటిక్ క్లాత్‌తో ఉయ్యాల కట్టి పాపాయిని పడుకోబెడితే ఊపిరాడక ఏడుస్తారు. ఉయ్యాలకే కాదు, పాపాయి పక్కదుస్తులు కూడా మెత్తటి కాటన్‌వే వాడాలి. నేచురల్ కలర్స్ అద్దినవైతేనే ఆరోగ్యం. రసాయనిక రంగుల గాఢత వల్ల పసిఒళ్లు దద్దుర్లు తేలుతుంది. ఆర్గానిక్ కలర్స్ (సహజమైనవి)తో తయారైన పక్క దుస్తులకు వాడడం సాధ్యం కాకపోతే కనీసం తెల్లటి పక్కదుస్తులను వాడడం మంచిది. కృత్రిమత్వం కలిగించే హాని చంటిబిడ్డల మీద వెంటనే ప్రతిఫలిస్తుంది. చంటి పిల్లలలో ఎక్కువమంది ఆస్మా బారిన పడడానికి కూడా కెమికల్ కలర్సే ప్రధాన కారణం. పెద్దవాళ్లలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది కాబట్టి కృత్రిమత్వపు ప్రతికూలతలు కొన్ని దశాబ్దాల తర్వాత గానీ బయటపడవు. మనిషి ప్రకృతికి దూరంగా పరుగులు తీస్తున్న ఫలితమే ఇదంతా అంటారు ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త పురుషోత్తమరెడ్డి. ''సింథటిక్ ఫ్యాబ్రిక్, సింథటిక్ కలర్స్... మన ఆరోగ్యానికే కాదు పర్యావరణానికి కూడా హాని చేస్తాయి. ఫ్యాబ్రిక్‌కు సింథటిక్ డై వేసేటప్పుడు వాటర్ పొల్యూషన్, ఎయిర్ పొల్యూషన్ యథేచ్ఛగా జరిగిపోతాయి. ఆ ఫ్యాక్టరీల్లో పనిచేసే వారిని కూడా ఆరోగ్య సమస్యలు వేధిస్తాయి. అరవై ఏళ్ల క్రితం మనదేశంలో సింథటిక్ కలర్స్ ఊసే లేదు, దుస్తులన్నీ నాచురల్ ఫైబర్‌తో నేచురల్ కలర్స్‌తో తయారైనవే ఉండేవి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వేగంగా జరిగిన పారిశ్రామికీకరణలో ఆర్గానిక్ ఉత్పత్తులకు బదులు రసాయన రంగులు, రసాయన ఉత్పత్తుల వాడకం పెరిగింది'' అన్నారాయన.



### ఫ్యాక్టరీ దారం

మనకు మార్కెట్‌లో దొరికే దుస్తుల్లో చాలా మటుకు కృత్రిమమైనవే. ఈ దుస్తుల్లో వాడే సింథటిక్ దారం... పొలంలో పండిన దారం కాదు. ఫ్యాక్టరీలలో రసాయనాల సమ్మేళనంతో చిక్కటి ద్రవాన్ని తయారు చేసి సన్నని చిల్లులున్న జల్లెడ నుంచి బయటకు తీస్తారు. ఇది గాలికి ఆరి సన్నని దారమవుతుంది. ఇలా తయారైన దారాలకు రంగులు కూడా రసాయనాలతో తయారైనవే అద్దుతారు. మనం మోజు పడి కొనుక్కునేది వీటినే. మెషినరీ మీద నడిచే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ అభివృద్ధి అయినప్పటి నుంచి ఆ పోటీ తట్టుకోలేక పత్తి, ఉన్ని నుంచి తయారైన నేచురల్ ఫైబర్‌కు కూడా కృత్రిమ రంగులనే వాడుతున్నారు. కంచి, ధర్మవరం వంటి బాగా పేరుమోసిన చేనేతల్లో మాత్రం సహజరంగులనే వాడుతున్నారు. మన రాష్ట్రంలో కలంకారీ అద్దకం పూర్తిగా సహజరంగుల సమ్మేళనంగా ఉండేది. ఇప్పుడు అందులో కూడా కొందరు కెమికల్ కలర్స్ వాడుతున్నట్లు నిర్ధారణ అవుతోంది. నేచురల్ కలర్స్ ఖర్చు ఎక్కువ, దాంతో ఆ దుస్తుల ధర కూడా ఎక్కువగానే ఉంటోంది.



### సహజమైన ఫ్యాబ్రిక్స్

సహజ రంగుల తయారీలో చెట్ల ఆకులు, పూలు, పండ్లు, గింజలు, బెరడు, వేళ్లు అన్నీ వాడతారు. ఇవి ఒక్కొక్కటి ఒక్కో రంగునిస్తాయి. వీటితో తయారైన దుస్తులు వేసుకుంటే ఏ దుష్ప్రభావాలూ రావు. పైగా వాతావరణం కలుషితం కాదు. మన దేశంలో దాదాపుగా ప్రతిరాష్ట్రంలో సహజరంగులతో తయారయ్యే ఫ్యాబ్రిక్స్ అందుబాటులో ఉన్నాయి. రాజస్థాన్‌లోనే వేల యూనిట్‌లున్నాయి. ఇవన్నీ ఎకో ఫ్రెండ్లీ, హ్యూమన్ స్కిన్ ఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్స్.

### మనకు సాధ్యమే

నాచురల్ కలర్స్‌ను కాటన్ వంటి నాచురల్ ఫ్యాబ్రిక్స్‌కు మాత్రమే కాక నైలాన్, పాలియెస్టర్ వంటి ఫ్యాబ్రిక్‌లకు కూడా వాడవచ్చు. వీటి ధర నాచురల్ ఫైబర్‌కు నాచురల్ కలర్స్ వాడిన వాటి కంటే తక్కువే ఉంటుంది. ఇప్పుడు సహజమైన రంగుల వాడకం క్రమంగా పెరుగుతోంది. వీటి ప్రాముఖ్యత తెలిస్తే బడ్జెట్ చూసుకుని ఖర్చు చేసే మధ్యతరగతి మహిళ కూడా సింథటిక్ కలర్ చీరలు రెండు కొనే బదులు ఒక్కటైనా సరే నాచురల్ కలర్స్ చీరనే కొంటుంది.





### ప్రకృతిని సవాల్ చేయొద్దు

మనది కలర్‌ఫుల్ కంట్రీ. ప్రకృతి ప్రధానమైన జీవనం సాగించే వాళ్లం. అడవిలో జీవించే వాళ్లు అడవిని తల్లిగానూ, నది పరివాహక ప్రాంతాల్లో ఉండేవాళ్లు నదీమ తల్లి అని, సముద్రం మీద ఆధారపడి జీవించేవాళ్లు సముద్రాన్నే తల్లిగా పిలుచుకునే వాళ్లు. తల్లి అంటే పిల్లల అవసరాల మేరకు అన్నీ అందిస్తూ పోషించే ఒడి కనుకనే ఇలా పిలుచుకోవడం. మొదట్లో మనం ప్రకృతి మీద ఆధారపడి జీవిస్తుంటే పాశ్చాత్య దేశాలు ప్రకృతిని సవాల్ చేసేవి. పారిశ్రామిక విప్లవం, ప్రింటింగ్ ప్రెస్, కొత్త ఇన్వెన్షన్లు అన్నీ కలిసి వారికి మితిమీరిన ఆత్మవిశ్వాసాన్నిచ్చాయి. ప్రకృతిపై ఆధిపత్యం సాధించాలన్న తపన వారిలో కనిపించేది. దాదాపుగా మూడువందల ఏళ్లకంటే ముందు నుంచే వాళ్లు రసాయనాలతో మమేకమై జీవిస్తున్నారు. దాని పర్యవసానం కూడా ముందుగా అనుభవంలోకి వచ్చింది అక్కడే. 1960లలో అమెరికాలో 'రేసెల్ కార్సన్' అనే మహిళా శాస్త్రవేత్త డిడిటి ప్రభావాన్ని వివరిస్తూ రాసిన 'ద సైలెంట్ స్ప్రింగ్' ఆ దేశాల్లో విప్లవం తెచ్చింది. ఆ కదలికతోపాటు సింథటిక్ కలర్స్ ఫ్యాబ్రిక్స్ కారణంగా స్కిన్ కేన్సర్ రావడం వంటి అనుభవాలతో ఇప్పుడు వారికి పర్యావరణ హిత ఉత్పత్తుల మీద ఆసక్తి పెరిగింది. వాళ్ల అనుభవాల నుంచి మనమూ పాఠాలు నేర్చుకోవాలి.

**– డాక్టర్ పురుషోత్తమ రెడ్డి,** పర్యావరణ శాస్త్రవేత్త

### సహజమే సురక్షితం

సహజమైన రంగులపై మన దేశంలో చైతన్యం తక్కువే. చేనేతను పరిరక్షించే ప్రయత్నం మాత్రం కొంత వరకు జరుగుతోంది. అంతే తప్ప సింథటిక్ వాడకాన్ని తగ్గించడం లేదు. యూరోపియన్లు మాన్‌మేడ్ ఫైబర్‌ను, మాన్‌మేడ్ కలర్స్‌ను స్వచ్ఛందంగా నిషేధిస్తున్నారు. సింథటిక్ రంగుల దుస్తులు వాడితే స్కిన్ కేన్సర్ వచ్చే అవకాశముందని నిర్ధారణ అయినప్పటి నుంచి వారి చూపు సహజరంగుల మీదకు మళ్లింది. నాచురల్ కలర్స్ వాడకం రోజురోజుకూ ఎక్కువవుతోందక్కడ. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'నేచురల్ ఫైబర్‌ను, నేచురల్ కలర్స్‌నే వాడుదాం, ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకుందాం' అనే స్లోగన్‌తో ఏ ఉద్యమమో పుట్టుకు రావాల్సిన పని లేదు. ఎవరికి వాళ్లం ఆచరిస్తే చాలు.

ప్రకృతి, పర్యావరణం సమతులంగా ఉన్నప్పుడే మన జీవిక కూడా సమతుల్యంగా ఉంటుంది. అప్పుడు పాపాయి గుండెల నిండా గాలి పీల్చుకుంటూ నూలుచీర ఉయ్యాలలో తల్లి పొత్తిళ్లలో ఉన్నంత హాయిగా నిద్రపోతుంది. బిడ్డతో పాటు బిడ్డ జనరేషన్ కూడా పర్యావరణహితంగా ఎదుగుతుంది.

**– వాకా మంజులారెడ్డి**

ట్రోలింగం

# 'ఇరుకు' మాటలు

'హవ్వా! పాశ్చాత్య దుస్తులు ధరించి పవిత్రమైన పార్లమెంట్ ముందు ఫొటోలు దిగుతారా? ఇదేమైనా సినిమా షూటింగ్ అనుకుంటున్నారా? ఎప్పుడు ఎలాంటి వస్త్రధారణ ఉండాలో మీకు తెలియదా? ఇదేమి షూటింగ్ స్పాట్ కాదు, హాలిడే డెస్టినేషన్ కాదు. పార్లమెంట్ అనేది ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటిది. టిక్‌టాక్‌ల స్థలం కాదు. పేజ్‌త్రీ పార్టీకి వెళ్లినట్టుగా ఆ డ్రెస్ ఏంటి? ఫొటోలు తీసుకోవడం మానేసి పని మీద దృష్టిపెట్టండి' ఇలా అనేక రకాల కామెంట్లు చేశారు. ఆధునిక దుస్తులు ధరించి పార్లమెంట్ ముందు ఫొటోలు తీసుకున్నందుకు మిమి చక్రవర్తి, నుస్రత్ జహాన్‌కు సోషల్ మీడియాలో ఎదురైన స్పందన ఇది.

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బెంగాలీ యువ నటీమణులు మిమి చక్రవర్తి, నుస్రత్ జహాన్ రూహి భారీ విజయాలు అందుకున్నారు. జాదవపూర్ నుంచి మిమి చక్రవర్తి 2,95,239 ఆధిక్యంతో విజయం సాధించగా, బాసిర్‌హాట్‌లో నుస్రత్ జహాన్ 3,50,369 మెజార్టీతో విజయదుందుభి మోగించారు. గెలిచిన ఆనందంలో ఉత్సాహంతో తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టి పరవశించారు. తమ అదృష్టానికి మురిసిపోతూ ఆనంద క్షణాలను కెమెరాలో బంధించి సోషల్‌మీడియాలో షేర్ చేశారు. ఇక అక్కడి నుంచి మొదలైంది ఇరుకు మనస్కుల దాడి. ట్విటర్‌లో ట్రోలింగ్ మొదలెట్టేశారు.

**ఇంతకీ వారు ధరించిన డ్రెస్ ఏంటి?**

మిమి చక్రవర్తి తెల్లని చొక్కా, డెనిమ్ జీన్స్ ప్యాంట్ వేసుకోగా.. జహాన్ వైన్ కలర్ పెప్లప్ జిప్‌డ్ టాప్, ప్యాంట్ ధరించారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్, బాలీవుడ్ నటుడు సన్నిడియోల్ కూడా జీన్స్, టీషర్టులు ధరించి తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టినా ఛాందసులకు చీమ కుట్టినట్టు కూడా అనిపించదు. లోక్‌సభకు ఎన్నికైన యువతులు హుందాగా ఉన్న ఆధునిక వస్త్రాలు ధరించి పార్లమెంట్‌కు రావడం మాత్రం నేరంగా తోస్తుంది.


గౌతమ్ గంభీర్

> ఈ వివాదాలు మాకు కొత్తేమి కాదు. గతంలోనూ ఇలాంటివి ఎదుర్కొన్నాం. ఎంపీలు అభ్యర్థులుగా ఎంపికైన నాటి నుంచే మా మీద బురద చల్లడం మొదలుపెట్టారు. మేమేంటో మా పని తీరు ద్వారానే నిరూపించుకున్నాం. ఇప్పుడు మరింత కష్టపడి పనిచేసి విమర్శలకు సమాధానం చెబుతాను. అసంబద్ధ వ్యాఖ్యలను పట్టించుకోకుండా నా నియోజకవర్గ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న పట్టుదలతో ముందడుగు వేస్తాను.
>
> **– నుస్రత్ జహాన్**

ప్రజాప్రతినిధులు హుందాగా ఉండే దుస్తులు ధరించాలనే వాదనలో ఎవరికీ అభ్యంతరాలు ఉండవు. కానీ ఫలానా దుస్తులు వేసుకుంటేనే హుందాతనం వస్తుందని వాదించడంలో అర్థం లేదు. ఆధునిక తరానికి ప్రతినిధులుగా చట్టసభలో అడుగుపెట్టబోతున్న యువతుల వస్త్రధారణపై వివాదం చేయడం శోచనీయం.

మిమి చక్రవర్తి, నుస్రత్ జహాన్ వివాదంతో మరోసారి మహిళ వస్త్రధారణ చర్చనీయాంశంగా మారింది. వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు వీరికి మద్దతుగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎటువంటి దుస్తులు ధరించారనే దాని ఆధారంగా వీరి సామర్థ్యాలను అంచనా వేయడం సరికాదని పేర్కొన్నారు. పార్లమెంట్ చర్చల్లో వీరు ఎంత సమర్థవంతంగా పాల్గొంటారనే దానిపై దృష్టిపెట్టాలిగానీ వస్త్రధారణపై కాదని పేర్కొన్నారు.

**– పోడూరి నాగ శ్రీనివాసరావు,** సాక్షి వెబ్ డెస్క్


మిమి చక్రవర్తి
నుస్రత్ జహాన్

> ఏ రకంగా చూసినా నేను, నుస్రత్ జహాన్ ధరించిన దస్తులు అమర్యాదకరంగా లేవు. మగాళ్లు జీన్స్, టీషర్ట్ ధరించి పార్లమెంట్‌కు వచ్చినా ఎవరూ అభ్యంతరాలు వ్యక్తం చేయరు. మా విషయంలోనే ఎందుకు భిన్నంగా స్పందిస్తున్నారు? వస్త్రధారణ విషయంలో మమ్మల్ని ఎంతగా విమర్శించినా, దూషించినా పట్టించుకోము. పార్లమెంట్ మర్యాదను మంటగలిపామని మేము అనుకోవడం లేదు. సహజత్వం నాకు ఇష్టం. నాకు మద్దతుగా నిలిచినవారికి ధన్యవాదాలు.
>
> **- మిమి చక్రవర్తి**

చెట్టు నీడ / రంజాన్ కాంతులు

# పవళింపు

పూర్వం ఒక రాజు ఉండేవాడు. అత్యంత విలాసవంతమైన జీవితం గడుపుతూ, రాజభోగాలు అనుభవిస్తూ ఉండేవాడు. అనునిత్యం అతనికి సేవలు చేయడానికి లెక్కలేనంతమంది దాస దాసీలు ఉండేవారు. అందులో ఒక దాసీ పని రాజు గారు పవళించడానికి పడకను సింగారించడం. ఒకరోజు ఆ దాసి రాజుగారి పడకను అత్యంత మనోహరంగా సింగారించింది. తరువాత, పడక వైపు తృప్తిగా చూసింది. ఆ క్షణం ఆమెకో వింత ఆలోచన కలిగింది. అత్యంత మనోహరంగా, పూలపరిమళం వెదజల్లుతున్న ఈ పట్టు పానుపుపై ఒక్క క్షణం మేను వాల్చితే ఎలా ఉంటుందోనన్న కోరిక కలిగింది. ఎవ్వరూ చూడ బోరులే అన్న ధీమాతో అలా మేనువాల్చింది అంతే. అలసిసొలసి ఉండడంతో తెలియకుండానే నిద్రపట్టేసింది.



కొంత సేపటి తరువాత రాజు తన గదిలోకి ప్రవేశించాడు. పని మనిషి తన పట్టు పానుపుపై సేద దీరడం చూసి, అగ్గి మీద గుగ్గిలమయ్యాడు. వెంటనే తలారిని పిలిచి, ఈమెను తలకిందులుగా వేలాడదీసి, ప్రాణం పోయేవరకూ కొరడాలతో కొట్టమని, మిగతా వారికి ఈ శిక్ష ఒక గుణపాఠంగా మిగిలిపోవాలని ఆదేశించాడు. వెంటనే రాజాజ్ఞ ఆచరణ రూపం దాల్చింది. ఆ పని మనిషి కొరడా దెబ్బలకు తట్టుకోలేక భయంకరంగా ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టసాగింది. కొంత సేపటి తరువాత, ఆమె అకస్మాత్తుగా నవ్వడం ప్రారంభించింది. దీంతో రాజు ఆశ్చర్యచకితుడై, కొరడా దెబ్బలు ఆపమని ఆదేశించాడు. తరువాత ఏడ్పుకు బదులు నవ్వడానికి కారణమేమిటని ప్రశ్నించాడు. ''రాజా..! ఒక్కొక్క కొరడా దెబ్బకు నాప్రాణం పోయినంత పనవుతోంది. విపరీతమైన బాధ. ఒళ్లంతా పచ్చి పుండు అయి, బాధను భరించలేకపోతున్నాను. మరికొన్ని దెబ్బలకు నా ప్రాణాలు గాల్లో కలిసి పోతాయనిపిస్తోంది. అయితే, కొన్ని నిమిషాలు సుఖ పానుపుపై పడుకున్నందుకే ఇంత భయంకరమైన శిక్ష అనుభవించ వలసి వస్తోందే.. మరి జీవిత కాలం మొత్తం పట్టుపాన్పులపైనే పవళించే వారి పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆలోచన నా బాధను మటుమాయం చేసి, నవ్వు తెప్పించింది'' అన్నది ఆ పని మనిషి. ఈ మాటలతో రాజు కూడా ఆలోచనలో పడ్డాడు. అప్పటివరకూ రాజదర్పంతో, అధికార అహంకారంతో విర్రవీగిన రాజు ముఖారవిందంలో విచార ఛాయ అలుముకుంది. ఆయన శరీరం సన్నగా వణక సాగింది.

మనలోనూ ఆ రాజు లాంటి మనుషులు తారసపడుతుంటారు. కానీ ఈ జీవితం కేవలం సుఖ భోగాలు అనుభవించడానికి కాదు. పరిమితుల మేరకు ప్రాపంచిక సుఖాలు అనుభవిస్తూ, పరలోక సాఫల్యం కోసం పాటుపడాలి.

**– మదీహా అర్జుమంద్**

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నాకు డిగ్రీ నుంచీ డ్రింక్ అలవాటు ఉంది. రీసెంట్‌గా ఓ అమ్మాయి పరిచయం అయ్యింది. పరిచయం అయిన కొన్ని రోజులకే లవ్ యూ అంది. నేనూ ఓకే అన్నాను. అయితే మాటల్లో ‘డ్రింక్ చేస్తావా?’ అని అడిగింది. అవును అని చెప్పాను. ‘ఇకపై డ్రింక్ చెయ్యనని మాటివ్వు. మా డాడీ కూడా డ్రింక్ చేసేవారు. ఆరోగ్యం పాడు చేసుకుని చనిపోయారు. నువ్వు ఇకపై డ్రింక్ చెయ్యడానికి వీల్లేదు’ అంది. నేను చాలా కోప్పడ్డాను. మీరే చెప్పండి అన్నయ్యా... నాకు ఎన్నో ఏళ్లుగా ఉన్న అలవాటుని తన కోసం.. కేవలం తన కోసం వదులుకోవాలా?? అంతకంటే తన్నే వదులుకుంటే పోలా అని అనిపిస్తోంది. ఏం చెయ్యమంటారు?

– లలిత్

నువ్వన్నా లవర్ అంటే!!
నీ కంటే ప్యూర్ లవర్ ఉండడు!!
నీకు ప్యూచర్ ఉంది..!
హిస్టరీకి ఎక్కుతావు..!
నీ గురించి చాప్టర్లు చాప్టర్లు రాస్తారు..!!
నీ మీద రాసిన గ్రంథం నుంచి ఇంపార్టెంట్ పాయింట్స్ స్కూల్ ఆఫ్ లవర్స్‌లో స్టూడెంట్స్ ప్యాసేజ్‌లు రాస్తారు..
ప్రపంచ లైబ్రరీలలో నీ పుస్తకం కాపీలు వాడివాడి మాసిపోతాయి..
‘సార్ మందు కొట్టేది లలిత్.. తూగి తూగి రాస్తుంది మీరు..!? పెగ్గు వేసేది లలిత్.. కిక్కు ఎక్కింది మీకు..!? మీకు మందు వాసన తగిలితేనే యాక్కు చేసుకుంటారు. మరేంటి సార్ మందు బాబును అంతగా ఐస్‌లో పోసి తిప్పుతున్నారు??’
నువ్వేమైనా అను కానీ.. లలిత్ క్లారిటీ ఉన్నోడు. మందు బాటిల్తో సంసారం బెటర్ అని.. పెగ్గు ఫస్ట్ లవర్ అని.. క్వార్టర్‌తో కూడా లైఫ్ ఫుల్‌గా ఎంజాయ్ చెయ్యొచ్చు అని నమ్మి బతుకుతున్నాడు.. ఆ అమ్మాయి ప్రేమలో మజ్జిగ ఉంది.. వీడి ఉన్మాదంలో స్పిరిట్ ఉంది.. రెండూ కలవవు నీలూ!!

**ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళ పరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.**
**లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.**
lovedoctorram@sakshi.com

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 4 | | | 3 | | | 1 | 2 |
| 1 | | 3 | 6 | | 4 | | | 8 |
| | 5 | | | | | 6 | | |
| | | 7 | 8 | | 1 | 4 | 6 | |
| | | 5 | | | | 8 | | |
| | 1 | 6 | 7 | | 5 | 2 | | |
| | | 1 | | | | | 2 | |
| 9 | | | 2 | | 6 | 5 | | 7 |
| 5 | 8 | | | 7 | | | 9 | 6 |

**నిబంధనలు:**
**ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.**

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 7 | 3 | 2 | 6 | 1 | 8 | 9 | 8 |
| 8 | 1 | 2 | 3 | 9 | 6 | 7 | 4 | 6 |
| 9 | 6 | 5 | 8 | 4 | 7 | 3 | 1 | 2 |
| 1 | 9 | 6 | 4 | 7 | 3 | 2 | 5 | 8 |
| 7 | 3 | 8 | 9 | 2 | 5 | 1 | 6 | 4 |
| 2 | 5 | 4 | 1 | 6 | 8 | 9 | 3 | 7 |
| 6 | 4 | 1 | 7 | 8 | 9 | 5 | 2 | 3 |
| 3 | 2 | 7 | 5 | 1 | 4 | 6 | 8 | 9 |
| 5 | 8 | 9 | 6 | 3 | 2 | 4 | 7 | 1 |

## ఇంకో రాణి ఎవరు?

**డి**స్కో రాజా ఫుల్ జోష్‌గా ఉన్నాడు. ఎర్రటి ఎండల్లో హుషారుగా షూటింగ్ చేస్తున్నాడు. డిస్కో రాజా అంటే రవితేజ అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం టైటిల్ ‘డిస్కో రాజా’. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తయింది. రెండో షెడ్యూల్ కూడా మొదలైంది. డిస్కో రాజా సరసన ముగ్గురు రాణులు కనిపిస్తారు. ఒకరు నభా నటేష్. ఇంకో హీరోయిన్ ‘ఆర్‌ఎక్స్ 100’ ఫేమ్ పాయల్ రాజ్‌పుత్. మరో హీరోయిన్ ఎంపిక జరుగుతోంది. మరి.. ఇంకో రాణిగా ఎవరికి అవకాశం దక్కుతుందో చూడాలి. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన లభించిందని చిత్రబృందం పేర్కొంది.


రవితేజ

## స్మాల్ స్టెప్ తీసుకున్నా

**త**మిళ పాఠాలు నేర్చుకుంటున్నారు హీరోయిన్ అమైరా దస్తూర్. హిందీలో ‘మెంటల్ హై క్యా’ సినిమా షూటింగ్‌ను కంప్లీట్ చేసి ‘మేడిన్ చైనా, ప్రస్థానం’ (తెలుగు ‘ప్రస్థానం’ హిందీ రీమేక్) సినిమాలతో బిజీగా ఉన్న ఈ బ్యూటీ ప్రస్తుతం తమిళం నేర్చుకోవడానికి కారణం ఉంది. అధిక్ రవిచందర్ దర్శకత్వంలో ప్రభుదేవా నటించనున్న ఓ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీలో నటించనున్నారట అమైరా. ఈ సినిమాలో సొంత డబ్బింగ్ చెప్పుకోవాలని డిసైడ్ అయ్యారట. అందుకే తమిళం నేర్చుకుంటున్నారు. ‘‘సైకలాజికల్ థ్రిల్లర్ సినిమాల్లో సొంత డబ్బింగ్ చెప్పుకోవడం వల్ల వెండితెరపై ఎక్స్‌ప్రెషన్స్, ఎమోషన్స్ పర్‌ఫెక్ట్‌గా రిఫ్లెక్ట్ అవుతాయి. అలాగే మన పెర్ఫార్మెన్స్‌లోనూ తేడా కనిపిస్తుంది. సినిమా ప్రమోషన్ టైమ్‌లోనూ నాకు బాగా హెల్ప్ అవుతుంది. ఎవరైనా తమిళంలో ఏదైనా చెప్పినప్పుడు పక్కవారిని ట్రాన్స్‌లేట్ చేయమనే బాధ కూడా పోతుంది. నటిగా నన్ను నేను మెరుగుపరుచుకోవడానికి ఇదొక స్మాల్ స్టెప్‌గా భావిస్తున్నాను’’ అని అమైరా చెప్పుకొచ్చారు. ఇంతకుముందు తమిళంలో ‘అనేగన్’ చిత్రంలో ధనుష్ సరసన నటించారామె.


అమైరా

## నాన్‌స్టాప్ గ్యాంగ్

**ఓ** కొత్త ప్లాన్‌తో నాని అండ్ గ్యాంగ్ రంగంలోకి దిగారు. ఆ ప్లాన్ డిటైల్స్ ‘గ్యాంగ్‌లీడర్’ సినిమాలో వెండితెరపై లీక్ అవుతాయి. మనం, 24 వంటి డిఫరెంట్ చిత్రాలతో ప్రేక్షకుల మెప్పు పొందిన విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో నాని హీరోగా రూపొందుతున్న సినిమా ‘గ్యాంగ్‌లీడర్’. కథానాయిక ప్రియాంకా మోహన్ నటిస్తున్న ఈ సినిమాలో ‘ఆర్‌ఎక్స్ 100’ హీరో కార్తికేయ విలన్ పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, చెరుకూరి మోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 70 శాతం పూర్తయింది. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ ఈ నెల 8న హైదరాబాద్‌లో స్టార్ట్ కానుంది. ఆ రోజు నుంచి సినిమా పూర్తయ్యేవరకూ నాన్‌స్టాప్‌గా షూటింగ్ జరపడానికి ప్లాన్ చేశారు. జూలై 5కల్లా గుమ్మడికాయ కొట్టాలని టీమ్ ప్లాన్ వేసింది. ఈ చిత్రాన్ని ఆగస్టు 30న విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సినిమా కాకుండా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో ‘వి’ అనే సినిమాలో విలన్‌గా నటిస్తున్నారు నాని. ఇందులో సుధీర్‌బాబు హీరో.


నాని

## పహిల్వాన్ సుదీప్


సుదీప్

**సు**దీప్ ఇప్పుడు పహిల్వాన్ అయ్యారు. అచ్చమైన పహిల్వాన్‌లా కనిపించడానికి ఆయన ఎంత శ్రద్ధగా కసరత్తులు చేశారో ఇక్కడున్న ఫొటో చూస్తే అర్థమవుతోంది. ‘పహిల్వాన్’ లోని సుదీప్ లుక్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ లుక్ చూసి ఫ్యాన్స్ దిల్ ఖుష్ అయింది. ఇందులో సుదీప్ బాక్సర్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. 2017లో ‘హెబ్బులి’లాంటి సూపర్ హిట్ మూవీ ఇచ్చిన తర్వాత మళ్లీ దర్శకుడు ఎస్. కృష్ణ, సుదీప్ కాంబినేషన్ రూపొందిన చిత్రం ‘పహిల్వాన్’. దాంతో ఈ చిత్రంపై మొదటి నుంచే అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు విడుదలైన లుక్ ఆ అంచనాలను మరింత పెంచింది. కన్నడంతోపాటు హిందీ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

## సస్పెన్స్ సెవెన్

**హ**వీష్ హీరోగా నటించిన చిత్రం ‘7’. ఈ చిత్రానికి కెమెరామేన్ నిజార్ షఫీ దర్శకత్వం వహించారు. కథ అందించి, నిర్మించారు రమేష్ వర్మ. రెజీనా, నందితా శ్వేత, త్రిదా చౌదరి, అనీషా ఆంబ్రోస్, అదితీ ఆర్య, పూజితా పొన్నాడ హీరోయిన్లుగా నటించారు. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో అభిషేక్ నామా మాట్లాడుతూ– ‘‘ఈ సినిమాలో కొత్త హవీష్‌ను చూస్తారు. రమేష్ వర్మ సస్పెన్స్‌తో కూడిన మంచి కథ అందించారు. ఈ కొత్త కాన్సెప్ట్ ఆడియన్స్‌ను థ్రిల్ చేస్తుంది’’ అన్నారు. ‘‘సినిమాపై కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. కథ విన్నప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. నేను విన్న స్టోరీ లైన్‌నే ట్రైలర్‌గా చూపించాం. మంచి స్పందన లభిస్తోంది. అందరూ ప్యాషనేట్‌గా వర్క్ చేశారు. రమేష్ వర్మ సూపర్ కథ అందించారు. కథకు డైరెక్టర్ పూర్తి న్యాయం చేశారు. చైతన్యా భరద్వాజ్ మంచి సాంగ్స్ ఇచ్చారు. జి.ఆర్. మహర్షి తన డైలాగ్స్‌తో అదరగొట్టారు. సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది’’ అని అన్నారు హవీష్. ‘‘ఈ చిత్రం నా కెరీర్‌లో సమ్‌థింగ్ స్పెషల్. రమ్య క్యారెక్టర్ నచ్చి బాగా నటించాను. హవీష్ లవ్లీ కోస్టార్. టీమ్ అంతా మంచి పాజిటివ్ జోష్‌లో ఉన్నాం’’ అన్నారు నందితా శ్వేతా. ‘‘నిజార్ షఫీ గారు ఎన్నో హిట్ సినిమాలకు కెమెరామేన్‌గా వర్క్ చేశారు. ఆయన దర్శకత్వం వహించిన ఈ ఫస్ట్ మూవీ ఆడియన్స్‌కు నచ్చుతుంది’’ అన్నారు పూజిత. ‘‘ఆడియన్స్‌కు ‘7’ డిఫరెంట్ మూవీగా నిలిచిపోతుంది’’ అన్నారు త్రిదా చౌదరి.


హవీష్‌తో నందిత, పూజిత, త్రిదా

## నో కట్స్


శైలజ, సమీర్‌ఖాన్

**మో**డలింగ్ స్టార్స్ సమీర్ ఖాన్, శైలజ జంటగా నటించిన చిత్రం ‘కెఎస్ 100’. షేర్ దర్శకత్వంలో వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ– ‘‘హారర్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. సినిమా చాలా బాగా వచ్చింది. ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన వచ్చింది. మా సినిమాలో హారర్ సన్నివేశాలు ఎక్కువగా ఉండడంతో ‘ఎ’ సర్టిఫికెట్ వచ్చింది’’ అన్నారు. ‘‘ కెఎస్100’ చిత్రం అవుట్‌పుట్ బాగా వచ్చింది. మా సినిమా ఇంత బాగా రావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు. ఒక్క కట్ కూడా లేకుండా ‘ఎ’ సర్టిఫికెట్ పొందడం ఆనందంగా ఉంది’’ అన్నారు షేర్. అక్షిత, అషి, పూర్వి సునీత, శ్రద్ధ, నందిని, కల్పన అజీమ్, సుమన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: నవనీత్ చారి, కెమెరా: వంశీ, నేపథ్యసంగీతం: రామ్ మోహన్ చారి.

## ఊహించడం అంత వీజీ కాదు


టి.ఎన్.కృష్ణ

‘‘ప్రతి ఒక్కరి జీవితంలో బ్యాడ్‌టైమ్ ఉంటుంది. నా జీవితంలోనూ బ్యాడ్‌టైమ్ గడిచింది. అందుకే డైరెక్టర్‌గా గ్యాప్ వచ్చింది’’ అన్నారు దర్శకుడు టి.ఎన్. కృష్ణ. ‘ఆర్‌ఎక్స్ 100’ ఫేమ్ కార్తికేయ హీరోగా టి.ఎన్.కృష్ణ దర్శకత్వంలో కలైపులి యస్. థాను నిర్మించిన చిత్రం ‘హిప్పీ’. ఈ చిత్రంలో దిగంగనా సూర్యవన్షీ, జజ్బాసింగ్ కథానాయికలుగా నటించారు. ఈ సినిమా రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు టి.ఎన్. కృష్ణ చెప్పిన విశేషాలు.

- ‘హిప్పీ’ సినిమాను ముందు తమిళ భాషలో తీద్దాం అనుకున్నాం. ఆ టైమ్‌లో ‘ఆర్‌ఎక్స్ 100’ తమిళ రీమేక్ ఆఫర్ వచ్చింది నాకు. తెలుగు ‘ఆర్ ఎక్స్ 100’ చూశాను. హీరోగా కార్తికేయ బాగా నటించాడు. ఇక రీమేక్ ఎందుకు? అనిపించి స్ట్రయిట్ తెలుగు సినిమా చేద్దామని డిసైడ్ అయ్యాం. ‘హిప్పీ’ కథను కార్తికేయకు చెప్పాం. నచ్చింది అన్నారు. అలా ‘హిప్పీ’ ప్రయాణం మొదలైంది. జాన్ మిల్టన్ అనే బ్రిటిష్ కవి ప్రస్తావించిన ప్యారడైజ్ లాస్, ప్యారడైజ్ గెయిన్ అనే అంశాల ఇన్‌స్పిరేషన్‌తో ఈ సినిమా చేశాను.
- కార్తికేయ బాగా నటించాడు. ఈ సినిమాలో జేడీ చక్రవర్తి క్యారెక్టర్ పాజిటివ్‌గా ఉంటుంది. నిర్మాత థానుగారు ఎంతగానో సపోర్ట్ చేశారు. ఇది యూత్‌ఫుల్ ఫిల్మ్. నేటి యువత రిలేషన్‌షిప్స్‌ను ఎలా డీల్ చేస్తున్నారు? రిలేషన్‌షిప్స్‌లో వారికి ఎదురయ్యే సమస్యలు ఏంటి? అనే అంశాలను ప్రస్తావించాం. ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. నెక్ట్స్ సీన్ ఏంటి? అని ఆడియన్స్ అంత వీజీగా ఊహించలేరు. ఇది కంప్లీట్ లవ్ ఫిల్మ్. ఫ్యామిలీ ఆడియన్స్‌కూ నచ్చుతుంది.
- సోషల్ మీడియా వచ్చిన తర్వాత కల్చరల్ ట్రాన్స్‌ఫార్మేషన్ జరుగుతోంది. నేటి టెక్నాలజీకి అందరూ ట్రాన్స్‌ఫర్ అవుతున్నారు. ఇండస్ట్రీలో అయినా అంతే. అప్‌డేట్ కావాలి.
- ఈ సినిమాలో నా పర్సనల్ లైఫ్ సీన్స్, నా స్నేహితులవి కొన్ని ఉన్నాయి. పర్సనల్ లైఫ్‌లో లవ్‌ని ఫీల్ అవ్వలేనివారు లవ్‌స్టోరీ తీయలేరని నా నమ్మకం. తెలుగు ఇండస్ట్రీ నాకు బాగా నచ్చింది. ఒక్కో లాంగ్వేజ్‌లో ఒక్కో బ్యూటీ ఉంటుంది.
- ‘సిల్లున్ను ఒరు కాదల్’ (‘నువ్వు నేను ప్రేమ’) (2006) సినిమా తర్వాత ఓ సినిమా స్టార్ట్ చేశాం. కొన్ని కారణాల వల్ల ఆ సినిమా ఆగిపోయింది. ఆ తర్వాత ఎనిమిదేళ్లకు నేను చేసిన ‘నెదుంజాలై’ రిలీజైంది. ‘హిప్పీ’ నా మూడో సినిమా. నెక్ట్స్ థానుగారే నా డైరెక్షన్‌లో ఓ సినిమా నిర్మించబోతున్నారు. అలాగే పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో ఓ తెలుగు సినిమా చేయబోతున్నాను.

## హత్యలకు కారణం ఏంటి?

‘‘కొన్ని చిత్రాలకు మ్యూజిక్ డైరెక్టర్‌గా వర్క్ చేశాను. కానీ ప్రస్తుతం నేను సంగీతంపై ఆసక్తిగా లేను. ఫోకస్ అంతా యాక్టింగ్ పైనే పెట్టి మంచి సినిమాలు చేయాలనుకుంటున్నాను. తెలుగు బాగా నేర్చుకున్న తర్వాత టాలీవుడ్‌లో స్ట్రెయిట్ ఫిల్మ్ చేస్తాను’’ అని విజయ్ ఆంటోనీ అన్నారు. విజయ్ ఆంటోనీ, అర్జున్ ప్రధాన పాత్రధారులుగా ఆండ్రూ లూయిస్ దర్శకత్వంలో ప్రదీప్ నిర్మించిన తమిళ చిత్రం ‘కొలైగారన్’. ఇందులో ఆషిమా కథానాయికగా నటించారు. ఈ చిత్రాన్ని ‘కిల్లర్’ అనే టైటిల్‌తో టి. నరేష్ కుమార్, టి. శ్రీధర్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 7న కిల్లర్ చిత్రం విడుదల కానుంది. విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ‘‘ఇందులో సీరియల్ కిల్లర్ పాత్ర చేశాను. దర్శకుడు ఆండ్రూస్ నా క్లాస్‌మేట్. ఈ కథ విన్నప్పుడు ఎగ్జైట్ అయ్యాను. సినిమాలో నేను చెడ్డవాడినా? లేక మంచి వాడినా? అసలు హత్యలకు కారణం ఏంటి? అనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి. ఇది పక్కా కమర్షియల్ మూవీ. వేరే బ్యానర్‌లో నేను చేసిన తొలి చిత్రం ఇదే. ప్రస్తుతం ‘ఖాకి’, ‘జ్వాల’ చిత్రాలు చేస్తున్నాను’’ అని చెప్పారు.


విజయ్ ఆంటోనీ









సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
బుధవారం 5-6-2019

## ఫెలోషిప్స్

### ఎన్ఐటీటీటీఆర్-భోపాల్‌లో 17 జేఆర్ఎఫ్ ఖాళీలు

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్-భోపాల్).. తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.




- **మొత్తం ఖాళీలు:** 17.
- **వేతనం:** నెలకు రూ.28,000. లభ్యత ఆధారంగా క్యాంపస్‌లో వసతి/నిబంధనల మేరకు హెచ్ఆర్ఏ ఉంటుంది.
- **కాలపరిమితి:** తొలుత ఆర్నెల్ల కాలానికి తీసుకుంటారు. ఆ తర్వాత ప్రతిభ ఆధారంగా పొడిగిస్తారు.

**అర్హతలు:**
సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో బీఈ/బీటెక్. అదే విధంగా ఎంఈ/ఎంటెక్/ఎంబీఏ/ఎంటెక్‌ఎడ్.
- ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ప్రాజెక్టుల్లో ఏడాది అనుభవం అభిలషణీయం.
- **ఎంపిక విధానం:** తొలుత అందిన దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఆ తర్వాత రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**అవసరమైన నైపుణ్యాలు:**
- ప్రతిపాదనల రూపకల్పన.
- నివేదికల తయారీ.
- విద్యా పరిశోధనలకు అవసరమైన రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంట్స్ డిజైన్.
- ప్రాజెక్టు ప్రగతి నివేదిక రూపకల్పన.
- సాఫ్ట్‌వేర్ సహాయంతో డేటా విశ్లేషణ.
- నివేదికల సారాంశాన్ని మౌఖికంగా చెప్పగలిగే నేర్పు.

**ముఖ్య సమాచారం:**
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2019, జూన్ 15.
- **వెబ్‌సైట్:** www.nitttrbpl.ac.in

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..
❖ ఎస్‌బీఐ క్లరికల్, పీవో మెటీరియల్
❖ జనరల్ స్టడీస్ మోడల్ పేపర్లు
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి




# కార్పొరేట్ లాయర్

## కాంతులీనే కొలువు

**ఏ కోర్సు చదివినా.. ప్రతి ఒక్క విద్యార్థి లక్ష్యం కోరుకున్న ఉద్యోగం. అందుకోసం డిగ్రీ స్థాయిలోనే తమకు నచ్చే కోర్సులో చేరుతారు. ఇటీవల కాలంలో యువత క్రేజీ కోర్సుల్లో ఒకటిగా నిలుస్తోంది.. లా! 'లా' అనగానే సాధారణంగా గుర్తొచ్చేది.. న్యాయవాద వృత్తి. కానీ, ఇప్పుడు లా కోర్సులు పూర్తిచేసుకున్న వారికి కార్పొరేట్ రంగం సైతం ఆహ్వానం పలుకుతోంది. బ్యాచిలర్ ఆఫ్ లా.. ఆ తర్వాత మాస్టర్ ఆఫ్ లాలో.. కార్పొరేట్ లా స్పెషలైజేషన్ పూర్తిచేసుకుంటే.. కార్పొరేట్ రంగంలో అవకాశాలకు ఆకాశమే హద్దు అంటున్నారు నిపుణులు. కార్పొరేట్ రంగంలో సరికొత్త కెరీర్ ట్రెండ్.. కార్పొరేట్ లా గురించి తెలుసుకుందాం..**

కార్పొరేట్ రంగంలో డిమాండ్ పెరుగుతున్న కోర్సు.. కార్పొరేట్ లా. ఈ కోర్సు పూర్తిచేసుకుంటే... విభిన్నమైన జాబ్ ప్రొఫైల్‌తో కెరీర్ ప్రారంభించొచ్చు. ముఖ్యంగా కార్పొరేట్ లాలో మాస్టర్ స్థాయి స్పెషలైజేషన్ పూర్తిచేసిన అభ్యర్థుల కోసం కంపెనీలు అన్వేషిస్తున్నాయి. ప్రముఖ న్యాయ కళాశాలల్లో క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహించి రూ.లక్షల వార్షిక వేతనం అందిస్తున్నాయి. ఇంతలా కార్పొరేట్ లాయర్స్‌కు డిమాండ్ ఎందుకు పెరుగుతోంది? అని అడిగితే.. అందుకు ప్రపంచీకరణ ముఖ్య కారణమనే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం గ్లోబలైజేషన్, బహుళజాతి కంపెనీల యుగంలో కంపెనీల మధ్య ఒప్పందాలు పెరుగుతున్నాయి. దాంతో సదరు సంస్థలు ఆయా దేశాల చట్టాలకు అనుగుణంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేలా తోడ్పడటమే కార్పొరేట్ లాయర్ ప్రధాన విధి.

### విలీనాలు, సంయుక్త కార్యకలాపాలు

దేశీయంగా సంస్థల మధ్య విలీనాలు.. సంయుక్త కార్యకలాపాల నిర్వహణ ఒప్పందాలు.. సంస్థలను టేకోవర్ చేసే ప్రక్రియలు పెరుగుతున్న విషయం తెలిసిందే. ఇది కార్పొరేట్ లాయర్లకు డిమాండ్ పెరగడానికి దోహదం చేస్తోంది. ఇలాంటి సందర్భాల్లో కార్పొరేట్ చట్టాలు, ట్యాక్స్ చట్టాలకు అనుగుణంగా సదరు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడటం కోసం సంస్థలు కార్పొరేట్ లాయర్లపై ఆధారపడుతున్నాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో కార్పొరేట్ లాయర్‌ను నియమించుకోని కంపెనీలు.. కార్పొరేట్ లా కన్సల్టింగ్ సంస్థలను సంప్రదిస్తూ ఒక్కో ఒప్పందానికి రూ.లక్షలు చెల్లిస్తున్నాయి.

### పూర్తిస్థాయి కార్పొరేట్ లాయర్

కన్సల్టింగ్ సంస్థలపై ఆధారపడేకంటే.. పూర్తిస్థాయిలో కార్పొరేట్ లాయర్‌ను నియమించుకోవడం మేలని కంపెనీలు భావిస్తున్నాయి. అందుకోసం కార్పొరేట్ లా విభాగంలో స్పెషలైజ్డ్ పీజీ చేసిన అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నాయి. అలాంటి అభ్యర్థులకు ప్రముఖ న్యాయ విశ్వవిద్యాలయాల్లో క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తూ నెలకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు వార్షిక వేతనం అందిస్తున్నాయి. ప్రముఖ లాస్కూల్స్‌లో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అధికశాతం విద్యార్థులను కార్పొరేట్ సంస్థలే నియమించుకోవడం ఇందుకు నిదర్శనంగా పేర్కొనొచ్చు.

### ముఖ్య విధులు

తాజా నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించేలా సంస్థకు సలహాలు, సూచనలు ఇవ్వడం కార్పొరేట్ లాయర్ ప్రధాన విధి. అందుకోసం రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, సీబీడీటీ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు, సెబీ తదితర నియంత్రణ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. దీంతోపాటు సైబర్ లా, ఇన్సూరెన్స్ లా, స్టార్టప్ లా, ఐపీఆర్, ట్యాక్సేషన్ లా, లేబర్ లా వంటి అంశాల్లోనూ కార్పొరేట్ లాయర్లు కంపెనీకి అవసరమైన సేవలు అందించాలి. అంతేకాకుండా సంస్థ తరఫున వాదనలు వినిపించేందుకు ప్రభుత్వ నియంత్రణ విభాగాల ముందు హాజరవ్వాల్సి ఉంటుంది.



**కార్పొరేట్ లా నిపుణులకు పెరుగుతున్న డిమాండ్**

**ప్రారంభంలోనే ఆకర్షణీయ వేతనాలు అందుతున్న వైనం**

**పేరున్న లా స్కూల్స్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో భారీ ఆఫర్లు**

### అంతర్గత వివాదాల పరిష్కారం

కార్పొరేట్ లాయర్లు సంస్థల్లోని అంతర్గత వివాదాలు, సమస్యలకు సైతం పరిష్కారం చూపాల్సి ఉంటుంది. ఇందులో లేబర్ లా, కార్పొరేట్ గవర్నెన్స్ విభాగాలు కీలకం. సంస్థల్లో కార్మికులు, యాజమాన్యానికి మధ్య వివాదాలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించడం.. ఉన్నతస్థాయిలో కార్యకలాపాల నిర్వహణ సాఫీగా సాగేలా సలహాలు ఇవ్వడం వంటివి చేయాల్సి వస్తోంది.

### ఎల్‌పీఓ, కేపీఓ సంస్థల్లోనూ

కార్పొరేట్ లాయర్లకు నాలెడ్జ్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (కేపీవో), లీగల్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (ఎల్‌పీవో) సంస్థల్లోనూ అవకాశాలు విస్తృతమవుతన్నాయి. పలు సంస్థలు, వ్యక్తులు నిరంతరం ఏదో ఒక కొత్త ఉత్పత్తిని రూపొందించడం, దానికి సంబంధించి పేటెంట్ హక్కులు పొందడం కోసం ఎల్‌పీవో, కేపీవోలను సంప్రదిస్తుండటంతో కేపీవో, ఎల్‌పీవోల్లో కార్పొరేట్ లాయర్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ సంస్థలు కూడా కార్పొరేట్ లా స్పెషలైజేషన్ చేసిన వారికి ఆకర్షణీయ వేతనాలు అందిస్తున్నాయి.

### ఈ స్కిల్స్ తప్పనిసరి

కార్పొరేట్ లాయర్‌గా నిలదొక్కుకోవాలంటే.. అకడమిక్ నైపుణ్యాలతోపాటు అదనంగా మరికొన్ని స్కిల్స్ కూడా అవసరం. అవి..
✦ కమ్యూనికేషన్ స్కిల్స్ ✦ నెగోషియేషన్ స్కిల్స్ ✦ అనలిటికల్ థింకింగ్ ✦ రీసెర్చ్ స్కిల్స్ ✦ బిజినెస్ అవేర్‌నెస్.

### లభించే హోదాలు

సంస్థల్లో కార్పొరేట్ లా స్పెషలైజ్డ్ అభ్యర్థులకు పలు హోదాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. అవి.. కంప్లయన్స్ ఆఫీసర్, చీఫ్ లీగల్ ఆఫీసర్, లీగల్ కౌన్సెల్, లీగల్ అనలిస్ట్, లీగల్ సర్వీసెస్ ఆఫీసర్. ఎంట్రీ లెవల్‌లో అధిక శాతం సంస్థలు లీగల్ సర్వీసెస్ ఆఫీసర్‌గా నియమించుకుంటున్నాయి. ఆ తర్వాత అనుభవం, పనితీరు ప్రాతిపదికగా లీగల్ డైరెక్టర్ లేదా చీఫ్ లీగల్ ఆఫీసర్ స్థాయికి చేరుకునే అవకాశముంది.

### చదవాల్సిన కోర్సులు

ప్రస్తుతం వేల సంఖ్యలో అవకాశాలు కల్పిస్తున్న కార్పొరేట్ లా విభాగంలో అడుగుపెట్టాలంటే.. ముందుగా ఇంటర్ తర్వాత అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ-ఎల్‌ఎల్‌బీ లేదా బ్యాచిలర్ డిగ్రీ తర్వాత మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ ఉత్తీర్ణులవ్వాలి. ఆ అర్హత ఆధారంగా మాస్టర్ ఆఫ్ లా కోర్సులో కార్పొరేట్ లా స్పెషలైజేషన్‌ను పూర్తిచేయాలి. ప్రస్తుతం దేశంలోని నేషనల్ లా యూనివర్సిటీలు, ఇతర ప్రముఖ లా స్కూల్స్, యూనివర్సిటీల్లో మాస్టర్ ఆఫ్ లాలో.. కార్పొరేట్ లా స్పెషలైజేషన్ అందుబాటులో ఉంది.

**కార్పొరేట్ లాయర్.. ముఖ్యాంశాలు**
- కార్పొరేట్ సంస్థల నుంచి పెరుగుతున్న డిమాండ్.
- ప్రారంభంలో నెలకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు వేతనం.
- ఎంఎన్‌సీలు, కేపీవో, ఎల్‌పీవో సంస్థల్లో అవకాశాలు విస్తృతం.
- లా స్కూల్స్‌లో క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తున్న కంపెనీలు.

**నిత్య విద్యార్థిగా ఉంటేనే..**

కార్పొరేట్ లా స్పెషలైజేషన్ విద్యార్థులకు కార్పొరేట్ లాయర్లుగా ప్రస్తుతం విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. అయితే వీరు తమ కెరీర్‌లో రాణించాలంటే మాత్రం నిత్య విద్యార్థిగా ఉండాల్సిందే. ఎప్పటికప్పుడు మారే కార్పొరేట్ చట్టాలు, ప్రభుత్వ నియమ, నిబంధనలపై తక్షణం అవగాహన ఏర్పరచుకోవాలి.

– సుధాన్షు కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, నల్సార్, హైదరాబాద్.




## ఓఎన్‌జీసీ

**ఖాళీలు 107**

డెహ్రాడూన్‌లోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 107 ఎగ్జిక్యూటివ్ స్థాయి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ **విభాగాల వారీ ఖాళీలు:** మెడికల్ ఆఫీసర్-42, సెక్యూరిటీ ఆఫీసర్-24, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్-31, ఏఈఈ (ఎన్విరాన్‌మెంట్)-1, ఫైర్ ఆఫీసర్-9.
- ✦ **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ లేదా ఐసీడబ్ల్యూఏ/సీఏ లేదా ఎంబీఏ; ఎంబీబీఎస్/పీజీ/ఇంజనీరింగ్ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- ✦ **వయసు:** 30 ఏళ్లకు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీ, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు అయిదేళ్లు; పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ✦ **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీలకు రూ.370; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు ఫీజు లేదు.
- ✦ **పరీక్షతేదీ:** జులై చివరి వారంలో ఉంటుంది.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 18, 2019.
- ✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ongcindia.com

## ఇండియన్ నేవీ

**ఆఫీసర్ పోస్టులు**

ఇండియన్ నేవీ యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్ (యూఈఎస్) ద్వారా షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఆఫీసర్ (ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ బ్రాంచ్‌లు) పోస్టుల భర్తీకి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. **ఎగ్జిక్యూటివ్ విభాగాలు:** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్.
2. **టెక్నికల్ విభాగాలు:**

- ✦ **ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు:** మెకానికల్, మెరైన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రొడక్షన్, ఏరోనాటికల్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, కంట్రోల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్, ఆటోమొబైల్స్, మెటలర్జీ, మెకట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్.
- ✦ **ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లు:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పవర్ ఇంజనీరింగ్, కంట్రోల్ సిస్టమ్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఏవియానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్, ఇన్‌స్ట్రుమెంటేషన్.
- ✦ **అర్హత:** బీఈ/బీటెక్ చివరి ఏడాది చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ముందు సెమిస్టర్లన్నీ కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ **వయసు:** జులై 2, 1996-జులై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి.
- ✦ **ఎంపిక:** క్యాంపస్ ఇంటర్వ్యూ, షార్ట్‌లిస్టింగ్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **శిక్షణ:** ఎంపికైన వారికి ఎజిమల (కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీలో 2020, జూన్ నుంచి శిక్షణ మొదలవుతుంది. 22 వారాల పాటు నేవల్ ఓరియంటేషన్ కోర్సు నిర్వహిస్తారు. ప్రొఫెషనల్ ట్రైనింగ్ (నేవల్ షిప్స్, ట్రైనింగ్) కూడా ఉంటుంది. ఎగ్జిక్యూటివ్ (ఐటీ) ఎంట్రీ అభ్యర్థులకు 4 వారాల శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలో సబ్ లెఫ్టినెంట్ హోదాలో కొనసాగుతారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తులు ప్రారంభం:** జూన్ 7, 2019.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 27, 2019.
- ✦ **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

## ఈఐఎల్

**ఖాళీలు 79**

న్యూఢిల్లీలోని ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 79 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ **విభాగాల వారీ ఖాళీలు:** మెకానికల్-36, సివిల్-16, కెమికల్-10, ఎలక్ట్రికల్-9, ఇన్‌స్ట్రుమెంటేషన్-8.
- ✦ **అర్హత:** కనీసం 65 శాతం మార్కులతో ఫుల్‌టైం బీఈ/బీటెక్/బీఎస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణత.
- ✦ **వయసు:** 2019, జులై 1 నాటికి జనరల్ అభ్యర్థులకు 25 ఏళ్లు; ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు 28 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీలకు 30 ఏళ్లు; పీడబ్ల్యూడీలకు 35 ఏళ్లు మించకూడదు.
- ✦ **ఎంపిక:** గేట్-2019 స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 20, 2019.
- ✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.engineersindia.com

## ఏఐఈఎస్ఎల్

**ఖాళీలు 40**

ఎయిరిండియా అనుబంధ శాఖ అయిన ఎయిరిండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్ఎల్).. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన 40 యుటిలిటీ హ్యాండ్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ **ఒప్పంద కాలం:** ప్రాథమికంగా మూడేళ్లు.
- ✦ **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు వెహికల్ లైసెన్స్, నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- ✦ **వయసు:** 2019, మార్చి 31 నాటికి 33 ఏళ్లకు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- ✦ **ఎంపిక:** ట్రేడ్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తు ఫీజు:** రూ.500. (ఎక్స్-సర్వీస్‌మెన్, ఎస్సీ, ఎస్టీలకు ఫీజు లేదు).
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 24, 2019.
- ✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.airindia.com

## బెల్

**ఖాళీలు 31**

బెంగళూరులోని భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) ఒప్పంద ప్రాతిపదికన 31 ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **ఇంజనీర్ పోస్టులు:** 25 (ఎలక్ట్రానిక్స్-20, మెకానికల్-5).
   - ✦ **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ప్రథమశ్రేణిలో బీఈ/బీటెక్ (ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/మెకానికల్) ఉత్తీర్ణత.
   - ✦ **వయసు:** 2019, మే 1 నాటికి జనరల్ అభ్యర్థులకు 26 ఏళ్లు; ఓబీసీలకు 29 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీలకు 31 ఏళ్లు మించకూడదు.
2. **డిప్యూటీ ఇంజనీర్ పోస్టులు:** 6
   - ✦ **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. నిర్దిష్ట అనుభవం కూడా ఉండాలి.
   - ✦ **వయసు:** 2019, మే 1 నాటికి 27 ఏళ్లకు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

- ✦ **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 19, 2019.
- ✦ **వెబ్‌సైట్:** www.belindia.in

## సదరన్ రైల్వే

**ఖాళీలు 95**

చెన్నై ప్రధాన కేంద్రంగా విధులు నిర్వహిస్తున్న సదరన్ రైల్వే ఒప్పంద ప్రాతిపదికన 95 ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ అండ్ డిజిటల్ ఆఫీస్ అసిస్టెంట్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ **అర్హత:** బీసీఏ/బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్/ఐటీ) లేదా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఎంఎస్ ఆఫీస్ సర్టిఫికెట్ ఉండాలి.
- ✦ **వయసు:** 2019, జనవరి 1 నాటికి 18-28 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; దివ్యాంగులకు పదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఉమెన్, ఈబీసీ, మైనార్టీలకు రూ.250; మిగిలిన వారికి 500.
- ✦ **ఎంపిక:** రాత పరీక్ష/ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 30, 2019.
- ✦ **వెబ్‌సైట్:** www.rrcmas.in

## ఎయిర్‌ఫోర్స్

**ఎయిర్‌మెన్**

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఎయిర్‌మెన్ (గ్రూప్ ఎక్స్, గ్రూప్ వై, గ్రూప్ వై మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్) పోస్టుల భర్తీకి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ **అర్హత:** సంబంధిత సబ్జెక్టులతో ఇంటర్మీడియట్/10+2 లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత.
- ✦ **వయసు:** 19, జులై 1999-జులై 1, 2003 మధ్య జన్మించి ఉండాలి.
- ✦ **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తులు ప్రారంభం:** జులై 1, 2019.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 15, 2019.
- ✦ **ఆన్‌లైన్ ఎగ్జామ్ తేదీ:** 2019, సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు.
- ✦ **వెబ్‌సైట్:** http://indianairforce.nic.in